తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.TELTEL / 2013 /50370

మంగళవారం 25.11.2025 | సంపుటి :12 సంచిక : 125 | పేజీలు :12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698




# తెలంగాణ నోయిడాగా కొడంగల్‌ను తీర్చిదిద్దుతాం



## ఇంటర్‌నేషనల్ ఎడ్యుకేషన్ హబ్‌గా మలుస్తాం

- మహిళలు ఆత్మగౌరవంతో బతికేందుకు కృషి
- కొడంగల్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన
- అక్షయపాత్ర ఫౌండేషన్ కిచెన్ పరిశీలన
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన


**3, 4 రోజుల్లో సర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్ : సీఎం**



**కొడంగల్(జనంసాక్షి):**కొడంగల్‌లో ఏ విద్యార్థీ ఆకలితో ఉండకూడదన్న లక్ష్యంతో ఏర్పాట్లు చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వివరించారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 28 వేల మందికి ఉదయం అల్పాహారం అందిస్తున్నామని వెల్లడించారు. దీంతో ప్రభుత్వ బడుల్లో 5 వేల మంది విద్యార్థులు పెరిగారని ఆయన తెలిపారు. వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి అక్కడి 'అక్షయ పాత్ర ఫౌండేషన్ కిచెన్'ను పరిశీలించారు. మధ్యాహ్న భోజన కిచెన్ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. జీవితాల్లో మార్పు రావాలంటే పిల్లల్ని చదివించాలని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కొడంగల్‌లో రూ.5 వేల కోట్లతో ఎడ్యుకేషన్ క్యాంపస్ నిర్మిస్తున్నామని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో తొలి సైనిక్ స్కూల్‌ను ఇక్కడే ఏర్పాటు చేయబోతున్నామని వివరించారు. 16 నెలల్లోగా కొడంగల్‌ను అంతర్జాతీయ ఎడ్యుకేషన్ హబ్‌గా తయారు చేస్తామని

మిగతా 2లో..

# ధర్మేంద్ర కన్నుమూత



**కొంతకాలంగా వృద్ధాప్య అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న బాలీవుడ్ దిగ్గజ నటుడు**

**ధర్మేంద్ర మృతికి రాష్ట్రపతి, ప్రధానమంత్రి సంతాపం**

**ముంబై(జనంసాక్షి):**భారత సినిమా రంగానికి అపారమైన సేవలందించిన బాలీవుడ్ లెజెండరీ నటుడు ధర్మేంద్ర కన్నుమూశారు. సోమవారం ఉదయం ఆయన తుది శ్వాస విడిచారు. ఆయన మరణవార్త తెలుసుకున్న పలువురు సినీ ప్రముఖులు ధర్మేంద్ర నివాసానికి చేరుకుని నివాళి అర్పించారు. 89 ఏండ్ల ధర్మేంద్ర గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. పది రోజుల క్రితం ముంబైలోని క్యాండి ఆస్పత్రిలో చేరి చికిత్స పొందారు. అప్పటినుంచి ఆయన ఆరోగ్యంపై రకరకాలుగా వార్తలు వచ్చాయి. ఇప్పటి వరకూ ధర్మేంద్ర వెంటిలేటర్‌పై ఉన్నారంటూ జాతీయ మీడియాలో వరుస కథనాలు వచ్చాయి. ఆరోగ్యం క్షీణించడంతో తుదిశ్వాస విడిచినట్లు తెలుస్తోంది. 1958లో దిల్ బీ తేరా హమ్ బీ తేరే చిత్రంతో తెరంగేట్రం చేసిన ధర్మేంద్ర, తన కెరీర్‌లో 'షోలే', 'చుప్కే చుప్కే', 'ధర్మ్ వీర్', 'సీతా ఔర్ గీత', 'యాదోం కి బారాత్' వంటి ఎన్నో క్లాసిక్

మిగతా 2లో..

# చీఫ్ జస్టిస్‌గా సూర్యకాంత్ ప్రమాణం



**ప్రమాణం చేయించిన రాష్ట్రపతి ముర్ము • హాజరైన పలుదేశాల న్యాయమూర్తులు**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయ మూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో సోమవారంనాడు జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయన చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఆదివారంనాడు పదవీ విరమణ చేసిన సీజేఐ బిఆర్ గవాయ్ స్థానంలో జస్టిస్ సూర్యకాంత్ బాధ్యతలు స్వీకరించారు. 2027 ఫిబ్రవరి 9వ తేదీ వరకూ ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. సీజేఐగా బాధ్యతలు చేపట్టిన తొలి హరియాణా వాసిగా జస్టిస్ సూర్యకాంత్ రికార్డు సృష్టించారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో తొలిసారిగా భూటాన్, కెన్యా, మలేసియా, మారిషస్, నేపాల్, శ్రీలంక దేశాల

మిగతా 2లో..



# కబడ్డీ ప్రపంచకప్ విజేతగా భారత మహిళల జట్టు

**ఫైనల్‌లో 35-28తో చైనీస్ తైపీపై గెలుపు**

భారత మహిళల కబడ్డీ జట్టు ప్రపంచ కప్ విజేతగా నిలిచింది. ఫైనల్‌లో 35-28తో చైనీస్ తైపీపై గెలు పొందింది. ఈ మ్యాచ్ ఆరంభం నుంచి హెూరాహెూరీగా సా గింది. తొలి అర్ధ భాగం ముగిసేసరికి భారత్ 20-16తో ఆధిక్యంలో నిలిచింది. తర్వాత కూడా ప్రత్యర్థి జట్టు గట్టి పోటీ ఇచ్చింది. మరో ఐదు నిమిషాల్లో ఆట ముగుస్తుందనగా భారత్ 29-24తో నిలిచింది. చివరకు ఏడు పాయింట్ల తేడాతో గెలిచిన భారత్ వరుసగా రెండో టైటిల్‌ను దక్కించుకుంది.

2 లో..

# మహిళా స్వయం సహాయక సంఘాలకు నిధుల వరద

**రూ.304 కోట్ల వడ్డీ లేని రుణాలకు ప్రభుత్వం ఉత్తర్వులు**

- 3,57,098 గ్రామీణ మహిళా స్వయం సహాయక సంఘాల ఖాతాల్లో ఈ నిధుల జమ
- అధికారులతో డిప్యూటి సీఎం వీడియో కాన్ఫరెన్స్




**హైదరాబాద్,నవంబరు 24(జనంసాక్షి):** రాష్ట్రంలో మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. తాజాగా మహిళా స్వయం సహాయక సంఘాలకు తెలంగాణ ప్రభుత్వం మరో శుభవార్త చెప్పింది. ఈ మహిళా సంఘాలకు రూ. 304 కోట్ల వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం విడుదల చేసింది. 3,57,098 గ్రామీణ మహిళా స్వయం సహాయక సంఘాల ఖాతాల్లో ఈ నిధులను జమ చేసింది. సోమవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క ఆధ్వర్యంలో జిల్లా డీఆర్‌డీఏ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ఈ నిధులను మహిళలకు అందచేయనున్నారు. నియోజకవర్గాల వారీగా కార్యక్రమం జరుగుతుందని డిప్యూటి సిఎం భట్టి వెల్లడించారు. ములుగు జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి సీతక్క.. ఏటూరు నాగారం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా పక్షపాతి అని తెలిపారు.ఆడబిడ్డలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వేల కోట్ల రూపాయల నిధులను సమకూరుస్తున్నామని చెప్పారు. మహిళా సంఘాలకు వడ్డీ భారం లేకుండా ప్రభుత్వమే వాటిని చెల్లిస్తోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం మహిళా సంఘాలకు రూ. 3,500 కోట్ల వడ్డీలను ఎగవేసిందంటూ బీఆర్ఎస్ పార్టీపై ఈ సందర్భంగా సీతక్క మండిపడ్డారు. అంతే కాకుండా స్వయం సహాయక సంఘాల్లోని మహిళల పొదుపు సొమ్మును సైతం గత ప్రభుత్వం కాజేసిందని విమర్శించారు. అక్కా చెల్లెమ్మల కష్టార్జితమైన అభయహస్తం నిధులను కూడా ప్రభుత్వం మింగేసిందన్నారు. కానీ తమ ప్రజా ప్రభుత్వం మహిళల సాధికారత కోసం ఎన్నో పథకాలను ప్రారంభించిందని గుర్తు చేశారు. మహిళలకు నిధులను సమీకరించడమే కాదు..

మిగతా 2లో..

# వేలకొద్ది హిడ్మాలు పుట్టుకొస్తారు!



ఇటీవల మరణించిన మావోయిస్ట్ కమాండర్ మద్వి హిడ్మా ఎన్‌కౌంటర్ భూటకమంటూ ఢిల్లీలో వేలమంది యువత

- ఢిల్లీలోని ఇండియా గేటువద్ద యువత నిరసన
- దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన ఘటన
- జల్, జంగిల్, జమీన్ కోసం పోరాటం ఆగదు
- రెడ్ సెల్యూట్ టూ హిడ్మా.. అమర్ రహే అంటూ పోస్టర్ ప్రదర్శించి నినాదాలు

అతడి చిత్రపటాలతో ఉన్న పోస్టర్లను ప్రదర్శిస్తూ ఆందోళన నిర్వహించారు. నిరసనకారులు రోడ్లను దిగ్బంధించడానికి ముందుకురాగా పోలీసులు వారిని చెదరగొట్టాడానికి ప్రయత్నించారు. ఆందోళనకారులు తమ నిరసనను తెలియజేస్తూ పోలీసులను తీవ్రంగా ప్రతిఘటించారు. ఈ క్రమంలో పోలీసులు పలువురు యువకులను ఆరెస్టు చేసిన వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. - న్యూఢిల్లీ,జనంసాక్షి

# ఈఎస్ఐ ఆస్పత్రిలో ప్రమాదం

- పునర్నిర్మాణ పనులు చేపడుతుండగా కార్మికులపై కూలిన సెంట్రింగ్
- ఒకరి మృతి, ఇద్దరి పరిస్థితి విషమం

**అమీర్‌పేట(జనంసాక్షి):** సనత్‌నగర్ ఈఎస్ఐ ఆస్పత్రిలో ప్రమాదం చోటుచేసుకుంది. ఎమర్జెన్సీ వార్డు భవనంలో పునర్నిర్మాణ పనులు చేపడుతుండగా.. సెంట్రింగ్ కూలి కార్మికులపై పడింది. ఈ ఘటనలో ఒక కార్మికుడు మృతి చెందగా.. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుడిని భానుచందర్‌గా గుర్తించారు.

మిగతా 2లో..






# తెలంగాణ భూములు కార్పొరేట్లకు ఎట్లిస్తరు?

- భూ కుంభకోణాన్ని నిలదీయండి
- జీహెచ్ఎంసీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లతో కేటీఆర్

**హైదరాబాద్(జనంసాక్షి):** పార్టీ వెంటే ఉన్న ప్రతి కార్పొరేటర్‌కు భవిష్యత్తులో మరిన్ని పదవులు వస్తాయని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో జీహెచ్ఎంసీ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లతో ఆయన సమావేశమయ్యారు. బల్దియా సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. పదేళ్ల పాటు ఎలాంటి అవినీతికి తావు లేకుండా పనిచేశారని.. కరోనా వంటి తీవ్ర సంక్షోభంలోనూ అద్భుతంగా సేవలందించారని కొనియాడారు.ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత కార్పొరేటర్లు ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలపై పోరాటం చేశారన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పోరాడిన తీరుకు కేటీఆర్ అభినందనలు తెలిపారు. పరిశ్రమలకు కేటాయించిన వాటితో పాటు హైదరాబాద్‌లో భూముల అమ్మకంపై బల్దియా సమావేశంలో నిలదీయాలని ఆయన సూచించారు.


మిగతా 2లో..

**రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి..**

# పంచాయతీ ఎన్నికలకు సిద్ధం

## ఎస్ఈసీకి తెలిపిన ప్రభుత్వం

**హైదరాబాద్(జనంసాక్షి):**పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ల ప్రక్రియను ప్రభుత్వం పూర్తి చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘానికి వివరాలు సమర్పించి, ఎన్నికలకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది. అన్ని జిల్లాల కలెక్టర్లు సమర్పించిన సర్పంచ్, వార్డు సభ్యుల గెజిట్‌లను ప్రభుత్వం ఎస్ఈసీకి పంపింది. పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలకు నిర్వహించాలని నిర్ణయించిన ప్రభుత్వం..దీనికి సంబంధించి తీవ్ర కసరత్తు చేసింది. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన అన్ని రిజర్వేషన్లతోపాటు, లాటరీ విధానంలో మహిళా రిజర్వేషన్లను కూడా పూర్తి చేసింది.పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన పిటిషన్‌పై ఇవాళ హైకోర్టులో విచారణ జరగాల్సింది. అయితే, ప్రధాన న్యాయమూర్తి సెలవులో ఉన్నందువల్ల విచారణ జరగలేదు. మంగళవారం విచారణ తర్వాత నోటిఫికేషన్ జారీ చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా సిద్ధంగా ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా 12,733 పంచాయతీల్లోని 1,12,288 వార్డుల్లో మూడు విడతలుగా ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీ ఏర్పాట్లు చేసింది.



# కోకాపేట భూములకు రెక్కలు

## ఎకరం ధర రూ.137 కోట్లు

నగర శివారులోని కోకాపేటలో భూములు రికార్డు ధర పలికాయి. ఎకరం ధర అత్యధికంగా రూ.137.25 కోట్లు పలికింది. కోకాపేటలోని నియోపోలిస్ ప్రాంతంలోని సర్వే నంబర్ 17, 18లోని భూములకు వేలం నిర్వహించగా.. సర్వే నంబర్ 17లోని భూమి ఎకరం 137.25 కోట్లు పలికింది. హెచ్ఎండీఏ పరిధిలోని ఖరీదైన భూములను ఆన్‌లైన్‌లో వేలం వేయడానికి ప్రభుత్వం నిర్ణయించి నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇటీవల రాయదుర్గంలో 7.67 ఎకరాలకు టీజీఐఐసీ నిర్వహించిన వేలంపాటలో రూ.1,357 కోట్లకు ఓ సంస్థ దక్కించుకుంది. ఇక్కడ కనీస ధర ఎకరాకు రూ.101 కోట్లుగా నిర్ణయించగా.. వేలంలో రూ.177 కోట్లు పలికింది. ఈ నేపథ్యంలో తాజాగా కోకాపేట నియోపోలీస్‌లోని సర్వే నంబర్ 17, 18లోని భూములను హెచ్ఎండీఏ వేలం వేసింది. ఎకరా కనీస ధర రూ.99 కోట్లుగా నిర్ణయించగా.. అత్యధికంగా రూ.137.25 కోట్లు పలికింది. హైదరాబాద్(జనంసాక్షి):


జనంసాక్షి www.janamsakshi.org
మంగళవారం 25.11.2025

## అరుణాచల్ ప్రదేశ్ చైనాదే..

- చైనా ఎయిర్‌పోర్టులో భారత యువతిని అవమానించిన అధికారులు
- పాస్‌పోర్ట్ ఉన్నా..చెల్లదని వేధింపులు



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** చైనా మరోమారు తన కుత్సిత బుద్ధిని చాటుకుంది. అరుణాచల్ తమదే అన్న వాదన కోసం ఏ చిన్న అవకాశం దొరికినా వదలడం లేదు. తాజాగా ఇలాంటి ఘటన కలకలం రేపింది.చైనాలో షాంఘై పుడాంగ్ విమానాశ్రయంలో భారత మహిళకు వేధింపులు ఎదురయ్యాయి. అరుణాచల్ ప్రదేశ్ చైనాదే అంటూ తన భారత పాస్‌పోర్ట్‌ను గుర్తించేందుకు ఆ దేశ అధికారులు నిరాకరించారని ఆమె ఆరోపించారు. ఈ మేరకు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈనెల 21న పెమా వాంగ్‌జోమ్ థాంగ్‌డోక్ అనే మహిళ లండన్ నుంచి జపాన్‌కు వెళ్లే విమానం ఎక్కారు. అయితే ట్రాన్సిట్ హాల్ట్ కోసం అది చైనా నగరం షాంఘైలో దిగింది. అక్కడ తన పాస్‌పోర్ట్‌ను అధికారులు తనిఖీ చేశారని ఆమె చెప్పారు. అందులో తాను పుట్టిన రాష్ట్రం పేరు అరుణాచల్ ప్రదేశ్ అని ఉందని వెల్లడించారు. అది చూసిన తర్వాత ఇమిగ్రేషన్ అధికారులు తన పాస్‌పోర్ట్ చెల్లదని ప్రకటించారని ఆమె ఆరోపించారు. వారు ఆ ఈశాన్య రాష్ట్రాన్ని చైనాలో భాగమని పట్టుబట్టారన్నారు. ఇమిగ్రేషన్ అధికారులు, చైనా ఈస్టర్న్ ఎయిర్‌లైన్స్ సిబ్బంది తనవైపు చూసి నవ్వారని, చైనీస్ పాస్‌పోర్ట్‌కు దరఖాస్తు చేసుకోమని హేళన చేశారని ఆమె వాపోయారు. చెల్లుబాటు అయ్యే వీసా ఉన్నా కూడా తన పాస్‌పోర్ట్‌ను స్వాధీనం చేసుకున్నారని, జపాన్ వెళ్లే విమానం ఎక్కనివ్వలేదని మీడియాకు వెల్లడించారు. తనను ట్రాన్సిట్ ఏరియాకే పరిమితం చేశారని, మళ్లీ టికెట్లు బుక్ చేసుకోనివ్వలేదని, చివరకు ఆహారం కొనేందుకు కూడా అంగీకరించలేదన్నారు. యూకేలోని ఫ్రెండ్ ద్వారా షాంఘైలోని భారత దౌత్య కార్యాలయాన్ని సంప్రదించిన తర్వాతే తనకు సహాయం అందిందని పేర్కొన్నారు. భారత అధికారుల సహాయంతోనే తాను అక్కడి నుంచి బయట పడినట్లు చెప్పారు. అలాగే దీనిపై తాను ప్రధాని మోదీకి, ఇతర సీనియర్ అధికారులకు లేఖ రాసినట్లు చెప్పారు. ఇదంతా భారత సార్వభౌమత్వాన్ని, అరుణాచల్ ప్రదేశ్ ప్రజలను అవమానించడమేనని ఆ లేఖలో అభివర్ణించారు. ఈ పెమా వాంగ్‌జోమ్ థాంగ్‌డోక్ ప్రస్తుతం యూకేలో నివసిస్తున్నారు.ఈ వ్యవహారంపై అధికారికంగా ఎలాంటి స్పందనా రాలేదు.



## సిమ్ దుర్వినియోగమైతే యజమానిదే బాధ్యత

**టెలికాం విభాగం కీలక ప్రకటన**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**కొందరు సిమ్‌కార్డులు ఎడాపెడా కొనుగోలు చేసి మూలన పడేస్తుంటారు. వాడడం లేదన్న కారణంతో ఏదో ఒక సందర్భంలో తెలిసిన వ్యక్తులే కదా అని ఇచ్చేస్తుంటారు. ఒకవేళ అలా ఇచ్చిన నంబర్ సైబర్ మోసాలకో, చట్టవ్యతిరేక కార్యకలాపాలకో వాడినట్లు తేలితే ఆ సిమ్ కార్డు యజమానిగా మీరూ బాధ్యులే! ఈ మేరకు సిమ్‌కార్డు దుర్వినియోగంపై టెలికాం విభాగం సోమవారం కీలక ప్రకటన చేసింది. సిమ్ కార్డుల విషయంలో అప్రమత్తంగా ఉండడంతో పాటు ట్యాంపర్ చేసిన మొబైల్ డివైజుల వాడకానికి దూరంగా ఉండాలని పౌరులకు సూచిస్తూ ఓ ప్రకటన విడుదల చేసింది.ట్యాంపర్ చేసిన మోడెమ్‌లు, మాడ్యూల్స్, సిమ్ బాక్సులను కొనుగోలు చేయడం లేదా వినియోగించడం నేరమని డాట్ పేర్కొంది. అలాగే, నకిలీ పత్రాలు సమర్పించి సిమ్ కార్డులను కొనుగోలు చేయడం, మీ పేరుమీద కొనుగోలు చేసిన సిమ్‌కార్డులను వేరొకరికి ఇవ్వడమూ నేరమని తెలిపింది. సైబర్ నేరాలు, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు మీ సిమ్‌కార్డు వినియోగించినట్లు తేలితే తీవ్రమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపింది. ఇలా నేరానికి పాల్పడినవారు సహా ఆ సిమ్‌కార్డు యజమాని కూడా చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. కాలింగ్ లైన్ ఐడెంటిటీ లేదా ఇతర టెలికాం గుర్తింపులను మార్చగలిగే మొబైల్ యాప్‌లు, వెబ్‌సైట్లను ఉపయోగించొద్దని కూడా సూచించింది.టెలికమ్యూనికేషన్స్ చట్టం, 2023 ప్రకారం.. మొబైల్స్ సహా ఇతర డివైజుల్లో ఇంటర్నేషనల్ మొబైల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ ట్యాంపర్ చేస్తే మూడేళ్ల వరకు జైలు, రూ.50 లక్షల వరకు జరిమానా ఉంటుంది. కొన్ని సందర్భాల్లో రెండూ విధించే అవకాశం ఉంటుందని డాట్ తెలిపింది. టెలికమ్యూనికేషన్స్ రూల్స్, 2024 ప్రకారం.. ఐఎంఈఐ మార్పు చేసిన డివైజులను వాడడం నిషేధమని డాట్ గుర్తుచేసింది. సంచార్ సాథి లేదా సంచార్ సాథి మొబైల్ యాప్‌లో ఐఎంఈఐ వివరాలను తనిఖీ చేసుకోవాలని పౌరులకు సూచించింది. వివరాలు ఎంటర్ చేస్తే బ్రాండ్ నేమ్, మోడల్, తయారీ వివరాలు దర్శమిస్తాయని తెలిపింది. టెలికాం వనరుల దుర్వినియోగాన్ని నిరోధించడానికి, పౌరులందరికీ సురక్షితమైన టెలికమ్యూనికేషన్ పర్యావరణ వ్యవస్థను అందించడం కోసం ప్రభుత్వం కఠినమైన తనిఖీలను ఏర్పాటు చేసిందని డాట్ పేర్కొంది.

## నేవీ అమ్ముల పొదిలో మరో అస్త్రం

**నేవీ చేతికి 'సైలెంట్ హంటర్' 'ఐఎన్ఎస్ మాహె'**



**ముంబయి(జనంసాక్షి):** భారత అమ్ముల పొదిలో మరో అస్త్రం చేరింది. తొలి యాంటీ సబ్‌మెరైన్ వార్ఫేర్ షాలో (ఏఎస్‌డబ్ల్యూఎస్) వాటర్ క్రాఫ్ట్ 'ఐఎన్ ఎస్ మాహె' సోమవారం నౌకాదళం సర్వీసులో చేరింది. ముంబయిలోని నేవల్ డాక్‌యార్డ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది దీన్ని నేవీకి అప్పగించారు. కొచ్చిన్ షిప్‌యార్డులో నిర్మించిన ఈ 'ఐఎన్ఎస్ మాహె'లో 80 శాతం స్వదేశీ సాంకేతికతను వినియోగించారు. 'సైలెంట్ హంటర్'గా పిలిచే ఈ నౌక వెస్ట్రన్ సీబోర్డు అధీనంలో కార్యకలాపాలు కొనసాగించనుంది.మలబార్ తీరంలోని చారిత్రక పట్టణం 'మాహె' పేరును ఈ నౌకకు పెట్టారు. దీని పైభాగంలో 'ఉరుమి'ని ఏర్పాటుచేశారు. ఇది కలరిపయట్టులో ఉపయోగించే ఒక రకమైన ఆయుధం. పొడవైన, సన్నని కత్తి ఇది. చురుకుదనం, కచ్చితత్వం, యుద్ధ సమర్థతను ఇది సూచిస్తుంది. ఈ నౌక రాకతో సముద్ర తీరాలపై భారత ఆధిపత్యం మరింత పటిష్టం కానుంది. జలాంతర్గాములను వేటాడేందుకు, తీర ప్రాంతంలో గస్తీని నిర్వహించేందుకు దీన్ని అధునాతన సామర్థ్యాలతో నిర్మించారు. సముద్ర గర్భంలో నిఘాతో పాటు రెస్క్యూ మిషన్లలోనూ ఈ నౌక పాల్గొననుంది.

## అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనే..

**రాజ్‌నాథ్ వ్యాఖ్యలు హిందూత్వ విస్తరణవాద మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయి.. తీవ్రంగా స్పందించిన పాక్**

**ఇస్లామాబాద్(జనంసాక్షి):** భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తాజాగా పాకిస్తాన్‌లోని సింధ్ ప్రావిన్స్ గురించి చేసిన వ్యాఖ్యలపై పాకిస్తాన్ తీవ్రంగా స్పందించింది.సోమవారం పాకిస్తాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదల చేస్తూ.. భవిష్యత్తులో సింధ్ భారతదేశానికి తిరిగి చెందవచ్చంటూ రాజ్‌నాథ్ సింగ్ చేసిన వ్యాఖ్యలు భ్రాంతితో కూడినవని, ఇది విస్తరణవాద, అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘన కిందకు వస్తాయని పేర్కొంది. రాజ్‌నాథ్ సింగ్ మాటలు హిందూత్వ విస్తరణవాద మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయని ఆరోపించింది. ఇటువంటి వ్యాఖ్యలు వాస్తవాలను సవాలు చేస్తున్నాయని, రాష్ట్రాల సార్వభౌమత్వాన్ని ఉల్లంఘిస్తాయని పాకిస్తాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది.రాజ్‌నాథ్ సింగ్ న్యూఢిల్లీలో ఆదివారం జరిగిన సింధ్ కమ్యూనిటీ కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు ఈ విధమైన వ్యాఖ్యలు చేశారు. సింధ్‌తో భారతదేశానికి ఉన్న శాశ్వత సాంస్కృతిక సంబంధాలపై దృష్టి సారించిన ఆయన, ఈ ప్రాంతం ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉన్నప్పటికీ, దాని నాగరికత బంధం భారత్‌తో చెక్కుచెదరకుండా ఉందని అన్నారు. 'నేడు, సింధ్ భూమి భారతదేశంలో భాగం కాకపోవచ్చు, కానీ నాగరికత ప్రకారం, సింధ్ ఎల్లప్పుడూ భారతదేశంలో భాగంగానే ఉంటుంది' అని అన్నారు. రాజకీయ సరిహద్దులు తాత్కాలికమే అయినప్పటికీ, సాంస్కృతిక గుర్తింపు, ఉమ్మడి వారసత్వం చాలా కాలం పాటు ఉంటాయని రాజ్‌నాథ్ పేర్కొన్నారు.

# తెలంగాణ నోయిడాగా కొడంగల్‌ను తీర్చిదిద్దుతాం

రేవంత్ రెడ్డి వివరించారు. రాబోయే కొన్ని నెలల్లో నియోజకవర్గంలో రైల్వే పనులు ప్రారంభమవుతాయన్నారు. దేశానికే కొడంగల్‌ను ఆదర్శంగా ఉండేలా అభివృద్ధి చేస్తామన్నారు.మహిళలు ఆత్మగౌరవంతో బతికేందుకు కృషి చేస్తున్నామన్న రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని పునరుద్ఘాటించారు. వెయ్యి ఆర్టీసీ బస్సులకు వారిని యజమానులుగా చేశామన్నారు. సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులకు కూడా యజమానులను చేశామని చెప్పారు. అదానీ, అంబానీలతో పోటీపడేలా వారిని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. మహిళా సంఘాల ఉత్పత్తులు అమెజాన్‌లో అమ్ముకునేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. కొడంగల్‌లో రూ.103 కోట్లతో అభివృద్ధి పనులకు రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు.మూడు నెలల్లో కొడంగల్‌లోని ప్రతి గ్రామానికి కృష్ణా నీళ్లు అందిస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. లగచర్ల పారిశ్రామికవాడకు అంతర్జాతీయస్థాయి గుర్తింపు తీసుకొస్తామని



వెల్లడించారు. తెలంగాణ నోయిడాగా కొడంగల్ నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతామన్నారు. రాబోయే కొన్ని నెలల్లో కొడంగల్ రైల్వే పనులు ప్రారంభమవు తాయన్న ఆయన నియోజకవర్గంలో సిమెంట్ పరిశ్ర మ ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు.త్వరలో సర్పంచ్ ఎన్నికలు రాబోతున్నాయని రేవంత్ రెడ్డి వివరించారు. మరో 3, 4 రోజుల్లో సర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందన్నారు. అభివృద్ధికి మద్దతుగా ఉండేవారిని సర్పంచ్‌లుగా ఎన్నుకోవాలి అని రేవంత్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. అంతకు ముందు కొడంగల్? నియోజకవర్గానికి విచ్చేసిన రేవంత్ రెడ్డికి స్థానికులు ఘన స్వాగతం పలికారు

## కబడ్డీ ప్రపంచకప్ విజేతగా భారత మహిళ జట్టు

**ఫైనల్‌లో 35-28తో చైనీస్ తైపీపై గెలుపు**

**ఢాకా(జనంసాక్షి):** భారత మహిళల కబడ్డీ జట్టు ప్రపంచ కప్ విజేతగా నిలిచింది. ఫైనల్‌లో 35-28తో చైనీస్ తైపీపై గెలుపొందింది. ఈ మ్యాచ్ ఆరంభం నుంచి హెూరాహెూరీగా సాగింది. తొలి అర్ధ భాగం ముగిసేసరికి భారత్ 20-16తో ఆధిక్యంలో నిలిచింది. తర్వాత కూడా ప్రత్యర్థి జట్టు గట్టి పోటీ ఇచ్చింది. మరో ఐదు నిమిషాల్లో ఆట ముగుస్తుందనగా భారత్ 29-24తో నిలిచింది. చివరకు ఏడు పాయింట్ల తేడాతో గెలిచిన భారత్ వరుసగా రెండో టైటిల్‌ను దక్కించుకుంది. ఈ టోర్నీని తొలిసారిగా 2012లో నిర్వహించగా అప్పుడు కూడా భారత జట్టే ఛాంపియన్‌గా నిలిచింది. ఈ ఏడాది నిర్వహించిన పోటీల్లో భారత్, బంగ్లాదేశ్, థాయ్‌లాండ్, ఉగాండా, జర్మనీ, చైనీస్ తైపీ, ఇరాన్, నేపాల్, కెన్యా, జాంజిబార్ (టాంజానియా), పోలాండ్ తలపడ్డాయి. అర్జెంటీనా కూడా పాల్గొనాల్సి ఉండగా.. టోర్నీ ప్రారంభానికి ముందు పోటీల నుంచి వైదొలిగింది.

## మహిళా స్వయం సహాయక సంఘాలకు నిధుల వరద

ఈ వడ్డీలను కూడా సకాలంలో చెల్లిస్తున్నామని చెప్పారు. ఆడబిడ్డల కష్టాన్ని కాజేసి కన్నీళ్ళకు కారణమైన బీఆర్ఎస్ పెద్దలకు మహిళా సంక్షేమంపై మాట్లాడే నైతిక హక్కు లేదంటూ ఆ పార్టీ నేతలకు సూచించారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రతి ఏడాది రూ. 25 వేల కోట్లు తగ్గకుండా బ్యాంక్ లింకేజీ రుణాలను తెలంగాణ ప్రభుత్వం అందిస్తుందని సీతక్క వివరించారు. ఈ సంఘాలకు క్రమం తప్పకుండా వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం అందిస్తుంది.

## చీఫ్ జస్టిస్‌గా సూర్యకాంత్ ప్రమాణం



చీఫ్ జస్టిస్‌లు వారి కుటుంబ సభ్యులతో కలిసి హాజరుకావడం విశేషం. జస్టిస్ సూర్యకాంత్ 1962 ఫిబ్రవరి 10న హరియాణాలోని హిసార్‌లో ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. 1984లో రోహ్‌తక్‌లోని మహర్షి దయానంద్ యూనివర్శిటీ నుంచి న్యాయశాస్త్ర పట్టా పొందారు. 2004 జనవరి 9న పంజాబ్, హర్యానా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2018లో హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా నియమితులయ్యారు. 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. వివిధ ధర్మాసనాల్లో పలు కీలక తీర్పుల్లో ఆయన భాగమయ్యారు. 370వ అధికరణను రద్దు చేస్తూ చారిత్రక తీర్పు ఇచ్చిన ధర్మసనంలో ఉన్నారు. బిహార్ ఎన్నికల జాబితా రివిజన్, పెగాసస్ స్పైవేర్ తీర్పులు కూడా ఉన్నాయి.ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, మాజీ సీజేఐ జస్టిస్ గవాయ్, కేంద్రమంత్రులు, ఇతరులు పాల్గొన్నారు.

**తొలిరోజు 17 కేసుల విచారణ**

సుప్రీం కోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేసిన జస్టిస్ సూర్యకాంత్ సీజేఐ హెూదాలో తొలి రోజు ఆయన 17 కేసులు విచారించారు. అదే విధంగా ఓ కొత్త విధానపరమైన నియమాన్ని తీసుకొచ్చారు. ఇకపై అర్జెంట్ లిస్టింగ్ కేసులను తప్పనిసరిగా లిఖితపూర్వకంగా సమర్పించాల్సి ఉంటుందన్నారు. మరణశిక్ష, వ్యక్తిగత స్వేచ్ఛకు విఘాతం వంటి అసాధారణ పరిస్థితుల్లోనే మౌఖిక అభ్యర్థనలను అనుమతించనున్నట్లు చెప్పారు.రాష్ట్రపతి భవన్‌లో సీజేఐగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం జస్టిస్ సూర్యకాంత్ సుప్రీం కోర్టుకు చేరుకున్నారు. న్యాయస్థానం ప్రాంగణంలోని గాంధీ, బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. అనంతరం ఒకటో నంబర్ కోర్టు రూమ్‌లో జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ అతుల్ ఎస్.చందూర్కర్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనానికి నేతృత్వం వహించారు. ఓ ప్రైవేటు సంస్థకు వ్యతిరేకంగా హిమాచల్ ప్రదేశ్ దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పును వెలువరించారు. ఆయన నేతృత్వంలోని ధర్మాసనం రెండు గంటల్లో దాదాపు 17 కేసులను విచారించింది. సుప్రీం కోర్టు అడ్వకేట్స్-ఆన్-రికార్డ్ అసోసియేషన్ అధ్యక్షుడు విపిన్ నాయర్ కొత్త సీజేఐని కోర్టురూంలోకి స్వాగతించారు. ఓ న్యాయవాది ఆయన్ను 'రైతు కుమారుడు సీజేఐ అయ్యారు' అని పలకరించారు. ఇదిలా ఉండగా.. ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బి.ఆర్.గవాయ్ పదవీకాలం ఆదివారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో జస్టిస్ సూర్యకాంత్ నేడు బాధ్యతలు స్వీకరించారు. దీంతో సీజేఐగా బాధ్యతలు చేపట్టిన తొలి హరియాణా వాసిగా రికార్డు సృష్టించారు. 2027 ఫిబ్రవరి 9 వరకు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు.

అధికారిక వాహనం వదిలిన మాజీ సిజెఐ గవాయ్

సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ సోమవారం ప్రమాణం చేసారు. ప్రమాణస్వీకార కార్యక్రమం అనంతరం మాజీ సీజేఐ జస్టిస్ గవాయ్ తాను వచ్చిన అధికారిక కారును కొత్త సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కోసం రాష్ట్రపతి భవన్ వద్ద వదిలివెళ్లినట్లు జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. నిబంధనల ప్రకారం సీజేఐగా పదవీవిరమణ చేసిన అనంతరం మాజీ సీజేఐలు తాము ఉంటున్న అధికారిక నివాసాలను, సీజేఐకి ప్రభుత్వం ఇచ్చే ఇతర సౌకర్యాలను వీడాల్సి ఉంటుంది. అందులోభాగంగానే జస్టిస్ గవాయ్ కారును సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కోసం రాష్ట్రపతి భవన్ వద్ద వదిలివెళ్లినట్లు తెలుస్తోంది. అయితే జస్టిస్ సూర్యకాంత్ బాధ్యతలు చేపట్టిన వెంటనే జస్టిస్ గవాయ్ కారును అక్కడే వదిలివేయడం గమనార్హం. ఈ ఏడాది మే 14వ తేదీన 52వ సీజేఐగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ బి.ఆర్.గవాయ్ పదవీకాలం ముగియడంతో సోమవారం నూతన సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణం చేశారు.

## తెలంగాణ భూములు కార్పొరేట్లకు ఎట్లిస్తరు?

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ప్రభుత్వ వైఫల్యంపై నిలదీయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడు జీహెచ్ఎంసీ ఎన్నికలు నిర్వహించినా సిద్ధంగా ఉండాలని.. అందరినీ పార్టీ గెలిపించుకుంటుందని కేటీఆర్ భరోసా ఇచ్చారు.

## ఈఎస్ఐ ఆస్పత్రిలో ప్రమాదం..

రఘుపతి, మోహన్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మల్లేశ్, మైసయ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. గాయపడిన కార్మికులకు చికిత్స అందిస్తున్నామని ఈఎస్ఐ వైద్య కళాశాల డీన్ డాక్టర్ శిరీష్ కుమార్ చెప్పారు.

## తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

**రెండు ప్రైవేట్ బస్సులు ఢీకొని ఆరుగురు దుర్మరణం**

**చెన్నై(జనంసాక్షి):** తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. తెనకాశీ-మదురై రోడ్డులో ఎదురెదురుగా వస్తున్న రెండు ప్రైవేటు బస్సులు ఒకదాన్నొకటి ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు. మరో 28 మంది గాయపడ్డారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. మదురై నుంచి సెన్‌కొట్టాయ్ వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు.. తెన్‌కాశీ నుంచి వస్తోన్న మరో బస్సును బలంగా ఢీకొట్టింది. ప్రమాదం దాటికి రెండు బస్సులు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. ఈ సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అతివేగం,నిర్లక్ష్యపు డ్రైవింగే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని పోలీసులు ప్రాథమికం గా నిర్ధరించారు. క్షతగాత్రులను వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని, సీసీటీవీ ఫుటేజీలను సేకరిస్తున్నామని తెలిపారు. ప్రమాదంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్ర దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## ముగిసిన ఐ బొమ్మ రవి కస్టడీ

**కీలక సమాచారం రాబట్టిన పోలీసులు**

**హైదరాబాద్(జనంసాక్షి):** ఐబొమ్మ రవి పోలీస్ కస్టడీ ముగిసింది. 5 రోజుల కస్టడీలో సైబర్ క్రైమ్ పోలీసులు కీలక సమాచారం రాబట్టారు. రవి వెబ్ సైట్, డొమైన్ నెట్ వర్క్, ఐపీ మాస్కలతో పాటు అన్నింటిపై పోలీసులు ఆరా తీశారు. 20 కోట్ల రూపాయల లావాదేవీలపై బ్యాంకు అధికారుల సహకారంతో బదిలీ వివరాలు తెప్పించుకుని మరీ పోలీసులు రవిని ప్రశ్నించారు. రవి స్నేహితులు, చెల్లెలు చంద్రిక వ్యవహారంపై వివరాలు సేకరించారు. రవి, అతడి స్నేహితుడు కలిసి టెక్నికల్ ఆపరేషన్స్, డేటా హైడింగ్, సర్వర్ యాక్సెస్, వీపీఎన్, ఐపీ మాస్కింగ్ వంటి అంశాల్లో పాల్గొన్నట్లు గుర్తించారు. రవికి, రవి స్నేహితుడు నిఖిల్‌కి మధ్య భారీగా డబ్బుల బదిలీలు జరిగినట్లు తేలింది

## ధర్మేంద్ర కన్నుమూత

సినిమాలతో అభిమానుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. స్క్రీన్‌పై తన పవర్‌ఫుల్ డైలాగ్ డెలివరీ, మాస్ అప్పీల్, అద్భుతమైన స్టైల్‌తో ఆయనకు అభిమానులు 'హీ-మ్యాన్ ఆఫ్ బాలీవుడ్' అనే బిరుదు ఇచ్చారు. ధర్మేంద్ర నటించిన తాజా చిత్రం 'ఇక్కీస్' విడుదలకు సిద్ధమవుతోంది. ఇది పరమవీర చక్ర గ్రహీత లెఫ్టినెంట్ అరుణ్ ఖేతర్‌పాల్ జీవితకథ ఆధారంగా రూపొందిన చిత్రం. ఇందులో ఆయన హీరో తండ్రి పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం డిసెంబర్ 25న విడుదల కానుంది. ఇదిలావుంటే బాలీవుడ్ స్టార్ ధర్మేంద్ర అంత్యక్రియలను అత్యంత గోప్యంగా నిర్వహించారు. ముంబైలోని పవన్ హన్స్ శ్మశానవాటికలో ఆయన అంత్యక్రియలు చేపట్టారు. వార్త తెలిసన వెంటనే ధర్మేంద్ర భార్య , ప్రఖ్యాత నటి హేమామాలిని, ధర్మేంద్ర కుమార్తె ఈషా డియోల్.. శ్మశానవాటికకు చేరుకున్నారు.

**సంతాపం తెలిపిన రాష్ట్రపతి, ప్రధానమంత్రి**

సోమవారం ధర్మేంద్ర ఆరోగ్యం విషమించడంతో ఆయన కన్నుమూశారు.. సినీ ప్రముఖులు ఆయనకు నివాళులర్పించారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని సోషల్ మీడియా వేదికగా గుర్తుచేసుకున్నారు. ధర్మేంద్ర పార్థివ దేహాన్ని కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో స్థానిక విల్లే పార్లే శ్మశాన వాటికకు తరలించారు. ధర్మేంద్ర కన్నుమూశారన్న సమాచారం తెలుసుకున్న సినీ, రాజకీయ ప్రముఖులు ఆయన భౌతిక కాయాన్ని కడసారి చూసేందుకు శ్మశాన వాటికకే తరలివచ్చి, నివాళులర్పించారు. ధర్మేంద్ర మృతిపట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ సంతాపం వ్యక్తం చేశారు. 'భారతీయ సినిమాలో ఒక శకం ముగిసింది. తన నటనతో అనేక పాత్రలకు వన్నె తెచ్చారు. ఇది ఎంతో విచారకరమైన సమయం. ధర్మేంద్ర కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. చిత్ర పరిశ్రమకు తీరని లోటు ' అని రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. ధర్మేంద్ర మృతిపట్ల దర్శక, నిర్మాత కరణ్‌జోహార్ కూడా విచారం వ్యక్తం చేశారు. ఒక శకం ముగిసిందన్నారు. 'మెగాస్టార్, గొప్ప అందగాడు, ఇండియన్ సినిమా లెజెండ్ వన్ అండ్ ఓన్లీ ధర్మేంద్రజీ మిమ్మల్ని ఎంతో మిస్ అవుతున్నాం' అని పేర్కొన్నారు.

ధర్మేంద్ర 1935 డిసెంబరు 8న జన్మించారు. ఆయన పూర్తి పేరు ధర్మేంద్ర కెవల్ క్రిషన్ దేవోల్. 1954లో ప్రకాశ్‌కౌర్‌ను వివాహం చేసుకున్నారు. 1980లో బాలీవుడ్ సీనియర్ నటి హేమమాలినిని రెండో వివాహం చేసుకున్నారు. ధర్మేంద్రకు సన్నీ, బాబీ, ఈషా సహా ఆరుగురు సంతానం. బాలీవుడ్ హీ-మ్యాన్‌గా పేరుతెచ్చుకున్న ఆయన నటనకు అనేక అవార్డులు వచ్చాయి. చిత్ర పరిశ్రమకు ఆయన చేసిన సేవలకు గానూ కేంద్ర ప్రభుత్వం 2012లో పద్మభూషణ్‌తో సత్కరించింది. ధర్మేంద్ర రాజకీయాల్లోనూ రాణించారు. 2004లో బికనీర్ నుంచి భాజపా ఎంపీగా గెలుపొందారు. 1960లో 'దిల్ బీ తేరా హమ్ బీ తేరే'తో నటుడిగా కెరీర్‌ను ఆరంభించిన ఆయన 'అన్‌పఢ్ ', 'బందినీ', 'అనుప మ', 'ఆయా సావన్ జూమ్ కే' తదితర చిత్రాలతో నటుడిగా మంచి పేరు తెచ్చుకున్నారు. ఆ తర్వాత 'షోలే', 'ధర్మవీర్', 'చుప్కే చుప్కే', 'మేరా గావ్ మేరా దేశ్', 'డ్రీమ్ గర్ల్' వంటి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని నమోదు చేశాయి. ధర్మేంద్ర కెరీర్‌లో దాదాపు 300లకు పైగా చిత్రాల్లో నటించారు. చివరిగా షాహిద్ కపూర్, కృతి సనన్‌ల 'తేరీ బాతోమే ఐసా ఉల్జా జియా' చిత్రంలో వెండితెరపై కనిపించారు.

## భారత్‌కు రష్యా బంపరాఫర్..

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**

భారత్‌కు రష్యా బంపరాఫర్ ప్రకటించింది. రోస్‌నెఫ్ట్, లుకోయిల్ వంటి ప్రధాన రష్యన్ చమురు సంస్థలపై అమెరికా గత వారం ఆంక్షలు విధించడంతో, రష్యా తన ముడి చమురును రెండేళ్లలో ఎన్నడూ లేనంత తక్కువ ధరలకు భారత్‌కు అందించేందుకు సిద్ధమైంది.భారత రిఫైనర్లకు యురల్స్ ధర డెలివరీ ప్రాతిపదికన డేటెడ్ బ్రెంట్‌తో పోలిస్తే బ్యారెల్‌పై ఏడుడాలర్ల వరకు తగ్గించింది. ఈ ఆఫర్ డిసెంబర్‌లో లోడ్ అయ్యే, జనవరిలో భారత్‌కు చేరే కార్గోలపై వర్తించనుంది.అమెరికా ఆంక్షలకు ముందు యురల్స్ బ్యారెల్‌కు మూడు డాలర్ల వరకు డిస్కౌంట్ ఇచ్చింది.రోస్‌నెఫ్ట్, లుకోయిల్‌పై ఆంక్షలు అమలులోకి వచ్చిన తర్వాత భారత రిఫైనర్లు రష్యన్ చమురు ఆర్డర్లు తగ్గించాయి. 2022లో ఉక్రెయిన్‌పై రష్యా దాడి తర్వాత భారత్ చౌకైన చమురును విస్తృతంగా దిగుమతి చేసుకుంది. కానీ ఆంక్షల కారణంగా దిగుమతి నిలిపివేసింది.రోస్‌నెఫ్ట్, లుకోయిల్‌తో పాటు గాజ్‌ప్రోమ్ నెఫ్ట్, సుర్గుట్‌నెఫ్టెగాస్‌పై కూడా అమెరికా ఆంక్షలు విధించింది. దీంతో భారత రిఫైనర్లు మధ్యప్రాచ్యం సహా ఇతర ప్రాంతాల నుండి ఎక్కువ ముడి చమురును కొనుగోలు చేస్తున్నారు. రష్యా చమురు ధరలు తగ్గడం భారత్‌కు తాత్కాలిక లాభం కలిగించవచ్చు. కానీ ఆంక్షల కారణంగా సరఫరా స్థిరత్వం అనిశ్చితంగా మారింది. రిఫైనర్లు తక్కువ ధరల ఆకర్షణతో రష్యన్ చమురును కొనుగోలు చేయడానికి సిద్ధమవుతున్నా, దీర్ఘకాలంలో అమెరికా ఆంక్షలు వాణిజ్యాన్ని మరింత క్లిష్టం చేయవచ్చని నిపుణులు భావిస్తున్నారు.

## అమెరికాలో 'డోజ్' క్లోజ్

**న్యూయార్క్(జనంసాక్షి):**అమెరికా అధ్యక్షుడిగా రెండో సారి బాధ్యతలు చేపట్టిన అనంతరం డొనాల్డ్ ట్రంప్ దేశంలోని వృథా ఖర్చులను తగ్గించడం, ప్రభుత్వ వ్యవస్థలో సమూల మార్పులే లక్ష్యంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ శాఖను ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే. తాము అనుకున్న లక్ష్యాలను సాధించిన అనంతరం అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకునే 2026 జులై 4వ తేదీలోపు ఈ ఫెడరల్ బ్యూరోక్రసీని పూర్తిగా ప్రక్షాళన చేస్తామని అప్పట్లోనే ట్రంప్ ప్రకటించారు. అయితే దాని గడువు కంటే ఎనిమిది నెలల ముందే డోజ్‌ను మూసివేస్తున్నట్లు అమెరికా ప్రభుత్వం వెల్లడించింది. అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రభుత్వంలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఇందులోభాగంగా ఏర్పాటుచేసిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ విభాగానికి ఎలాన్ మస్క్‌ను, భారత సంతతికి చెందిన పారిశ్రామికవేత్త వివేక్ రామస్వామిలను సంయుక్త సారథులుగా నియమించారు. ప్రభుత్వ వ్యవస్థలో సమూల మార్పులు, శాఖల్లో వృథా ఖర్చులు తగ్గించడమే లక్ష్యంగా ఇది పని చేస్తుందని చెప్పిన ట్రంప్.. ఆవిధంగానే వివిధ శాఖల్లో వేలాది మంది ఉద్యోగులను తొలగించారు. అనంతరం రామస్వామి డోజ్ నుంచి వైదొలిగారు. ఈ క్రమంలో మస్క్ తీరుపై తీవ్ర విమర్శలు ఎదురయ్యాయి. ట్రంప్ యంత్రాంగాన్ని ఎలాన్ మస్క్ వెనకుండి నడిపిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో డోజ్‌లో మస్క్ ఉద్యోగి కాదని.. ట్రంప్ సలహాదారుడిగా మాత్రమే మస్క్ ఆ బాధ్యతలు చూస్తున్నారని వైట్‌హౌస్ వెల్లడించింది. ఈ ఏడాది మేలో ట్రంప్ తీసుకువచ్చిన బిగ్ బ్యూటిఫుల్ బిల్‌ను మస్క్ వ్యతిరేకించడంతో ట్రంప్‌నకు, ఆయనకు మధ్య విభేదాలు వచ్చాయి. ప్రభుత్వ వ్యయాలను తగ్గించడానికి డోజ్ తీసుకున్న చర్యలు ఈ నిర్ణయంతో వృథా అవుతాయని మస్క్ నిరాశ వ్యక్తంచేస్తూ.. ట్రంప్ కార్యవర్గం నుంచి వైదొలిగారు.

## శరవేగంగా రూపాయి పతనం

**కేంద్రంపై మండిపడ్డ కాంగ్రెస్**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**అమెరికా డాలర్‌తో పోలిస్తే.. రూపాయి విలువ దారుణంగా పడిపోతుంది. శుక్రవారం డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 89 రూపాయలకి పడిపోయింది. రూపాయి విలువ రికార్డు స్థాయిలో అత్యంత కనిష్ట స్థాయికి పడిపోవడంతో కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రంగా విమర్శలు చేసింది. 2013 యుపిఎ హయాంలో రూపాయి విలువ పడిపోవడంతో అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న మోడీ తీవ్ర విమర్శలు చేశారు. ఇప్పుడు ఆయన ప్రధానిగా ఉన్న సమయంలో రూపాయి విలువ దారుణంగా పడిపోవడంతో కాంగ్రెస్ కూడా మోడీపై మండిపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ నిరంతరం పతనం అవుతూనే ఉంది. ఇప్పుడు అది 90 రూపాయల కనిష్ట స్థాయిని దాటబోతోంది. 2013 జూలైలో తాను చెప్పింది ప్రధానికి గుర్తుందా అని అప్పుడు మోడీ అన్న వీడియోను సోమవారం ఎక్స్ వేదికగా కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ పోస్టు చేశారు. రూపాయి ఎంత వేగంగా పతనమవుతుందో చూడండి. కొన్నిసార్లు రూపాయి, ఢిల్లీలో ప్రభుత్వానికి మధ్య పోటీ జరుగుతున్నట్లు అనిపిస్తుంది. అయితే రూపాయి పతనంపై దురుద్దేశపూరిత వ్యాఖ్యలు చేసినా.. అలా అన్న వారి గౌరవం కూడా వేగంగా దిగజారిపోతుంది అని జైరాం రమేశ్ ఈ వీడియోకు జతగా పోస్టు చేశారు.022 ఫిబ్రవరి 24వ తేదీన రూపాయి విలువ 99 రూపాయలకి పడిపోయింది. గత మూడు సంవత్సరాలుగా అత్యంత కనిష్ట స్థాయిలోనే రూపాయి విలువ పడిపోతుంది.

# బాసర టూ కీసర

- భద్రాచలం టూ భద్రకాళి.
- ఎండోమెంటు టెంపుల్స్ డెవలప్మెంటే మినిస్టర్ కొండా సురేఖ జెండా... ఎజెండా!

హైదరాబాద్ (జనంసాక్షి) : ప్రజా ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాల ఆదాయం గతం కంటే ఘననీయంగా పెరిగింది. గత ప్రభుత్వంలో పదేండ్లు ముఖ్యమంత్రి చేసిన ఒక నాయకుడు కేవలం ఒక దేవాలయం మినహా మిగతావి అన్నీ నిర్లక్ష్యానికి గురి చేయగా... ప్రజా ప్రభుత్వంలో మాత్రం అన్ని దేవాలయాలను సమగ్రంగా అభివృద్ధి చేస్తున్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రతి టెంపుల్ ను అభివృద్ధి చేసేందుకు సర్కారు కృషి చేస్తున్నది. అందుకే, ఆదాయం పెద్ద ఎత్తున పెరిగింది. 2023 సంవత్సరం చివరి అంకంలో రాష్ట్రంలోని ఉన్న 699 దేవాలయ సంస్థలను నుంచి రూ. 373.55 కోట్లు ఆదాయం వస్తే... ప్రభుత్వం వచ్చిన తర్వాత చేపట్టిన కార్యక్రమాల ద్వారా రూ. 2024లో 544.61 కోట్లు వచ్చినట్టు దేవాదాయ శాఖ గణాంకాలే చెబుతున్నాయి.

కార్తీక మాసంలో... యాదగిరి గుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయానికి ప్రజా ప్రభుత్వంలో భారీ ఆదాయం వచ్చింది. ఈ సమయంలోనే స్వామివారిని దర్శించుకున్న మొత్తంగా 20 లక్షల 52 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ప్రజా ప్రభుత్వం భక్తులకు వసతులు కల్పించడం పెరగడంతో... భక్తుల సంఖ్య పెరిగిందని ఎండోమెంటు ఉన్నతాధికారులు అభిప్రాయపడుతున్నారు. టెంపుల్ కు ఆదాయం 17 కోట్ల 62 లక్షల 33 వేల 331 రూపాయలు వచ్చాయి. అయితే, గతేడాది ఆదాయ 14 కోట్ల 30 లక్షల 69 వేల 481 రూపాయలు వచ్చిన పరిస్థితి ఉంది. మొత్తంగా పరిశీలిస్తే... గతేడాది కంటే 3 కోట్ల 31 లక్షల 63 వేల 850 ఆదాయం స్వామివారి దేవాలయానికి అధికంగా వచ్చింది. అయితే, ఈ ఆదాయం కూడా టెంపుల్ అభివృద్ధికే ఉపయోగించనున్నామని దేవాదాయ శాఖ స్పష్టం చేస్తున్నది.

### ప్రధాన దేవాలయాల అభివృద్ధిలో పరుగులు

వీటితో పాటు రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధిపై ఎండోమెంటు శాఖ మంత్రి కొండా సురేఖ నేతృత్వంలోని దేవాదాయ శాఖ పెట్టింది. అందుకు సంబంధించిన మాస్టర్ ప్లాన్ రూపొందించి వేగంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా... రాష్ట్రవ్యాప్తంగా పలు ఆలయాల్లో సుమారు రూ.450 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రెడీఅయింది. ముఖ్యంగా చెరువుగట్టు, కొండగట్టు, భద్రాచలం, వేములవాడ ఆలయాలకు భారీగా నిధులు కేటాయించింది. యాదగిరి గుట్టలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ విమాన గోపురానికి 60 కిలోల బంగారు తాపడం పనులు జరుగుతున్నాయి. ఇందులో దేవస్థానం వద్ద నిల్వ ఉన్న 25 కిలోల బంగారంతోపాటు విరాళంగా వచ్చిన 35 కిలోల బంగారాన్ని వినియోగిస్తున్నారు. వేములవాడలోని రాజరాజేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.76 కోట్లు మంజూరు చేసింది. దీనిలో అన్నదానం సెంటర్ నిర్మాణానికి రూ.35.25 కోట్లు కేటాయించింది. శ్రీ బద్ది పోచమ్మ అమ్మవారి దేవాలయ అభివృద్ధి, గుడి చెరువు సుందరీకరణకు మరో రూ.20 కోట్లు మంజూరు చేసింది.

### శరవేగంగా అన్ని ఆలయాల అభివృద్ధి

భద్రాచలంలోని సీతారామచంద్ర స్వామి దేవాలయ అభివృద్ధిలో భాగంగా భూ సేకరణకు ప్రభుత్వం రూ.60.20 కోట్ల నిధులు మంజూరు చేసింది. వరంగల్ లోని శ్రీ భద్రకాళి అమ్మవారి దేవాలయ మాడవీధుల ఏర్పాటు, నిర్మాణానికి రూ.30 కోట్లు ప్రత్యేక అభివృద్ధి నిధులు, కాకతీయ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (కుడా) నిధుల నుండి కేటాయించింది. మాడవీధుల పనులు పురోగతిలో ఉన్నాయి. దీంతోపాటు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కొడవటంచశ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం, దేవాలయ అభివృద్ధికి రూ.12.15 కోట్లు మంజూరు చేశారు. మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రముఖ కురుమూరి జాతరకు సంబంధించిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి కోసం ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది.



### భక్తులకు ఇబ్బందుల్లేకుండా చేయడమే మా బాధ్యత : కొండా సురేఖ, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి

గత ప్రభుత్వం కేవలం ఒక టెంపుల్ మాత్రమే డెవలప్ చేసిన పరిస్థితి ఉన్నది. అయితే, మా ప్రభుత్వం మాత్రం వేములవాడ, భద్రాద్రి, కొండగట్టు, ధర్మపురి మాత్రమే కాకుండా, రాష్ట్రంలోని చాలా దేవాలయాలను అభివృద్ధి చేస్తున్నం. బాసర, కీసర, భద్రాద్రి, భద్రకాళి, ఐనవోలు, కొమురవెల్లి ఇలా ఎన్నో టెంపుల్ లను డెవలప్ చేస్తున్నం. వాటి విస్తరణ పనులు నడుస్తున్నాయి. వీలైనంత వేగంగా పనులు చేపడుతున్నం. టెంపుల్ పనులు పూర్తి చేసేదాకా మేం నిద్రపోం. అయితే, భక్తులకు ఇబ్బందుల్లేకుండా చేసేందుకే తాము ఈ చర్యలు చేపడుతున్నాం.

# రైతును విస్మరించిన కాంగ్రెస్ సర్కార్

- రెండేళ్లలో 720 మంది రైతుల ఆత్మహత్య
- కవిత తనపై ఎందుకు విమర్శలు చేస్తోందో
- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆగ్రహం




వనపర్తి,నవంబరు 24 (జనంసాక్షి) : రైతుల విషయంలో రేవంత్ రెడ్డి సర్కార్ పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. మరికొద్ది రోజుల్లో ఈ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటై రెండు ఏళ్లు పూర్తి చేసుకోబోతోందని.. ఈ కాలంలో 720 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. సోమవారం వనపర్తిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ 10 శాతం పనులు పూర్తి చేస్తే అయిపోతుందని.. కానీ పాలమూరు బిడ్డ సీఎం రేవంత్ ఎందుకు స్పందించడం లేదని వ్యంగ్యంగా పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపకుండా తనపై దుర్భాషలాడడం ఎంత వరకు సమంజసమన్నారు. తాను ఒక్కసారి కూడా కవితపై పల్లెత్తు మాట అనలేదని తెలిపారు. డూప్లికేట్ కాంగ్రెస్ వాళ్లు తనపై సోషల్ మీడియాలో కావాలనే బ్లేమ్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కవిత ఎవరిని సంతోషపెట్టాలని తనపై ఎందుకు దూర్భాషాలాడుతుందో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాను కక్ష పూరితంగా ఎవరి మీద కేసులు పెట్టించ లేదన్నారు. ఒక వేళ అలా ఏమైనా ఉంటే నిరూపించాలని అంతేకాని అసత్య ఆరోపణలు చేయవద్దని కవితకు సూచించారు. తాను ఎంతో మంది విద్యార్థులను స్వంత ఖర్చులతో చదివించానని గుర్తు చేశారు. కానీ వాటిని తాను ప్రచారం చేసుకోలేదన్నారు. తాను గతంలో న్యాయవాదిగా ఉన్నప్పుడు పెబ్బేరు సంత భూమి విషయంలో 2003, 2007లో పూజారులకే చెందుతుందని తీర్పు వచ్చిందని గుర్తు చేశారు. కానీ తాను కబ్జా చేశాననడం అసత్య ప్రచారమన్నారు. పూర్తి విషయ పరిజ్ఞానం లేకుండా తాను దేవుడి మాన్యాన్ని కబ్జా చేశానంటూ కవిత ఆరోపణలు చేయడం సిగ్గు చేటు అన్నారు. తమ పార్టీ ఇప్పుడు అధికారంలో లేదని.. తనపై వచ్చిన ఆరోపణలను రుజువు చేయాలంటూ ప్రత్యర్థులకు ఆయన సవాల్ విసిరారు. బీఆర్ఎస్ పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు సైతం కేసీఆర్‌ను కానీ.. ఆయన పార్టీ జెండాను కానీ వదల లేదన్నారు. తండ్రి వయస్సు ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలను ఇంటికి పిలిపించుకుని మాట్లాడుతున్నావంటూ కవితపై నిరంజన్ రెడ్డి నిప్పులు చెరిగారు. తమలాంటి నలుగురు, ఐదుగురిపై విషం చిమ్ముతున్నావని కవితను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

# కుక్క కాటుకూ మందు లేకపోతే ఎట్లా?

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- దాదాపు రూ.కోటి విలువైన మెడికల్ ఎక్విప్ మెంట్‌ను ఆసుపత్రికి అందజేత



హుస్నాబాద్/ జమ్మికుంట (జనంసాక్షి) : ప్రభుత్వ ఆసుపత్రుల్లో కుక్క కాటుకు కూడా మందు అందుబాటులో లేని దుస్థితి నెలకొందని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. "సర్కార్ ఆసుపత్రులకు వచ్చే వాళ్లంతా పేద, మధ్య తరగతి ప్రజలే. ప్రైవేట్ ఆసుపత్రుల్లో ట్రీట్ మెంట్ చేసుకోలేని వాళ్లే. సూది మందుతోపాటు కనీస సౌకర్యాల్లేక పోతే పేదల పరిస్థితి ఏంది? చావాల్సిందేనా?" అని ప్రశ్నించారు. ఇకపై ఇక్కడికి వచ్చే రోగులెవరూ ట్రీట్ మెంట్ కోసం బయటకు వెళ్లే దుస్థితి రానీయొద్దని, అందుకోసం తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమైన పరికరాలను, సాయాన్ని అందించేందుకు ముందుకొచ్చినట్లు తెలిపారు. "ఇకపై ఒక్క పేషెంట్ కూడా ట్రీట్ మెంట్ కోసం బయటకు వెళ్లే పరిస్థితి రానీయొద్దు. ఈ ఆసుపత్రికి ఇంకా ఏమేం కావాలో చెప్పండి. అన్ని సౌకర్యాలను సమకూరుస్తా. ఈ ఆసుపత్రికి వచ్చే వాళ్లంతా పేదలు, మధ్య తరగతి వాళ్లే. ఆర్థికంగా లేనివాళ్లే. అట్లాంటి వాళ్లను టెస్టుల్లేవనో, సూది మందు లేదనో ప్రైవేట్ ఆసుపత్రికి పంపి వారిపై భారం మోపొద్దు. పేదలకు సేవ చేయడం మహా భాగ్యం. మానవ సేవే మాధవ సేవ అని గుర్తుంచుకుని సేవలందించండి."అని కోరారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ఎన్ ఎండీసీ సంస్థ సహకారంతో సీఎస్సార్ నిధులతో దాదాపు రూ.కోటి విలువైన అత్యాధునిక వైద్య పరికరాలను జమ్మికుంట ఆసుపత్రికి అందజేశారు. ఇందులో ఈసీజీ మిషన్లు, అల్ట్రాసౌండ్ మిషన్, ఈఎన్టీ సర్జికల్ మైక్రోస్కోప్, మల్టిపుల్ మానిటర్ల మార్చురీ కేబినెట్ సహా మొత్తం 15 రకాల వైద్య పరికరాలను (మెడికల్ ఎక్విప్ మెంట్స్) ఉన్నాయి. ఆ సేవలను ఈరోజు బండి సంజయ్ ప్రారంభించారు. ఆయా పరికరాల ద్వారా అందించే సేవలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి సిబ్బందితో కలిసి ఫోటోలు దిగారు. అనంతరం రోగులను కలిసి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. డాక్టర్లతో సమావేశమై ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

# అనాథగా మారిన సాద్విన్ కుమార్‌కు ఆర్థికసాయం



కరీంనగర్ (జనంసాక్షి) : అనాథగా మారిన సాద్విన్ కుమార్‌ను సోషల్ మీడియాలో చూసి రాగంపేట ఆర్యవైశ్య సొసైటీ అధ్యక్షుడు నలుమాచు రాధా మనోహర్ స్పందించారు. గత నెల రోజుల క్రితం సోషల్ మీడియాలో వచ్చినటువంటి పోస్ట్ ను చూసి హృదయం చలించి అనాథగా మారిన సాద్విన్ కుమార్ కు ఆర్యవైశ్య సొసైటీ రాగంపేట వాస్తవ్యులు నలుమాచు రాధా మనోహర్ రూ.12 వేలను సాద్విన్ కుమార్‌కు అందించారు. ఈ సందర్భంగా నలమాచు మనోహర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న సాద్విన్ కుమార్ అనాథగా మారిన స్వాద్విన్ కుమార్ నాడు తల్లి మరణం, నేడు తండ్రి మరణం. అందర్నీ కోల్పోయి అనాథగా మారిన సాద్విన్ కుమార్. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలంలోని రాగంపేట గ్రామంలో ఐదవ తరగతి చదువుతున్న సాద్విన్ కుమార్ తండ్రి మరణించి అనాథ అయిన విద్యార్థి కోసం ప్రాథమిక పాఠశాలలో అన్ని విషయాలలో ముందుండే విద్యార్థి తండ్రి మరణించడంతో అనాథగా మారాడు. చొప్పదండి మండలంలోని రాగంపేట గ్రామానికి చెందిన దీకొండ స్వాద్విన్ కుమార్ ప్రభుత్వ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్నాడు. తన తండ్రి దీకొండ అశోక్ ఆదివారం రోజున గుండె నొప్పితో (హార్ట్ ఎటాక్) మరణించడంతో అనాథగా మారాడు. మూడు సంవత్సరాల క్రితం తన తల్లి ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధితో మరణించింది. మూడు సంవత్సరాల నుండి అన్ని తానై పెంచిన కొడుకు పై కొండంత ఆశలు పెట్టుకొని కంటికి రెప్పలా పెంచుకున్న తండ్రి మరణించడంతో అనాథగా మారాడు. అంతకు ముందే గత 5 సంవత్సరాలకు ముందు తాత మరణించాడు, ఒక సంవత్సరం క్రితం నానమ్మ మూత్ర పిండాల వ్యాధితో మరణించారు. నాకు దిక్కెవరు అంటూ పిల్లాడు ఏడుస్తుంటే అక్కడి స్థానికులు కంట తడి పెట్టిన తీరు చూస్తే చాలా బాధ కలుగుతుంది. నా వంతు సహాయంగా మునుముందు ఆయన ఉన్నత చదువులకు నా వంతు సాయం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రవీందర్, తాజా మాజీ సర్పంచ్ మామిడి లతా రాజేశం, తాజా మాజీ ఎంపిటిసి సింగిరెడ్డి కృష్ణారెడ్డి, ఉద్యమ కవి గాయకులు మావురాల ఎల్లమ్మ ఫేమ్ టీపీసీసీ సంస్కృతిక సేన జిల్లా ఉపాధ్యక్షులు గసికంటి కుమార్, ఉపాధ్యాయులు సాయన్న, కనుకయ్య, శశికళ, విజయలక్ష్మి,అంగన్వాడి టీచర్ సరోజన, కళ్లెం లచ్చిరెడ్డి, ఎలిగేటి మల్లేశం, దీకొండ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



**చుక్కా రామయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బి.వెంకట్, టి.సాగర్**

హైదరాబాద్ (జనంసాక్షి) : ప్రముఖ విద్యావేత్త, సామాజిక ఉద్యమ కారుడు, మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్య గారి 100వ జన్మదినం సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం ఆలిండియా ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ ,ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష్య, కార్యదర్శులు ఎస్.రజనీకాంత్, టి.నాగరాజు, ఉపాధ్యాక్షులు డి.కిరణ్ ,రాష్ట్ర కమిటీ సభ్యులు జె.రమేష్ హైదరాబాద్, విద్యానగర్ లోని చుక్కా రామయ్య నివాసానికి వెళ్లి ఆయనకు జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బి.వెంకట్, టి.సాగర్ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో లక్షలాది మంది విద్యార్థులు ఐఐటీ పూర్తి చేసి ప్రపంచ దేశాల్లో స్థిరపడడానికి కారణం చుక్కా రామయ్య అని కొనియాడారు. విద్యా ప్రదాత కాకుండాఅనేక సామాజిక సమస్యలపై పోరాడిన గొప్ప వ్యక్తి అని అన్నారు, రాజకీయాల్లో దిక్సూచిగా తన పాత్ర పోషించాడని ఆయన అన్నారు. అలాంటి చుక్కా రామయ్య 100వ బర్త్ డే జరుపుకోవడం మనందరికీ ఎంతో స్ఫూర్తిదాయకమని వారు అన్నారు.

# రేవంత్ రెడ్డి హోంమంత్రిగా విఫలం

- ఎర్ర రాజశేఖర్ కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



షాద్ నగర్ (జనంసాక్షి) : ఎర్ర రాజశేఖర్ అనే దళిత యువకుని దారుణ హత్య పోలీసుల నిర్లక్ష్యం వల్లనే జరిగిందని,ఈ హత్యకు పోలీసులే బాధ్యత వహించాలని,హెూం శాఖ మంత్రిగా బాధ్యతల నిర్వహణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విఫలం చెందారని బి ఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. ఎర్ర రాజశేఖర్ కుటుంబాన్ని షాద్ నగర్ బిఆర్ఎస్ నాయకులతో కలిసి పరామర్శించారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడ్డాక దళితులపై దాడులు పెరుగుతున్నాయన్నారు. చేవెళ్ల సాక్షిగా దళితులను మోసం చేసి అధికారంలోకి వచ్చాక,దళితులనే చంపుతున్నా రన్నారు. ఎర్ర రాజశేఖర్ హత్య ప్రణాళిక బద్దంగా, పోలీసుల సహకారంతో జరిగిందని ఆరోపించారు. రాజశేఖర్ కుటుంబ సభ్యులు, పోలీస్ స్టేషన్ లో జరిగిన ఒప్పంద పత్రంలో నిందితుల కుటుంబం నుండి ప్రమాదం ఉందని చెప్పినా పట్టించుకోలేదన్నారు. నిందితులు రాజశేఖర్ ఇంటికి వచ్చి బలవంతంగా ఎత్తుకెళ్లారని, అడ్డుగా వచ్చిన భార్యను కూడా తీసుకెళ్లే ప్రయత్నం చేశారన్నారు. గన్ పెట్టి బెదిరించిన రోహిన్ రెడ్డికి ఒక న్యాయం, రాజశేఖర్ కుటుంబానికి ఒక న్యాయం ఉంటుందా? రోహిన్ రెడ్డిని అరెస్ట్ నుండి తప్పించిన టాస్క్ ఫోర్స్ పోలీసులు,పేద వర్గాలకు చెందిన రాజశేఖర్ ప్రాణాన్ని ఎందుకు కాపాడలేదని మండిపడ్డారు. ఎర్ర రాజశేఖర్ కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా,డబుల్ బెడ్ రూం ఇల్లు,భార్యకు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# 'ఎస్ఐఆర్' ఎఫెక్ట్..! బెంగాల్ నుంచి బంగ్లాదేశీయుల ఇంటిబాట

'హకీంపుర్'.. పశ్చిమ బెంగాల్‌లో భారత్– బంగ్లాదేశ్ సరిహద్దులోని ఈ ప్రాంతంలో చరిత్ర పునరావృతమవుతున్నట్లు కనిపిస్తోంది. కానీ, రివర్స్ డైరెక్షన్‌లో. 1947లో దేశ విభజన, 1971లో బంగ్లాదేశ్ విమోచన యుద్ధం సమయంలో ఆ దేశం నుంచి వేలాది మంది శరణార్థులు సరిహద్దు దాటి ఇక్కడికి చేరుకున్నారు. ప్రస్తుతం అనేక మంది స్వదేశం బాట పడుతున్నారు. పశ్చిమ బెంగాల్‌లో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ' దీనికి ప్రధాన కారణంగా తెలుస్తోంది.'ఎస్ఐఆర్' ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అనేక ఏళ్ల క్రితం హకీంపుర్‌లో స్థిరపడిన, సరైన పత్రాలు లేని బంగ్లాదేశ్ జాతీయులు నవంబరు ప్రారంభం నుంచి స్వచ్ఛందంగా స్వదేశానికి వెళు తున్నట్లు తెలుస్తోంది. నకిలీ ఆధార్, ఓటరు కార్డులు, అసలు పత్రాలే లేకుండా నివసిస్తున్నవారు.. ఇక తప్పించుకోలేమన్న భావనతో ఎన్నికల సిబ్బంది ఇళ్లకు వచ్చేలోపే తిరిగి వెళ్లిపోవాలని చూస్తున్నట్లు సమాచారం. ఒకప్పుడు తమ ఇంటి పెద్దలు వచ్చిన హకీంపుర్ బార్డర్ అవుట్‌పోస్ట్ దారిలోనే తిరుగు ప్రయాణమవుతున్నారు. ఇక్కడి అక్రమ చొరబాటుదారులు చాలావరకు బంగ్లాదేశ్‌లోని ఖుల్నా, సతిరా, జశోర్, బగెర్హాట్ తదితర ప్రాంతాలకు చెందిన దినసరి కూలీలే. పనుల కోసం చట్టవిరుద్ధంగా భారత్‌లోకి ప్రవేశించామని, తమవద్ద పత్రాలు లేవని చాలామంది బహిరంగంగా అంగీకరిస్తున్నట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ పీటీఐ వార్తాసంస్థ పేర్కొంది. 1971 సమయంలో శరణార్థులకు ఆశ్రయం కల్పించిన ఇక్కడి గ్రామస్థులు.. ప్రస్తుత పరిణామాలను అసాధారణమైనవిగా పేర్కొన్నారు. అప్పట్లో మాదిరిగానే.. ఇప్పుడు కూడా వీరికి ఆహారం, చాయ్ వంటివి అందిస్తున్నారు.బంగ్లాదేశ్‌కు స్వచ్ఛందంగా తిరిగి వెళ్లిపోతున్నవారి సంఖ్య నవంబరు రెండో వారం నుంచి ఒక్కసారిగా పెరిగినట్లు బీఎస్ఎఫ్ అధికారులు వెల్లడిరచారు. ఈ పరిస్థితులను వారు 'ఎస్ఐఆర్'తో ముడిపడి పెడుతున్నట్లు తెలిపారు. అయితే, ఇప్పటివరకు ఎంతమంది తిరిగి వెళ్లారనే వివరాలపై స్పష్టత లేదు. మరోవైపు ఈ పరిణామాల గురించి తెలుసుకున్న బెంగాల్ గవర్నర్ సి.వి.ఆనంద్ బోస్.. హకీంపుర్ బీఎస్ఎఫ్ బార్డర్ అవుట్ పోస్ట్ వద్ద పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలిస్తానని తెలిపారు.

# అవినీతి ఆరోపణలతోనే నిరంజన్ రెడ్డి ఓడిపోయారు

- వ్యవసాయ శాఖ మంత్రిగా అవకాశం ఇస్తే ప్రజల రక్తం తాగుతావా?
- నిరంజన్ రెడ్డి అరాచకాలను కేసీఆర్ కు హరీష్ రావు తెలియనివ్వటం లేదా..?
- జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



వనపర్తి బ్యూరో, నవంబరు 24 (జనంసాక్షి) : మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అవినీతిని చిన్న పిల్లాడిని అడిగిన చెబుతాడని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా ఆది, సోమవారం నాడు ఆమె వనపర్తి జిల్లా కేంద్రంలో పర్యటించారు. ఈ మేరకు ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలు లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వనపర్తిలో నిరంజన్ రెడ్డి ఘోరాతి, ఘోరంగా అరాచకాలకు పాల్పడ్డారని,చిన్న పిల్లాడిని అడిగిన ఆయన దారుణాలను చెబుతున్నారని, ఆయన అవినీతి ఆరోపణ అన్న వల్లే ఓడిపోయారని, ఇలాంటి వారి వల్ల జిల్లాలో బీఆర్ఎస్ బతికి బట్ట కట్టడం కష్టం అని అన్నారు. బీసీ యువకులపై కేసులు పెట్టించి వారిని రక్తాలు వచ్చేట్టు కొట్టించాడని, ఒక్క ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వకుండా నీళ్ల నిరంజన్ రెడ్డి అని పేరు పెట్టుకున్నాడని ఆమె ప్రశ్నించారు. కృష్ణా నది కబ్జా చేసి ఫామ్ హౌజ్ కట్టుకుంటే ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని ఆమె అన్నారు. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి హరీష్ రావు మనిషి అని సీఎం రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవటం లేదా అన్నారు. నిరంజన్ రెడ్డి చేసిన అరాచకాలను కెసిఆర్ కు హరీష్ రావు తెలియనివ్వడం లేదా అని అన్నారు. అందుకే మీడియా ద్వారా పెద్దసార్ కు ఆయన ఘోరాలను తెలియజేస్తున్నానని తెలిపారు. తనపై పిచ్చి పిచ్చి ఆరోపణలు చేస్తే నిరంజన్ రెడ్డి పుచ్చ లేసి పోతుందని హెచ్చరించారు. తండ్రి వయసు వారని ఇప్పటికీ గౌరవిస్తున్నానని తెలిపారు. వనపర్తి జిల్లాలో బీఆర్ఎస్ నేత నిరంజన్ రెడ్డి కారణంగా బీఆర్ఎస్ కోలుకోని విధంగా దెబ్బతింటోందని చెప్పారు. ఆయన బీసీలపై అరాచకం సృష్టించారని. బీసీలపై కేసులు పెట్టి రక్తాలు వచ్చేలా కొట్టించాలని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నిరంజన్ రెడ్డి మూడు, మూడు ఫామ్ హౌజ్ లు కట్టుకున్నారని తన కష్టార్జితంతో కట్టుకుంటే సరే కానీ వీటిలో అసైన్డ్ భూములు ఉన్నాయని కృష్ణా నది కాల్వనే ఆ భూముల్లో ఉందని చెబుతున్నారని తెలిపారు. అంతకుముందు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సందర్శించి అక్కడ విద్యార్థులతో ఉపాధ్యాయులతో మాట్లాడారు. కళాశాలకు సరిపడా అధ్యాపకుల సిబ్బంది లేరని విద్యార్థులకు కూడా సరైన వసతులు లేక పాలిటెక్ కళాశాల భవనం శిథిలావస్థకు చేరుకుందని ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి కళాశాల మరమ్మతులు చేయించాలని కోరారు. దేశవ్యాప్తంగా చేనేత కార్మికులు దుర్భర జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. చేనేత కార్మికులను గుర్తించి వారికి ఐదు లక్షల నుంచి 10 లక్షల వరకు రుణాలు అందించి ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు. పెబ్బేరు సంత భూమిని కూడా వదలకుండా కబ్జా చేయాలని చూసిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి భూ దాహానికి అంతు లేదా అని ఆమె విమర్శించారు. ఇలాంటి వ్యక్తులను ఏ పార్టీ కూడా సపోర్ట్ చేయకూడదని కోరారు. వనపర్తి జిల్లా ప్రజలు ఆత్మగౌరవానికి ప్రతికా అని అలాంటి జిల్లాలో చాలా సమస్యలతో ప్రజలు బాధపడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కానాయిపల్లి దగ్గర శంకర సముద్రం ప్రాజెక్టును పూర్తి చేసి మరో 40 వేల ఎకరాలకు నీళ్లు అందించవచ్చని అదే ప్రాంతానికి చెందిన నాయకుడు రావుల చంద్రశేఖర్ రెడ్డి అవినీతి మరక లేనివారు ఆయన కేసీఆర్ కు విషయాన్ని తెలియజేసి ప్రజలకు న్యాయం చేయాల్సి ఉండే ఇప్పటికైనా ఈ అంశం పై ప్రజల తరఫున ముందుండి పోరాడాలని ఆమె కోరారు. ఆదివారం మాత శిశు సంరక్షణ కేంద్రంలో ఆసుపత్రి సిబ్బంది డాక్టర్లు కెపాసిటీ మించి పని చేస్తున్నారని వెంటనే తగిన సిబ్బందిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆసుపత్రి కార్మికులకు మూడు నెలల నుండి జీతాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం వెంటనే కార్మికులను పర్మినెంట్ చేసి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ మహిళలకు ఇచ్చే చీరలకు ఇందిరామ్మ పేరు పెట్టడం ఏంటని ఆమె ప్రశ్నించారు. ఇందిరమ్మ పేరును ప్రసన్నం చేసుకోవడం కోసం చీరలను ఇందిరమ్మ జయంతి నుండి సోనియామ్మ పుట్టినరోజు వరకు కొనసాగిస్తారని అన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
25 నవంబర్ 2025

# హిడ్మా.. ఆదివాసీల పోరాట స్ఫూర్తి



ఆదివాసీలు అడవిలో సమాజానికి దూరంగా చాలా కష్టభరితంగా జీవిస్తున్న నేపథ్యంలో ఉద్యమ పార్టీ వారి దగ్గరికి చేరుకున్నది. అప్పటికే పోలీస్లు వాళ్ళ అణిచివేతలో ఆదివాసీల జనజీవనం చాలా ఆందోళనకరంగా కొనసాగింది. ఆ నేపథ్యంలోనే ఆ అణిచివేతను ప్రశ్నించిన, పోరాడాలని చెప్పిన వాళ్ళే వాళ్ళకు దిక్సూచిగా మారారు. అది ఈనాటి విషయం కాదు. ఐదు దశాబ్దాలుగా ఆదివాసుల్లో భాగమై వాళ్ళ జీవనంలో కొనసాగించిన ఉద్యమకారుల స్థితి ఇది. అది గడ్చిరోలి నుంచి ఛత్తీస్ ఘడ్ ను దాటుకొని మల్కాన్గిరి వరకు కొనసాగిన స్థితి. ఈ పోరాట నేపథ్యంలోనే అనేక ఆదివాసీ పోరాటాలు జరిగాయి. ఆ క్రమంలోనే 1996 పేసా చట్టం, 2006 అటవీ హక్కుల చట్టం. లాంటివి సాధించుకోగలిగారు. అని ఇప్పుడు ఆ చట్టాలను ఉల్లంఘిస్తూ ఉన్న చట్టాలకు కూడా అనేక సవరణలు చేస్తూ ఆదివాసీ అటవీ భూములను కార్పొరేట్లకు అప్పగించే స్థితికి ప్రభుత్వం నెట్టబడింది. అటే ప్రభుత్వం కార్పొరేట్లతో పూర్తిగా కలిసిపోయింది. కార్పొరేట్ల లాభాలే పాలక వర్గాల లాభాలుగా మారాయి. దీంతో కోట్లది విలువైన సహజ సంపదతో ఏవైతే దండకారణ్యంగా పిలవబడుతున్న అడవి ఉందో ఆ అడవిపై కార్పొరేట్ల దుర్మార్గమైన కన్ను పడింది. అనాటి నుండి ఈనాటి వరకు ఆదివాసీల రక్తం ఏరులై పారుతున్నది. 1991 జన్ జాగరణ్ అభియాన్ కావచ్చు. 2005 సల్వాజుడుం కావచ్చు. 2009 గ్రీన్ హంట్ కావచ్చు. 2017 సమాధాన్ కావచ్చు చివరికి నేడు 2024 నుంచి కొనసాగుతున్న ఆపరేషన్ కగార్ కావచ్చు. ఈ కగార్ ఉద్యమాన్ని నిర్మూలిస్తామని రెండు ఏళ్ళ క్రితమే స్పష్టంగా తేదీని కూడా ప్రకటించింది. అంటే దానికి ఉద్యమంలో ఉన్న మూలాలు, లోపాలు, కోవర్టు ఇన్ఫార్మర్ నెట్వర్క్ యుద్ధ సాంకేతిక ఆధునిక కమ్యూనికేషన్ సిస్టమ్ యుద్ధ విమానాలు, యుద్ధ హెలికాప్టర్లు డ్రోన్లతో సహ ఇజ్రాయెల్ టెక్నాలజీని పూర్తిగా వాడుకుంటూ ఆదివాసీల కోసం బలంగా పనిచేస్తున్న మావోయిస్టు ఉద్యమాన్ని నిర్మూలిస్తామని స్పష్టంగా ప్రకటించింది. కానీ ఈ ఉద్యమంలో 17 ఏళ్ళ వయసులోనే ప్రవేశించిన హిడ్మా లాంటి ఆదివాసీ యువకుడు ఉన్నాడనే విషయం హిడ్మా మరణం తరువాత వెలుగులోకి వచ్చింది. హిడ్మా లాంటి ఆదివాసీలు ఈ ఉద్యమానికి ప్రాణాలను దారపోసారు. అందులో భాగంగానే క్రింది స్థాయి నుండి ఒక ఆదివాసీగా ప్రవేశించిన హిడ్మా కేంద్ర కమిటి స్థాయికి కూడా ఎదగగలిగింది. అయితే ఇప్పటికీ చాలా మంది అంటారు కేవలం తెలంగాణ, ఆంధ్ర నుంచి వచ్చిన వారి నాయకత్వంలోనే ఈ ఉద్యమం కొనసాగుతుందని మాట్లాడుతూనే ఉన్నారు. కానీ విషయమేమిటంటే ఏవైతే ఆదివాసీలు సాధించుకున్న చట్టాలు ఉన్నాయి ఆ చట్టాలు అమలు కాక, చట్టాల అమలు కోసం మాట్లాడిన వాళ్ళను అర్బన్ నక్సల్స్ గా పోరాడుతున్న వాళ్ళను నక్సలైట్లుగా ప్రకటిస్తూ వాళ్ళు సాయుధ పోరాటం చేస్తున్నారనే నెపంతో రాజ్యాంగ విరుద్ధంగా హత్యలు చేస్తూ ఎన్కౌంటర్గా ప్రకటించడమనేది ఐదు దశాబ్దాలుగా నడుస్తున్న చరిత్ర.

తెలంగాణలో ఆనాటి ఉద్యమ పార్టీ విద్యార్థి యువజన రైతు కూలీ మహిళా ఉద్యమాలతో అనేక వర్గాలను వారి వారి హక్కుల కోసం పోరాటంలోకి తీసుకురాగలిగారు. అందులో ప్రధానమైంది జగిత్యాల సిరిసిల్లా రైతాంగ ఉద్యమం. ఆ తరువాత తెలంగాణలో ప్రత్యేకించి బలంగా కొనసాగింది సింగరేణి కార్మిక సమాఖ్య ఉద్యమం. అదే స్థాయిలో విద్యార్థి ఉ ద్యమం కూడా కొనసాగి అనేక మంది విద్యార్థులకు ప్రజా విముక్తి పట్ల దిశానిర్దేశం చేయగలిగింది. ఆ క్రమంలోనే రైతుల ఆత్మహత్యలనేవి లేకుండా పోయింది. అయితే ఉద్యమ పార్టీతో పాటు ఉద్యమం యొక్క అనుబంధ సంఘాలను కూడా నిషేదాలకు గురి చేయడం వల్ల తెలంగాణలో హక్కుల ఆణచివేత అనేది బలంగా కొనసాగుతుంది. చివరికి విద్యా వ్యవస్థలో కూడా అనేక లోపాలు కొనసాగబడి చివరికి విద్యార్థులు కూడా ఆత్మహత్యలు చేసుకునే స్థితికి నెట్టబడింది. మహిళల విషయంలో అయితే వరకట్నం. కుల అణచివేత అనేవి చాలా దూరంగా ఉండేది, కాని ఎప్పుడైతే ఉద్యమ పార్టీ బలహీనత లోంచి సనాతన ధర్మం, హిందూ ఫాసిస్టు విదానాల అమలు మూలంగా భూస్వామ్య వ్యవస్థ స్థితులు మళ్ళీ బలంగా ముందుకు వస్తున్నాయి. కానీ ఇదే స్థితి ఉద్యమం ఉన్న ఆదివాసీ ప్రాంతాల్లో లేకుండా పోయింది. ఇక్కడ ఆత్మహత్యలు మహిళలపై అణచివేత అనేది లేకుండా పోయింది. అందుకే అక్కడ ఉద్యమమంటే సగానికన్నా ఎక్కువగానే మహిళలతో నిండిపోయింది. ఈ స్థితిలో ఆదివాసీ ప్రజలు ఉద్యమానికి చాలా దగ్గరగా కొనసాగుతూ వస్తున్నారు. అందులో భాగంగానే హిడ్మా ఉద్యమంలో భాగమై చదువు నేర్చుకొని రాజకీయాలపై పట్టు సాధించి ఆదివాసీల విముక్తి కూడా ఈ ఉద్యమంలో దాగి ఉందని ఆ ఉద్యమానికే నాయకత్వం వహించే స్థాయికి ఎదిగాడు. ఈ ఎదిగిన మనిషిని గూర్చి మీడియా ప్రజలు మాట్లాడకుండా అతను చేసిన రాజకీయ పరమైన దాడులను హత్యలను చాలా గొప్పగా చనిపోక ముందు చూపెట్టడం జరిగింది. చనిపోయాక మాత్రం అతన్ని నేరస్తుడిగా చిత్రీకరించే విధంగా అన్ని మీడియాలు ప్రయత్నం చేసాయి. మొత్తంగా మీడియా మొత్తం కూడా బిజెపి ఆధ్వర్యంలోకి వెళ్లిపోయిన స్థితిలో నిజమైన వార్తకు స్థానం లేకుండా పోయింది. ప్రభుత్వం ఎప్పుడు కూడా రాజ్యాంగంలో పేర్కొనబడిన చట్టాల గురించి మాట్లాడదు. వీలైతే బలమైన చట్టాలను సవరణలు చేసి వాటిని ఏ విధంగా బలహీనపర్చాలనే ప్రభుత్వాలు ప్రయత్నం చేసాయి. ఈ నేపథ్యంలో ఆదివాసీ ఉద్యమాలు అంటేనే అని ఉద్యమ పార్టీ నిర్మిస్తున్న ఉద్యమాలుగా దేశమే కాదు ప్రపంచమే గుర్తించే స్థాయికి ఆ ఉద్యమాలు ఎదిగాయి. కానీ హిడ్మా కుటుంబమంతా ఉద్యమంలోనే ప్రాణాలు దారపోసింది. ఒక్క తల్లి మాత్రమే బ్రతికింది. ఆ తల్లిని కూడా మోసం చేయాలనుకున్న చత్తీస్ ఘడ్ ఉప ముఖ్యమంత్రి విజయ్ శర్మ హిడ్మా వాళ్ళ చేతిలో బందీగా ఉన్నప్పుడే ఆ తల్లిని కలిసి కొత్త బ్లాంకెట్ ఇచ్చి నీ కొడుకును పరెండ్ కావాలని చెప్పి ఒక పిలుపు ఇచ్చి వారం తిరగకుండానే హిడ్మా శవాన్ని ఆ తల్లికి పంపించిన స్థితిని మనం చూస్తున్నాం.

ఎందుకు హిడ్మాను మనం ఆదివాసీలకు కొమురం భీం తరువాత బిర్సా ముండా, గూండాధర్ తరువాత, వారి నాయకుడిగా చెలామణి అవుతాడని విశ్వపిస్తున్నామంటే ఇంకా ఆదివాసీ సమాజంలో ఆదివాసీల కోసం పోరాడిన వాళ్ళను వాళ్ళ కోసం ప్రాణమిచ్చిన వాళ్ళను మరచిపోలేని సంస్కృతి ఆదివాసీల్లో కొనసాగుతుంది. ఒక వైపు ఆదివాసీల జీవనం నిత్యం భయం భయంగా విద్యకు, వైద్యానికి జీవనోపాధికి దూరంగా ఉన్నప్పటికి అడవిని మాత్రం వదలకుండా అడవే ఆధారంగా జీవిస్తున్న ఆదివాసీలకు హిడ్మా లాంటి నాయకుడు వాళ్ళకొక పోరాట స్ఫూర్తి, వాళ్ళలోని ఒక వ్యక్తి వాళ్ళ జీవితంలో మార్పు తీసుకురావడం కోసం తన విలువైన ప్రాణాల్ని వాళ్ళ ముందరే వలదలడం అనే స్థితిని ఆదివాసీలు తరతరాలు మారినా మరచిపోతేని స్థితి ఉంది. ప్రభుత్వాలు ఆదివాసీ నాయకత్వం తెలిసినప్పటికి ఎందుకు హత్య చేశారంటే మిగతా నాయకత్వాన్ని ఎవరినైనా ఏదో రకంగా భ్రమలకో, బలహీనతకో గురి చేసే అవకాశం ఎక్కువగా ఉంది. అందులో భాగంగానే కొంత మంది నాయకత్వం కూడా 5 దశాబ్దాల దారి సరియైంది కాదంటూనే ఉన్నతమైన దారి గురించి ప్రస్తావించకుండానే వెనుదిరిగిన స్థితిలో ఆదివాసీలు మాత్రం ఆ పోరాటాన్ని వదలలేరన్నది సోని పోరి మాటల్లో బయటపడ్డ విషయం వాస్తవం. పోరాటం కొనసాగుతున్నది. నాయకత్వం పలాయనం చెందింది. అయినప్పటికి ఆదివాసీలు పోరాటం చేస్తారు. న్యాయంగా రావాల్సిన వాళ్ళ హక్కులకై ఎంతటి రక్తాన్నైనా చిందిస్తారని ఆదివాసీలు మాట్లాడుతున్నారు. ప్రభుత్వం ఉద్యమాన్ని నిర్మూలించడానికి తేదీలు నిర్ణయించి అనేక రకాల కుట్రపూరిత చర్యలతో నాయకత్వాలను ఆదివాసీలను ఆదివాసీ మహిళలను అత్యంత కిరాతకంగా హత్య చేస్తున్న స్థితిని మనందరం చూస్తున్నాం. ప్రభుత్వాలు పాలన చేయాలి. నేరం చేస్తే న్యాయవ్యవస్థ ద్వారా శిక్షించాలి. అలా కాకుండా ఉద్యమకారులు నేరం చేస్తున్నారని చంపేస్తానని బహిరంగంగా ప్రకటించి తేదీలు నిర్ణయించి లెక్కలేవీ తూటాలతో అన్ అకౌంటెడ్ డబ్బుతో చేస్తున్న ఆకృత్యాలకు అదుపే లేదు. ఇది ప్రభుత్వాలను ఇప్పుడు ప్రజలు ప్రశ్నించలేకపోవచ్చు ఎందకంటే ప్రశ్నించి ప్రతి వాడిని అర్బన్ నక్సల్ పేరుతో ఉ పా నిర్బంధానికి గురిచేస్తున్న స్థితిలో బుద్ధిజీవులు, మేధావులు నిజంగానే ప్రశ్నించలేని స్థితిలో ఉన్నారు. విప్లవం కన్నా ఆదివాసీ సమాజంలోదండకారణ్యంలో వాళ్ళు సాధించుకున్న రాజ్యాంగపరమైన చట్టాలు అమలు కాగలిగితే ఆదివాసీలు ధైర్యంగా జీవించే అవకాశం ఏర్పడి ఉంది. కానీ రాజ్యాంగ పరంగా సాధించుకున్న హక్కులకు కూడ అమలుకు అవకాశం లేని కారణంగానే ఆదివాసీ ఉద్యమాలు బలంగా ముందుకు వస్తున్నాయి. అంతేకాకుండా 1989లో వచ్చిన ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కూడా ఆచరణలో విఫలమైందనేది మన ముందున్న నగ్న సత్యం. చివరికి న్యాయ వ్యవస్థ కూడా విఫలమైన నేపథ్యంలో ఆదివాసీలు దళితులు ఎవరైనా సరే ఏదో ఒక ఉద్యమాల్లో కొనసాగివేతే వాళ్ళ వాళ్ళ హక్కులను రక్షించుకోగలరు, అమలు పరచుకోగలరు ఆ స్థితి కొనసాగకపోతే ఖచ్చితంగా ప్రజల్లో ఒక మూకుమ్మడి తిరుగుబాటుకి అవకాశం ఏర్పడుతుంది.. దాన్ని తట్టుకోవడం ప్రభుత్వాలుగా ఏ పార్టీ పాలక వర్గం ఉన్నప్పటికి వాటికి సాధ్యం కాదు. ఈ వాస్తవాన్ని గుర్తించి హిడ్మాను హత్య చేసిన ప్రభుత్వం న్యాయపరంగా కేసు నమోదు చేసి శిక్షించాల్సిన అవసరం ఉంది.



ఎన్. నారాయణ రావు
ప్రధాన కార్యదర్శి
పౌరహక్కుల సంఘం

## తెలంగాణలో స్థానిక ఎన్నికల జోరు
## బీసీ రిజర్వేషన్ ప్రతిఘటనలో
# కాంగ్రెస్ ధీమా!



తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మళ్లీ రాజకీయ వాతావరణాన్ని కదిలిస్తోంది. ముఖ్యంగా బీసీలకు 42% రిజర్వేషన్ అమలు చేయాలన్న కాంగ్రెస్ ప్రభుత్వ ప్రయత్నాలు విఫలమవడం ఈ ఎన్నికలకు ప్రత్యేక రాజకీయ బరువు తెచ్చింది. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వంపై ప్రజాభిప్రాయం, ప్రతిపక్షాల వ్యూహాలు, అధికార పార్టీ కౌంటర్ స్ట్రాటజీలు, అలాగే ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ విజయం తదితర అంశాలు మొత్తం కలిసి ఈ స్థానిక సంస్థల ఎన్నికలను మరింత కీలకంగా మార్చుతున్నాయి. ఈ నేపథ్యాన్ని సమగ్రంగా పరిశీలించితే తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం ఏర్పడిన చలనశీలతను అర్థం చేసుకోవచ్చు.

తెలంగాణలో అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు కీలక గ్యారెంటీలను అమలు చేశామని, బడుగు బలహీన వర్గాలపై భారం పడకుండా సంక్షేమ కార్యక్రమాలను వేగంగా చేపట్టామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచే విధంగా ప్రచారం చేసింది. గృహలక్ష్మి, చెయ్యూత, రుతుపవనము, రైతులకు మద్దతుగా తీసుకొచ్చిన పలు నిర్ణయాలు, విద్యుత్తు వినియోగదారులకు ఇచ్చిన హామీల అమలు వంటి అంశాలు గ్రామీణ స్థాయిలో మెదులుతున్నాయి. ఈ సంక్షేమ పథకాలపై ప్రజల్లో ఏర్పడిన నమ్మకం ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో స్పష్టంగా ప్రతిబింబించింది. ఆ విజయం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న పాజిటివ్ భావన సుమారు 55–60% వరకు ఉన్నట్లు పోలింగ్ ధోరణులు సూచిస్తున్నాయి. అదే సమయంలో ఇతర పార్టీలపై ప్రజల నమ్మకం 25–30% వరకే పరిమితమైందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్పై అసంతృప్తి , బీజేపీపై అనిశ్చితి ఈ శాతం తగ్గడానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి.

ఈ పరిస్థితుల్లో బీసీలకు 42% రిజర్వేషన్ ఇవ్వాలన్న ప్రభుత్వ ప్రయత్నం న్యాయపరంగా నిలదొక్కుకోకపోవడంతో ప్రభుత్వం పాత రిజర్వేషన్ విధానాన్ని అనుసరించాల్సిన పరిస్థితి వచ్చింది. ఇది ప్రతిపక్షాలకు ముఖ్యంగా బీఆర్ఎస్, బీజేపీలకు చేతికొచ్చిన అవకాశంగా మారింది. బీసీ వర్గాల్లో అసంతృప్తిని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తూ, కాంగ్రెస్ బీసీలను మోసం చేసిందని ప్రచారం చేసే అవకాశం ప్రతిపక్షాలకు దొరికింది. వీటితో పాటు ఎన్నికలు త్వరితగతిన జరిగితే, బీసీ ఓటర్ల ఆగ్రహం తమ వైపుకు మళ్లే అవకాశం ఉందని ప్రతిపక్ష పార్టీలు భావిస్తున్నాయి. ప్రత్యేకంగా బీజేపీ, బీసీ రిజర్వేషన్ల అంశాన్ని జాతీయ స్థాయిలోనూ హైలైట్ చేస్తూ కాంగ్రెస్ను బలహీనపరచే ప్రయత్నం చేస్తోంది.

అధికార పార్టీ దీనికి కౌంటర్గా చేపట్టబోయే వ్యూహం మరింత ఆసక్తికరంగా మారనుంది. బీసీ రిజర్వేషన్ పెంపు కోసం ప్రభుత్వం అన్ని న్యాయపరమైన అవకాశాలను అన్వేషిస్తున్నామని, సమాజ న్యాయానికి అంకిత భావంతో పనిచేస్తున్నామని ప్రచారం చేస్తూ ప్రతిపక్షాల ప్రచారాన్ని నిష్ప్రభం చేయడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తుంది. ఇప్పటికే జూబ్లీహిల్స్ విజయం తమ పాలనపై ఉన్న ప్రజాభిమానానికి నిదర్శనమని, ఆరు గ్యారెంటీల అమలు వల్ల ప్రభుత్వం పట్ల విశ్వాసం పెరిగిందని గ్రామ నుండి నగరం వరకు ప్రచారం పెరుగుతుంది. ఈ ఎన్నికల్లో సంక్షేమ ఆధారిత ప్రచారం, డెలివరీ మెకానిజం మజ్బూత్గా ఉందని నిరూపించడమే కాంగ్రెస్ ప్రధాన వ్యూహమవుతుంది. ప్రతిపక్షాల విషయంలో, బీఆర్ఎస్కు ఇది రాజకీయ పునరుద్ధరణ యుద్ధంలా మారింది. పార్టీ ఆధార బలం తగ్గిపోవడం, నేతల్లో నిరుత్సాహం, గ్రామీణ స్థాయిలో క్యాడర్ నిర్వీర్యం అవ్వడం వంటి సమస్యలను ఈ ఎన్నికల ద్వారా మార్చుకోవాలని బీఆర్ఎస్ భావిస్తోంది. అందుకే బీసీ రిజర్వేషన్ అంశాన్ని అత్యధికంగా ఉపయోగించుకోవాలని ప్రయత్నిస్తుంది. బీజేపీ అయితే కాంగ్రెస్ ప్రత్యామ్నాయం కావచ్చన్న సందేశాన్ని ప్రజల్లో నాటే ప్రయత్నంలో ఉంది. జాతీయ నాయకుల ప్రచారాన్ని, కేంద్ర పథకాల ప్రచారం, ముఖ్యంగా బీసీ సామాజిక న్యాయంపై తమ వైఖరిని హైలైట్ చేస్తూ ఓట్లను సమీకరించే ప్రయత్నం చేస్తోంది.

అయితే ప్రజాభిప్రాయాలు ప్రస్తుతం చూస్తే కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకం అధికంగా ఉంది. ఉప ఎన్నికల ఫలితాలు, సంక్షేమ పథకాల ప్రభావం, బీఆర్ఎస్ బలహీనత, బీజేపీపై ప్రజల్లో ఉన్న అనిశ్చితి కలిపి కాంగ్రెస్ను స్థానిక సంస్థల ఎన్నికల్లో బలమైన స్థితి వద్ద నిలిపాయి. ప్రజల్లో సుమారు 60% వరకు సంక్షేమ పథకాల పట్ల సంతృప్తి ఉందని, 30% వరకు ప్రత్యామ్నాయం గురించి ఆలోచించే వర్గం ఉందని, 10% మాత్రం అసమ్మతి లేదా నిశ్చయించుకోని వర్గంగా మిగులుతున్నట్లు రాజకీయ అంచనాలు సూచిస్తున్నాయి.

ఈ నేపథ్యాన్ని మొత్తం పరిశీలిస్తే, తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు రాష్ట్ర రాజకీయాలకు కీలక మలుపు కానున్నాయి. బీసీ రిజర్వేషన్ అంశం, ఉప ఎన్నికల ప్రభావం, ఆరు గ్యారెంటీల అమలు, ప్రజాభిప్రాయాల్లోని ఊగిసలాటుగా ఈ ఎన్నికలను సర్వసాధారణ ఎన్నికలకంటే అత్యంత ప్రాధాన్యమైన రాజకీయ పరీక్షగా నిలిపాయి. ప్రతి పార్టీకి ఇది తన రాజకీయ భవితవ్యం కోసమే కాక తెలంగాణలోని సామాజిక సమీకరణ, పాలనాపరమైన విశ్వసనీయత, ప్రజాస్వామిక బలం నిరూపించుకోవాల్సిన కీలక సమయం.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

## మన దేశం!

దేశమంటేమనుషులోయ్
కాని వర్ణవిభజనోయ్!
అవిచాతుర్వర్ణాలోయ్
విడగొట్టినదిఎవరోయ్?
ఎందుకువిడగొట్టారోయ్
ఎవరి సౌలభ్యం కోసం?
పాలనా సౌలభ్యమా?
పాలకుల సౌలభ్యమా?
ఇప్పటికీ పాలకులు
ఏ వర్ణాలవారు?

బిసి కులాలను
ఎందుకు లెక్క తేల్చరు?
దళితులెలా వచ్చారు?
వాళ్లుఅంటరానివారా?
మతాలసృష్టిఎవరిది?
ఈమతాలుఏంచేసాయ్?
సనాతనధర్మాలు
రాసింది ఎవరు?
అందరికీ చదువులు
ఎందుకు లేవు?
విదేశాలువెళితే
వాళ్లు అప్రాచ్యులా?

'మీ'ధర్మాలుపాటించక
పోతే-వాళ్లుమ్లేచ్ఛులా?
దేవుళ్లను కూడా
మీరేగా సృష్టించినది!
మతమూ దేవుడు
చారిత్రక అవశేషాలు!
సైన్స్ వచ్చాక
నిజాలు తెలిసాయి!
ఇంకా అజ్ఞానంలోనే
ప్రజల్ని ఉంచుతారా?
ఇతరగ్రహాల్లోకి
మనిషి ప్రయాణం!

ఇంకా సనాతన
అబద్ధాలే చెపుతారా?
వెనక్కు తీసుకుపోతేనే
దేశాభివృద్ధి కదూ!
సనాతన ధర్మాలు కాదు
వైజ్ఞానిక ధర్మాలుకావాలి!
విజ్ఞానం తోనే
అభివృద్ధి సాధ్యం!
విజ్ఞానాన్నిసొంతలాభాలకు
వాడుకుంటారా?
అప్పుడు ఇప్పుడు
ఇదేపనిలో పాలకులు!

అందుకే 'మనదేశం'
131వ స్థానంలో ఉంది!
సొంతలాభం కొంత
మానుకోమన్నాడు!
గురజాడకు మార్క్సిజం
తెలియకఅలాఅన్నాడు!
'కొంత'కాదు 'మొత్తం'
సంపదలన్నీప్రజలవే!
దేశమంటేమనుషులోయ్
గురజాడ గొప్పనినాదం!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

# శతాబ్దాల తరబడి కొనసాగిన అణచివేత, ఆధిపత్యం


అతను గతి తర్క తత్వ దర్శన భూమికను తీవ్రంగా అధ్యయనం చేసి, దానిపై అనేక తరగతులు మరియు చర్చలకు హాజరైన తర్వాత దానిని రాశాడు, కాబట్టి నేను దానిని ప్రచురించాలని నిర్ణయించుకున్నాను. శ్రామిక వర్గం ఒకే ఏకశిలా కాదు. అందువల్ల, తత్వశాస్త్రం మరియు జ్ఞాన శాస్త్రం విస్తరిస్తూనే ఉన్నాయి. కొన్ని హెగెల్ వద్ద ఆగిపోయాయి. మార్క్స్ హెగెల్లో సగం మాత్రమే తీసుకొని ముందుకు సాగాడు.

భారతదేశంలో, కుల వ్యవస్థ, దాని సంస్కృతి, శతాబ్దాల తరబడి కొనసాగిన అణచివేత మరియు ఆధిపత్యం కారణంగా, ఉత్పాదక, శ్రమించే కులాల (శ్రామిక కులాలు) నుండి ఉద్భవించే కార్మిక వర్గం, వాటి నుండి వచ్చే కార్మిక వర్గ నాయకత్వం, వారి అనుభవాలు మరియు వారి ప్రాధాన్యతలు పూర్తిగా భిన్నంగా ఉంటాయి. ఈ శ్రమజీవులైన, ఉత్పాదక కులాల నుండి ఉద్భవించే మధ్యతరగతి భిన్నంగా ఉంటుంది. ఈ ఉత్పాదక, శ్రమజీవ కులాల నుండి ఉద్భవించే జాతీయ బూర్జువా వర్గం భిన్నంగా ఉంటుంది.

వారి ప్రాథమిక డిమాండ్లు విద్య, ఉపాధి, సమానత్వం మరియు ఉద్యోగాలు. చారిత్రాత్మకంగా అగ్రవర్ణాలుగా ఆధిపత్యాన్ని అనుభవించిన వారి దృక్పథం పూర్తిగా భిన్నంగా ఉంటుంది. వారు ఎల్లప్పుడూ ఇతరులను ఆజ్ఞాపించడానికి మరియు ఆధిపత్యం చెలాయించడానికి ప్రాధాన్యత ఇస్తారు. అందుకే వారు రాజ్యాధికారం కోసం మాత్రమే తమ చేతులను చాపుతారు. సమాజం మారకపోయినా, అందరూ విద్యావంతులు కాకపోయినా, అందరూ పేదరికం నుండి తప్పించుకోకపోయినా, వారు తీవ్రంగా పట్టుబడుతున్నారు: "మనకు రాజ్యాధికారం ఉండాలి, మనం అధికారంలోకి రావాలి." అగ్రవర్ణ నాయకత్వం నేతృత్వంలోని ఉద్యమాలు ఎల్లప్పుడూ అలాగే ఉంటాయి.

స్త్రీవాదులు మరియు ఉత్పాదక, శ్రామిక కులాల నుండి వచ్చిన వ్యక్తులు, స్త్రీలు, స్త్రీవాదులు మరియు విద్యావంతులైన వ్యక్తులు కార్మిక వర్గ నాయకత్వాన్ని అందించేటప్పుడు, మొదట ఇలా అంటారు: "మనపై విధించబడిన అణచివేత, దోపిడీ, హింస మరియు పేదరికం పోవాలి. మనకు స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం, ఆత్మగౌరవం, మన స్వంత ప్రాతినిధ్యం మరియు మన హక్కుగా లభించే వాటా కావాలి." వారు సామాజిక సంస్కరణ, సార్వత్రిక విద్య మరియు అందరికీ ఉపాధి అవకాశాలను డిమాండ్ చేస్తున్నారు. అగ్రవర్ణ నాయకత్వం దీనిని వ్యతిరేకిస్తుంది మరియు దీనిని "ఈ విద్యా వ్యవస్థ అశాస్త్రీయమైనది" అని ముద్ర వేస్తుంది. ఇది ఉద్యమాన్ని మళ్లిస్తుంది, కార్యకర్తలను నియమించుకోవడానికి అనుకూలమైన నినాదాలు మరియు కార్యక్రమాలను సృష్టిస్తుంది మరియు "రాజ్యాధికారం, రాజ్యాధికారం" అని పదే పదే చెబుతూనే ఉంటుంది. అందువల్ల, తరగతి ఒకేలా ఉన్నప్పటికీ, అవసరాలు, అనుభవాలు, ప్రాధాన్యతలు, నినాదాలు మరియు కార్యక్రమాలు పూర్తిగా భిన్నంగా ఉంటాయి.

ఉదాహరణకు, ఉపాధ్యాయ మరియు ఉద్యోగ సంఘాలలో, దళిత ఉపాధ్యాయ మరియు ఉద్యోగి ఎదుర్కొంటున్న సమస్య – గ్రామాల్లో అద్దె ఇళ్ళు దొరకకపోవడం, కుల వివక్షను ఎదుర్కోవడం – ఎప్పుడూ ప్రధాన డిమాండ్ లేదా ఎజెండా అంశంగా మారలేదు. దీని అర్థం దాదాపు అన్ని అటువంటి సంఘాలు ఆ సమస్యలతో తాకబడని అగ్ర కుల నాయకత్వంలో కొనసాగుతున్నాయి. కుల సమస్యలను విస్మరించినప్పుడు, జాతీయత ప్రశ్న, స్థానిక బూర్జువా ప్రశ్న మరియు మహిళల ప్రశ్న అన్నీ తగ్గించబడి ఉన్నత కులాల సమస్యలు, ఆధిపత్యం మరియు పరిష్కారాలకే పరిమితం అవుతాయి. ప్రత్యక్ష అనుభవం లేని జ్ఞానం వింత వక్రీకరణలకు దారితీస్తుంది.



ప్రత్యక్ష అనుభవంలో పాతుకుపోయిన జ్ఞానం వాస్తవికంగానే ఉంటుంది. అనుభవం లేని జ్ఞానం వాస్తవికతకు విరుద్ధమైన సిద్ధాంతాలు, సిద్ధాంతాలు, జ్ఞానశాస్త్రాలు మరియు చారిత్రక భౌతికవాదాలను ఉత్పత్తి చేస్తుంది. ఇది వాస్తవానికి మార్క్సునే ప్రారంభమైంది. ఎలాగో చూద్దాం.

### మార్క్సిజంలో అర్ధ సత్యాలు

హెగెల్ తన సిద్ధాంతాన్ని రూపొందిస్తూ, రెండు సూత్రాల గురించి మాట్లాడాడు: పరిమాణాత్మక మార్పు, గుణాత్మక మార్పు మరియు నిరాకరణ (అభవ). నిరాకరణతో పాటు, హెగెల్ కూడా ఉపసంహరణ (ఔఫెబుంగ్) గురించి మాట్లాడాడు. ఉపసంహరణ అంటే పాతది మిగిలిపోతుంది మరియు కొత్తది కూడా ఉద్భవిస్తుంది. మార్క్స్ నిరాకరణకు మాత్రమే కట్టుబడి, ఉపవ్యవస్థను తొలగించాడు. అందువల్ల పెట్టుబడిదారీ తరగతి మరియు పెట్టుబడిదారీ వ్యవస్థ నిరాకరణకు గురవుతుందని మరియు కార్మికవర్గ వ్యవస్థ దాని స్థానంలోకి వస్తుందని ఆయన ప్రకటించారు.

వాస్తవానికి, కార్మికవర్గ నాయకత్వం మూలధనం మరియు రాష్ట్ర అధికారంపై అధికారాన్ని స్వాధీనం చేసుకుని, పెట్టుబడిదారీ స్వభావాన్ని స్వీకరించింది, కానీ సాధారణ కార్మికులకు మూలధనంలో కనీస వాటాలు లేదా భాగస్వామ్య హక్కులు కూడా ఇవ్వబడలేదు. ఆ చర్చను ప్రస్తుతానికి పక్కన పెడదాం.

ఇప్పుడు ఉపవ్యవస్థను చూడండి: పాతది మిగిలిపోయింది, కొత్తది కూడా ఉద్భవిస్తుంది. ఒక చెట్టు మిగిలి ఉంది, అయినప్పటికీ దాని విత్తనాల నుండి అనేక తరాల కొత్త చెట్లు మొలకెత్తుతూ మరియు పెరుగుతూనే ఉంటాయి. కుమారులు, మనవళ్ళు మరియు మునిమనవళ్ళు పుట్టి పెరుగుతున్నప్పుడు తాతామామలు జీవిస్తారు. అందువల్ల, ప్రకృతిలో మరియు సమాజంలో, ఉనికిలో ఉన్నది ఉపవ్యవస్థ, ఎప్పుడూ స్వచ్ఛమైన నిరాకరణ కాదు. మూలధనం రద్దు చేయబడదు. కార్మికవర్గ నాయకత్వం కేవలం పూర్వ పెట్టుబడిదారుల స్థానాన్ని ఆక్రమించింది. అదే జరిగింది.

రాజకీయ అధికారం చేరడంతో, వాటిని ప్రశ్నించే లేదా వ్యతిరేకించే ఎవరైనా నిరాకరణ సూత్రం ప్రకారం "ఉనికిలో లేకుండా చేయబడ్డారు". మన దేశంలో దీనిని "వర్గ శత్రువు నిర్మూలన" పేరుతో అమలు చేశారు. ఈ తప్పుడు సూత్రీకరణ కారణంగా, మార్క్సిజం ప్రపంచాన్ని లెక్కలేనన్ని వర్గ యుద్ధాల్లోకి లాగింది. తరగతుల మధ్య సంబంధాలు లేకుండా వర్గ వైరుధ్యాలు మరియు వర్గ యుద్ధాలు అసాధ్యం. ఆదివాసీ (గిరిజన) ప్రజలు ఇప్పటికీ సమాజంలో తరగతికి ముందు దశలోనే నివసిస్తున్నప్పుడు, వర్గ యుద్ధం అసాధ్యం. కార్మిక వర్గం పూర్తిగా ఉద్భవించినప్పుడే వర్గ యుద్ధాలు ప్రారంభమవుతాయి. కాబట్టి, ఆదివాసీలు మరియు కుల వ్యవస్థ బాధితులైన శూద్ర మరియు అతి శూద్ర కులాలను మొదట ఆధునిక అభివృద్ధిలో అత్యున్నత స్థాయికి తీసుకురావాలి.

**ఉపసంహారణ:** పితృస్వామ్య మరియు పురుష ఆధిపత్యాన్ని ఎదుర్కొన్న పాత మరియు కొత్త మహిళల సహజీవనం మరియు కలయిక, వలసవాదం మరియు అంతర్గత వలసవాద బాధితులు – విద్య, అధికారం, పరిశ్రమలు మరియు జీవితంలోని ప్రతి రంగంలోనూ అందరూ ఎదగడానికి మరియు అభివృద్ధి చెందడానికి వీలు కల్పించాలి. దీని కోసం, మనకు వ్యక్తిత్వ వికాస పుస్తకాలు, ఉచిత ఉన్నత విద్య, నిర్వహణ నైపుణ్యాల శిక్షణ మరియు ఉన్నత ఆకాంక్షలు మరియు గొప్ప ఆదర్శాల పెంపకం అవసరం.

ఆదివాసీలు, మహిళలు, వెనుకబడిన ప్రాంతాలు మరియు వెనుకబడిన కులాలు ఇతరులతో సమానంగా మాత్రమే కాకుండా, ఇతరుల కంటే ఉన్నతంగా ఎదగడానికి పాఠ్యాంశాలు, శిక్షణలు, సామాజిక సంస్కరణలు, కుల సంస్కరణలు, ప్రత్యేక అవకాశాలు మరియు ప్రోత్సాహకాలు అందించాలి. ఒకే జీవితకాలంలో, గుమస్తా నుండి గ్రూప్ 1 అధికారిగా, గ్రూప్ 2 నుండి ఐఏఎస్ వరకు, న్యాయవాది నుండి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా, సర్పంచ్ నుండి ముఖ్యమంత్రిగా, పాఠశాల ఉపాధ్యాయుడి నుండి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్గా ఎదగడం – ప్రతి రంగంలో ఈ రకమైన పైకి కదలిక నిజమైన పరిణామం. అప్పుడే గుణాత్మక పరివర్తన దశ వాస్తవానికి ఉద్భవిస్తుంది. ఇది హెగెల్ యొక్క సబ్లేషన్ యొక్క పూర్తి అర్థం.

అణచివేతను వదిలివేసి, మిగిలిన వాటిని మాత్రమే అంటిపెట్టుకుని ఉండటం ద్వారా, మార్క్స్ ఇప్పటికే అభివృద్ధి చెందిన ఆధిపత్య వర్గాలు, కులాలు, ప్రాంతాలు మరియు పురుషులు యథాతథ స్థితి మరియు ఆధిపత్యం ద్వారా ప్రతి రంగాన్ని ఆక్రమించుకోవడానికి తలుపులు తెరిచాడు. రష్యా, చైనా మరియు ఇతర ప్రాంతాలలో జరిగిన విప్లవాలలో, ప్రతిదీ స్వాధీనం చేసుకున్నది ఖచ్చితంగా మధ్యతరగతి వర్గాలే. నిజానికి, ఆ విజయాలు రెండు ప్రపంచ యుద్ధాలు మరియు అవి సృష్టించిన అవకాశాల పర్యవసానంగా వచ్చాయిబీ అవి మార్క్సిజం కారణంగా జరిగాయని చెప్పడం చెట్టు కింద ఎవరో మంత్రాలు జపిస్తున్నందున చింతపండు పండ్లు పడ్డాయని నమ్మడం లాంటిది. ప్రజలు భగవద్గీతను పట్టుకుని ఉరి ఎక్కి ఉండవచ్చు, కానీ గీత అర్జునుడికి "(యుద్ధంలో) చంపండి" అని చెప్పింది, "మిమ్మల్ని మీరు చంపుకోండి" అని కాదు.

### పాత అనుభవం నుండి కొత్త జ్ఞానం


నేను రాసిన తాత్విక పుస్తకాలు కొత్త అనుభవాలు మరియు పాత జ్ఞానం మీద పొరలు వేసిన కొత్త అధ్యయనాల ద్వారా రూపొందించబడ్డాయి. పాతది లేకుండా, కొత్తది ఉనికిలో ఉండదు. చెట్టు నుండి విత్తనాలు కొత్త చెట్లుగా మారినట్లే, పెద్దలు జీవించి ఉండగానే మనవరాళ్ళు మరియు మునిమనవరాళ్ళు జన్మించినట్లే – ఇది తత్వశాస్త్ర రంగంలో కొనసాగుతున్న అదే పరిణామ ప్రక్రియ. అందువలన, జ్ఞాన సిద్ధాంతాలు అభివృద్ధి చెందుతూనే ఉంటాయి: పాత అనుభవాల నుండి కొత్త జ్ఞాన సిద్ధాంతాలు ఉద్భవిస్తాయి. ఈ ప్రవాహంలో ఉద్భవించిన పుస్తకాలు "గతి తర్క తత్వ దర్శన భూమిక, మార్క్సిజం అంబేద్కరిజం, బౌద్ధ సోషలిజం" మరియు ఇతరాలు. వ్యక్తిత్వ వికాస సాహిత్యం, శిక్షణా కేంద్రాలు, నిర్వహణ నైపుణ్యాలు, స్వయం సహాయ పుస్తకాల అవసరం మరియు ఆవశ్యకత నిరంతరం పెరుగుతోంది. అధ్యయనం సాధనతో కలిపి, సామర్థ్యాలు, నైపుణ్యాలు రెండింటినీ పెంచుకున్నప్పుడు మరియు సంపాదించినప్పుడు మాత్రమే సమాజం అభివృద్ధి చెందుతుంది.

### అధికారం అందరికీ చేరదు

మనం "రాజ్యాధికారాన్ని స్వాధీనం చేసుకోవడం" గురించి మాత్రమే మాట్లాడుకుంటూ ఉంటే, చివరికి – తెలంగాణలో కోట్లాది మంది ప్రజల త్యాగాలు, ఉద్యమాలను కేసీఆర్ కుటుంబం స్వాధీనం చేసుకున్నప్పుడు జరిగినట్లుగా – కొంతమంది కొత్త ఆధిపత్యవాదులు మరియు కొత్త దోపిడీ వర్గాలు కుర్చీలపైకి ఎక్కి దోపిడీని కొనసాగిస్తున్నారు. రష్యా మరియు చైనాలలో మనం సరిగ్గా అదే విషయాన్ని గమనించవచ్చు.

అధికారం ఎప్పుడూ అందరికీ చేరదుబీ కొద్దిమంది మాత్రమే దానిని ఆనందిస్తారు. వాస్తవానికి అందరికీ అందించగలిగేది అభివృద్ధి, నైపుణ్యాలు, జీవన ప్రమాణాల మెరుగుదల మరియు విద్య. కాబట్టి "రేపటి" కోసం వేచి ఉండి, నేటి అభివృద్ధి మరియు అధికారాన్ని కొద్దిమంది చేతుల్లో వదిలి, "రేపటి అభివృద్ధి కోసం ఉద్యమం" లేదా "రాజ్యాధికారం" అని ఎందుకు అరవడం? ఆ పని ఇప్పుడే జరగాలి.

అందువల్ల, అభివృద్ధి కోసం, ప్రాతినిధ్యం కోసం, అధికారంలో భాగస్వామ్యం కోసం మరియు ప్రతి రంగంలో ప్రాతినిధ్యం కోసం కృషి చేయడం ప్రపంచ ప్రజల కర్తవ్యం. అందరికీ అవకాశాలు ఇచ్చినప్పుడు, అవి నిజంగా అందరికీ చేరినప్పుడు మాత్రమే, సమాజంలోని అన్ని సామర్థ్యాలు మరియు నైపుణ్యాలు వికసిస్తాయి మరియు నిజమైన మొత్తం సామాజిక అభివృద్ధి జరుగుతుంది.



- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

## మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడం ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే కాలే యాదయ్య



**చేవెళ్ల, నవంబర్ 24 (జనంసాక్షి) :** మహిళా సంఘాలను ప్రోత్సహించి వారిని ఆర్థికంగా శక్తివంతులుగా మార్చడం ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య తెలిపారు. సోమవారం చేవెళ్ల మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మహిళా సంఘాలకు రుణ సౌకర్యాలు, ప్రోత్సాహక పథకాల ద్వారా సంపత్తిని సృష్టించే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుంది అని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్లు దేవర వెంకట్ రెడ్డి, గోనె ప్రతాప్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఆగిరెడ్డి, మల్గారి జనార్దన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, బేగరి రాములు, వీరేందర్ రెడ్డి, మధుసూదన్ గుప్తా, పడాల ప్రభాకర్, బీమయ్య, శంకరయ్య, కార్తీక్ రెడ్డి, మద్దెల శ్రీనివాస్, పాండు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నిమ్స్ దవాఖానలో ఘనంగా ప్రొ.శాంతారామ్ గోల్డ్ మెడల్ కార్యక్రమం



**ఖైరతాబాద్, నవంబర్ 24 (జనం సాక్షి) :** నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) జనరల్ మెడిసిన్ విభాగం1983లో ప్రొ.శాంతారామ్ ఆధ్వర్యంలో ప్రొ.యు.ఆర్.కె.రాజు, ప్రొ.యు.ఎన్. దాస్, ప్రొ.వి.ఆర్. శ్రీనివాసన్, ప్రొ.జి.నరసింహులు లతో కలిసి ప్రారంభమైంది.ఆయన ప్రారంభించిన ఎం.డీ ప్రోగ్రామ్ నేడు 15 మంది రేసిడెంట్లతో విజయవంతంగా కొనసాగుతోంది. ప్రొ.శాంతా రామ్ 2003లో రిటైర్ అయ్యారు.ఆయన సేవలకు గాను నిమ్స్ యాజమాన్యం ఆయన పేరుతో గోల్డ్ మెడల్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ ప్రోగ్రామ్‌లో భాగంగా 2025 ఫిబ్రవరిలో మొదటి గోల్డ్ మెడల్ డా.సౌమ్యకు ప్రదానం చేయగా, రెండవ గోల్డ్ మెడ ల్ డా.సాయి విశాల్ కు శాంతా రామ్ చేతుల మీదుగా సోమవారం రోజు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం జనరల్ మెడిసిన్ విభాగాధిపతి ప్రొ. సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో, ప్రొ.నావల్ చంద్ర, ప్రొ. వై.ఎస్.న్ రాజు, ప్రొ.నాగేశ్వర్ రావు, ప్రొ.మల్లికార్జు న శెట్టి ల సహకారంతో జరిగింది. ఈ కార్యక్రమం లో డా.గంగాధర్, డా.శ్రీభూషణ్ రాజు, డా.సదా శివుడు, జనరల్ మెడిసిన్ విభాగ వైద్యులు పాల్గొ న్నారు.

## డ్రగ్స్ నియంత్రణకు ఎక్సైజ్ శాఖలను బలోపేతం చేస్తాం

- ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్
- బిజెఎంసిలో గండిపేట కొత్త ఎక్సైజ్ స్టేషన్ ప్రారంభం



**రాజేంద్రనగర్, నవంబర్ 24 (జనంసాక్షి) :** బండ్లగూడ జాగీర్‌లో గండిపేట నూతన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో డ్రగ్స్ నియంత్రణకు ఎక్సజ్ శాఖను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. కొత్త స్టేషన్లు ఏర్పాటు, సిబ్బంది నియామకం జరుగుతోందన్నారు. అలాగే శంషాబాద్‌లో జిల్లా ఎక్సజ్ సూపరిండెంట్ కార్యాలయ భవనం నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎక్సజ్ సూపరిండెంట్ కృష్ణప్రియ, డిప్యూటీ సూపరిండెంట్ శ్రీనివాస్ రెడ్డి, ఎస్‌ఎచ్‌ఓ దేవేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి అవార్డులను అందుకున్న మాధవన్‌జీ హాస్పిటల్




**మహేశ్వరం, నవంబర్ 24 (జనంసాక్షి) :** అవేర్ మాధవన్ జీ హాస్పిటల్ డాక్టర్లు విశిష్టమైన వైద్య సేవలు అందించినందుకు అంతర్జాతీయ సంస్థ నేషనల్ హెల్త్ కేర్ వెల్నెస్ సంస్థ అవేర్ మాధవన్ జీ హాస్పిటల్ కు నాలుగు జాతీయ స్థాయి అవార్డులను అందుకుందాన్ని అవేర్ మాధవన్ జీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ తరుణ్ అన్నారు.ఈ సందర్భంగా అవేర్ మాధవన్ జీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ తరుణ్ మాట్లాడుతూ...అవేర్ మాధవన్ జీ హాస్పిటల్ ఏడాది కాలంలోనే నాలుగు జాతీయ అవార్డులను అందుకుందన్నారు.మాధవన్ జీ హాస్పిటల్‌లో గత ఆరు నెలల నుంచి1500 మందికి విజయవంతంగా వైద్య సేవలు అందించామన్నారు. ఆర్థోపెడిక్ డిపార్ట్ మెంట్,గైనకాలజీ డిపార్ట్ మెంట్, జనరల్ మెడిసిన్ డిపార్ట్ మెంట్‌లో ప్రతిభ కనబరిచిన డాక్టర్లకు ప్రభాకర్ దూబ్బాసీ,హిమబిందు,ఆషిక రెడ్డి అవార్డులు అందుకున్నారన్నారు.అవేర్ మాధవన్ జీ హాస్పిటల్ కు జాతీయ స్థాయిలో గుర్తించినందుకు నేషనల్ హెల్త్ కేర్ వెల్నెస్ కు అవేర్ మాధవన్ జీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ తరుణ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలి

- అంతర్జాతీయ క్రీడాకారిని నందిని

**శామీర్‌పేట్, నవంబర్ 24 (జనం సాక్షి) :** అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కేలో ఇండియా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహిస్తున్న అస్మిత కేలో ఇండియా లీగ్ బాలికల అథ్లెటిక్స్ క్రీడలు స్థానిక తెలంగాణ క్రీడ పాఠశాలలో ఘనంగా ప్రారంభమయ్యాయి, ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అంతర్జాతీయ క్రీడాకారిని అగసర నందిని పాల్గొని మాట్లాడుతూ.. బాలికలలో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెతికి తీయడం కోసం జాతీయ స్థాయిలో శిక్షణ కోసం భారత ప్రభుత్వం, అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ పోటీలు బాలికలకు ఎంతో ఉపయోగంగా ఉంటాయని క్రీడలలో బాలికలు ముందుండే విధంగా ప్రోత్స హించాలని క్రీడలు మరియు చదువు సమాన స్థాయిలో స్వీకరిస్తూ ముందుకు సాగిపోవాలని తెలిపారు. క్రీడల వల్ల బాలికల్లో ఉన్నటువంటి సాంఘిక వెనకబాటుతనం పోతుందని క్రీడల్లో పాల్గొంటే అంతర్జాతీయ స్థాయిలో కూడా గుర్తింపు లభిస్తుందని కష్టపడి మేడ్చల్ జిల్లాకు తెలంగాణ రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఒక కృత నిత్యంతో సాధన చేసి అంతర్జాతీయ స్థాయిలో బహుమతులు సాధించగలిగారని తెలిపారు, విద్యార్థులు 2036 లో జరిగే ఒలంపిక్స్ కి సన్నద్ధం కావాలనే ఉద్దేశంతో ఈ క్రీడా పోటీలు నిర్వ హించడం జరుగుతుందని తెలిపారు,ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ సెక్రెటరీ రాజశేఖర్ మాట్లాడు తూ.. జాతీయస్థాయిలో నిర్వహిస్తున్నటువంటి అస్మిత లీకేలో ఇండియా పోటీలలో జిల్లా నుంచి ఇంత స్థాయిలో స్పందనరావటం అభినంద నీయమని క్రీడాకారులను అభినందించారు.జిల్లా నలుమూలల నుంచి 250 మంది బాలికలు పాల్గొనడం అభినందనీయమని తెలిపారు, బాలికలకు నిర్వహించిన రన్నింగ్ జంపింగ్ త్రోయింగ్ ఈవెంట్స్ లలో విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. మున్ముందు క్రీడాకారులు తల్లిదండ్రులకు తమ సొంత ప్రాంతానికి జిల్లాకు రాష్ట్రానికి దేశానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని అతిథులు బోధించారు, మొదటిసారిగా నిర్వహించిన అస్మికల్లి కిలో ఇండియా అథ్లెటిక్స్ పోటీలు విజయవంతం కావడం పట్ల అతిథులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అత్యనిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అబ్జర్వర్ కోచ్ లక్ష్మణ్




మాట్లాడుతూ.. క్రీడల్లో ముందుండే విధంగా బాలికలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో మేడ్చల్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆర్గనైజ్ సెక్రెటరీ కూరపాటి రాజశేఖర్, జాయింట్ సెక్రెటరీ రాజు, వైస్ ప్రెసిడెంట్ ఓ అశోక్, ప్రభుదాస్, నాగర్ కర్నూల్ సెక్రెటరీ డాక్టర్ స్వాములు, సమ్మయ్య, తెలంగాణ క్రీడ పాఠశాల అథ్లెటిక్స్ కోచ్ గోపాల్ రావు, మల్లికార్జున్, తిరుమలరావు, వీర మణికంఠ, వీర శేఖర్, శ్రీకాంత్, శ్రావణి వివిధ పాఠశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గీతంలో ఉత్సాహంగా ఎన్‌సీసీ దినోత్సవం




**పటాన్‌చెరు, నవంబర్ 24 (జనంసాక్షి) :** హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో సోమవారం 77వ ఎన్ సీసీ వ్యవస్థాపక దినోత్సవాన్ని దాదాపు 100 మంది క్యాడెట్లతో ఉత్సాహంగా నిర్వహించారు. 1948లో స్థాపించిన నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్ సీసీ), భారతదేశ యువతలో క్రమశిక్షణ, నాయకత్వం, సేవ, దేశ నిర్మాణాన్ని పెంపొందిస్తున్న విషయం విదితమే.ఈ వేడుకలు క్యాడెట్ల సమావేశం, కవాతుతో ప్రారంభమయ్యాయి. తరువాత గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు జెండా ఎగురవేయగా, క్యాడెట్లు ఎన్ సీసీ ప్రతిజ్ఞ చేసి, విధి, జాతీయ విలువల పట్ల వారి నిబద్ధతను పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నిజామాబాదులోని ఎన్ సీసీ గ్రూపు ప్రధాన కార్యాలయ గ్రూప్ కమాండర్ కల్నల్ రాజేష్ కపూర్ ఎఫ్ఎఫ్ఎఫ్ఎస్ పథకం కింద అదనంగా మరో 80 మంది క్యాడెట్లను మంజూరు చేశారని ప్రొఫెసర్ డీ.ఎస్.రావు వెల్లడించారు. దీని వలన గీతం క్యాడెట్ల సంఖ్య 160కి పెరిగి, దాదాపుగా రెట్టింపు అయిందని, ఇకమీదట పూర్తి కంపెనీగా పనిచేయడానికి వీలు కల్పిస్తుందన్నారు. సంగారెడ్డిలోని 33 (టి) బెటాలియన్ కింద పనిచేస్తున్న గీతం ఎన్ సీసీ గత ఐదేళ్లుగా శారీరక శిక్షణ శిబిరాలు, సాంస్కృతిక కార్యక్రమాలలో స్థిరంగా రాణించిందని రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ తెలిపారు. యువశక్తి - వికసిత్ భారత్ దార్శనికతకు అనుగుణంగా బాధ్యతాయుతమైన, దేశ భక్తి, క్రమశిక్షణతో కూడిన యువతను రూపొందించడంలో ఎన్ సీసీ కీలక పాత్ర పోషిస్తోందని ఆతిథ్య విభాగం-క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎన్ సీసీ అండర్ ఆఫీసర్ల సహకారంతో, కేర్ టేకింగ్ ఆఫీసర్ అజయ్ కుమార్ సమన్వయం చేశారు. వివిధ కార్యక్రమాలలో రాణించిన అత్యుత్తమ క్యాడెట్లకు జ్ఞాపికలను అందజేశారు. గీతం ఎన్ సీసీలో భాగంగా, క్యాడెట్ల ఐక్యత, గర్వాన్ని ప్రతిబింబించే గ్రూపు ఫోటో సెషన్‌తో కార్యక్రమం ముగిసింది.

## మత్తు పానీయాలను వదలండి

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



**హయత్‌నగర్, నవంబర్ 24 (జనం సాక్షి) :** హయత్‌నగర్‌లోని కుంట్లూర్ రోడ్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన పెద్దఅంబర్ పేట్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, అధికారులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ నేడు యువత మత్తు పానీయాలకు అలవాటు పడి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నరని వారిపై ఉక్కు పాదాన్ని మోపాలని వారు అన్నారు. మత్తు పానియాల వలన యువకులు తమ జీవితాలను సర్వ నాశనం చేసుకుంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మత్తు పానీయాల అలవాటును వదులుకొని జీవితాలు చక్కదిద్దుకోండి అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ జాయింట్ కమిషనర్ దశరథ, సూపరెండెంట్ ఉజ్వలారెడ్డి, ఎక్సైజ్ సిబ్బంది, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, వైస్ ఛైర్మన్ భాస్కర చారి, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## రక్షణతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలి




**ఖైరతాబాద్, నవంబర్ 24 (జనం సాక్షి) :** ఇండియన్ డిఫెన్స్ ఎస్టేట్స్ సర్వీస్ ఒక సివిల్ సర్వీ సెస్ ఉద్యోగమని, భారత రక్షణ మంత్రిత్వ శాఖ ఆ ధ్వర్యంలో పనిచేసే మీరందరూ ఈ దేశంలో గుర్తిం చిన రక్షణ భూములని కాపాడటం, కంటోన్మెంట్ ప్రాంతాల్లోని ప్రజల మౌలిక సదుపాయాలు, ఆరో గ్య సేవలు, విద్యారంగం అభివృద్ధితో పాటుగా ట్రా ఫిక్ మేనేజిమెంట్, పర్యావరణ రక్షణ కోసం కూడా పనిచేయాల్సి ఉంటుందని మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీసెస్ రీసెర్చ్ డెవలప్మెంట్ చీఫ్ ఇంజనీర్ రాజీవ్ లోచన్ అన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో సివిల్ ట్రాన్స్ పోర్టేషన్ ఇంజనీరింగ్, ఎన్విరాన్మెంట్ మేనేజ్మెంట్ డివిజన్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన మిలిటరీ ఇంజనీరిం గ్ సర్వీసెస్ లో నూతనంగా ఎంపికైన గ్రూప్-1 ప్రొ బేషనరీ ఆఫీసర్స్ కు 20 రోజుల ఇండక్షన్ ట్రైనింగ్ సోమవారం ప్రారంభమయింది. కాలేజ్ చీఫ్ ఎస్ .లక్ష్మి కాంత రావు, డా.పి.రాజారావు, జి.నాగ మల్లే శ్వర రావు, సి.హేన్ తిలక్, ఎం.సునీత, ఎం.ఎస్. వి.ఎస్.ప్రకాష్ పర్యవేక్షించిన ఈ కార్యక్రమంలో మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్ పోర్ట్ హై వేస్, ఢిల్లీ ప్రిన్సి పల్ ప్రయివేట్ సెక్రటరీ షీలా యాదవ్, ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డా.జి.రామేశ్వర్ రావు, క్వాలిటీ అండ్ ప్రొడక్టివిటీ డివిజన్ హెడ్ డా.యు.ఎస్, జ్యోతి రూట్ కాజ్ ఎనాలిసిస్, డిజైన్ అండ్ ప్రొటోటైప్ సెంటర్ హెడ్ డా.ఎన్.వి.వి.ఎస్ సాగర్, ఇంజనీరింగ్ డిజైన్ ఆప్టిమైజేషన్, సివిల్ ట్రాన్స్ పోర్ట్ హెడ్ డా.ఆర్.వెంకట రెడ్డి మోనిటరింగ్ అండ్ ఎన్ ఫోర్సుమెంట్, ఎన్విరాన్మెంట్ మేనేజిమెంట్ డివిజన్ హెడ్ అనితా అగర్వాల్ సర్కులర్ ఎకానమీ శానిటేషన్, ప్రొ.డి.వెంకట రెడ్డి పాల్గొని మాట్లాడారు.

## మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల అందజేత
- మహిళా సంఘాలకు యూనిఫామ్ చీరల పంపిణీ
- పాల్గొన్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి



**ఊరుకొండ, నవంబర్ 24 (జనం సాక్షి) :** మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని జడ్చర్ల ఎమ్మెల్యే జనం పల్లి అనిరుద్ రెడ్డి అన్నారు. సోమవారం రోజు ఉర్కొండ మండలంలోని రైతు వేదికలలో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబరాలు సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల మహిళలకు అందజేస్తున్న యూనిఫామ్ చీరల పంపిణీ కార్యక్రమంలో జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సంఘాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుదని వివరించారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.మండల పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు 25 కళ్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.ఈ పథకాలు ఎంతో మంది కుటుంబాల ఆర్థికభారం తగ్గించడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తాజా మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల నాయకులు,అధికారులు మరియు పెద్ద సంఖ్యలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం కృషి



**హయత్‌నగర్, నవంబర్ 24 (జనం సాక్షి) :** అబ్దుల్లాపూర్‌మెట్‌లోని వైఎస్ఆర్ పంక్షన్ హాల్‌లో బాటసింగారం రైతు సేవ సహకార సంఘం సర్వసభ్య సమావేశానికి చైర్మన్ కొత్తపల్లి జైపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ రైతులు తమ రుణాలను సకాలం లో చెల్లించి మళ్లీ రుణాలు పొందాలని వారు సూచించారు. రైతు భరోసా ఇస్తూనే, రైతులకు ఏక కాలంలో రుణ మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి మాత్రమే దక్కుతుందని వారు అన్నారు. పెద్ద మొత్తంలో రుణాలు తీసుకున్నవారి నుంచి రుణాలు వసూలు చేయాలని, పేద మధ్యతరగతి వాళ్ళని ఇబ్బంది పెట్టవద్దని వారు అధికారులను కోరారు. రైతులకు నేను అండగా ఉంటానని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర చారి, సింగిల్ విండో డైరక్టర్లు, వివిధ గ్రామాల మాజీ ప్రజా ప్రతినిధులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగా మంజూరైన ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లు ప్రారంభం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 24 (జనం సాక్షి) :** డ్రగ్స్ రహిత తెలంగాణను సాధించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి తెలిపారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ఉప్పల్, నాచారం, ఘట్‌కేసర్ ప్రాంతాల్లో ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన కాప్రా ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి, ఎక్సైజ్ ఈఎస్ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఛీఫ్ విప్ మాట్లాడుతూ ఎక్సైజ్ శాఖను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మొత్తం 14 కొత్త పోలీస్ స్టేషన్లను మంజూరు చేసిందని తెలిపారు. అబ్కారీ వ్యవస్థను మరింత శక్తివంతం చేయడానికి కొత్త ఎక్సైజ్ స్టేషన్లకు అవసరమైన స్థలాలను కల్పించి, నూతన భవనాల నిర్మాణం కోసం సీఎం రేవంత్ రెడ్డికి నివేదిస్తామని స్పష్టం చేశారు. గంజాయి, డ్రగ్స్ ముఠాలను సమూలంగా నిర్మూలించేందుకు ఎక్సైజ్ శాఖ పనితీరును పటిష్ఠం చేయడం అత్యవసరమని అన్నారు. మద్యం అక్రమ రవాణా, కల్తీ నివారణ కోసం ప్రభుత్వం అన్ని విధాల చర్యలు చేపడుతోందని తెలిపారు. డ్రగ్స్ నిర్మూలన కోసం ఎక్సైజ్ శాఖ నిరంతరం కఠిన చర్యలు తీసుకోవాలని, కొత్తగా మంజూరైన అబ్కారీ స్టేషన్ల భవనాల నిర్మాణానికి అవసరమైన నిధుల కోసం సీఎం కార్యాలయంతో సంప్రదించి అనుమతులు తీసుకొస్తామని పేర్కొన్నారు. యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు



నిర్వహించి వారిని చైతన్యవంతులను చేయాల్సిన అవసరం ఉందని డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
25 నవంబర్ 2025

# మాదాసి కురువలకు ఎస్సీ కుల పత్రాలు ఇవ్వాలి

- **మాదాసి కురువ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.విజయ్‌కుమార్**




**నారాయణపేట, నవంబర్ 24 (జనం సాక్షి) :** జిల్లా కేంద్రంలో మాదాసి కురువ ఎస్సి సంఘం చలో కలెక్టరేట్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సోమవారం అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ విజయ్ కుమార్ పూలమాల వేస్తూ అక్కడి నుంచి ర్యాలీగా చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించి మాదాసి కురువలకు ఎస్సీ కుల ధ్రువపత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ర్యాలీగా కలెక్టరేట్ కి వెళ్లి, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ కు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ మదాసి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించి, స్పష్టమైన సర్కార్ గెజిట్ ఎస్సీకమిషన్ మెమో కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికి మదాసి కురువ మదారి కురువలకు ఎస్సీ కులపత్రాలు జారీ చేయకుండా రెవెన్యూ అధికారులు రాజ్యాంగ విరుద్ధంగా అమానవీయంగా వ్యవహరిస్తున్నారని, మాదాసి కురువ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ విజయ్ కుమార్ అన్నారు. మదాసి కురువ మదారి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం విజ్ఞప్తిచేస్తూ రెవెన్యూ అధికారులు ఇకనైనా ముఖ్యమంత్రికి మదాసి కురువ మదారి కురువలకు ఎస్సీ కులపత్రాలు తక్షణం జారీ చేయాలని కోరుతున్నారు. అలాగే కులపత్రాల జారీని కోనసాగించకపోతే మదాసి కురువ మదారి కురువ సంఘం ఉద్యమం మరింత ఉధృతం చేస్తుందని హెచ్చరించారు. లేనిపక్షంలో ఈ నిర్లక్ష్యం వలన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి మచ్చ తెచ్చే ప్రమాదం రెవెన్యూ అధికారుల పెనే మిగులుతుందని సంఘం స్పష్టం చేసింది మదాసి కురువ మదారి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో కొల్లాపూర్ సభలో రెవెన్యూ అధికారులు కలెక్టర్లు సభా వేదిక పైనే ఉన్న సమయంలో మదాసి కురువలు మదారి కురువలు విద్యలో జీవితంలో అత్యున్నత స్థాయికి ఎదగాలి అని తమ ఆకంక్షను వ్యక్తం చేసిన విషయం అందరికి తెల్సిందే అయితే ముఖ్యమంత్రి ఈ ఆశయానికి విరుద్ధంగా రెవెన్యూ అధికారులు మౌనం ప్రదర్శించడంఆందోళనకర విషయం ఆయన అన్నారు. స్పష్టమైన సర్కార్ గెజిట్ ఎస్సీ కమిషన్ మెమో కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ ప్రభుత్వం అధికారులు ఇలాగే నిర్లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్త ఉద్యమ పోరాటానికి సిద్ధంగా ఉన్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ,మదాసి కురువ సంఘాలు జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటన్న కర్యదర్శి గడ్డం తిప్పణ్ణ గౌరవ అధ్యక్షులు బంగి బస్వరాజు నారాయణ పెట నియోజకవర్గం అధ్యక్షులు సింగారం కె. హన్మంతు జి అంజప్ప ఉప్పధ్యక్షులు మాలె నర్సింహ గౌరవ అధ్యక్షులు వెంకటప్ప ప్రధాన కార్యదర్శి సిందు అమ్మ కోళ్ళ నర్సిమ్మా మడల అధ్యక్షులు భైయిరం కోంద వెంకటప్ప గ్రామ అధ్యక్షులు పోర్ల లింగప్ప రమేష్ అది రెడ్డి మలెష్ కురువ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- **ప్రజావాణిలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్**



**సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 24 (జనం సాక్షి) :** ప్రజావాణిలో సమస్యలను తెలుసుకొని త్వరగా పరిశీలించేందుకు కృషి చేస్తామని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి (గ్రీవెన్స్ డే) కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను ఓపికగా విని, సమస్యలు తలెత్తడానికి గల కారణాలపై సంబంధిత ఎస్‌హెచ్‌ఓ లతో ప్రత్యక్షంగా ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి కేసును పారదర్శకంగా దర్యాప్తు చేస్తూ.. బాధితులకు బాసటగా నిలవాలని ఎస్.హెచ్.ఓ లకు సూచనలు చేశారు. జిల్లా ప్రజలు తమ సమస్యలకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో పరిష్కారం దొరకనప్పుడు, మూడవ వ్యక్తి ప్రమేయం లేకుండా, ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా నేరుగా జిల్లా పోలీసు కార్యాలయ సేవలను వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా వచ్చిన ప్రతి ఫిర్యాదు పురోగతిని నిరంతరం సమీక్షిస్తూ, ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- **జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్..**



**సంగారెడ్డి టౌన్, నవంబర్ 24 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్ ఆదేశానుసారం సోమవారం ఉదయం సంగారెడ్డి టౌన్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ రెడ్డి, సిబ్బందితో కలిసి హెల్మెట్ డ్రైవ్ నిర్వహించరు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించకుండా విధులకు హాజరవుతున్న పోలీసు సిబ్బందికి, ఫైన్ విధించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. ముందుగా ట్రాఫిక్ నిబంధనలు పోలీసులుగా మనం పాటించి, ఇతరులకు చెప్పాలని అన్నారు. ఇటీవలి కాలంలో అనేక మంది పోలీసులు హెల్మెట్ ధరించక రోడ్డు ప్రమాదాలకు గురైన ఘటనలు చోటుచేసుకున్నాయని గుర్తుచేశారు. ఒక చిన్న తప్పిదం కుటుంబాన్ని రోడ్డున పడేసే పరిస్థితి తెస్తుంది. హెల్మెట్ తలకు మాత్రమే కాదు, మొత్తం కుటుంబానికే రక్షణ ఇస్తుందని అన్నారు. కావున విధిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సిబ్బందికి సూచనలు చేశారు. జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. వాహనాదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి, హెల్మెట్, సీట్ బ్లెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలను నడపరాదని అన్నారు. అతివేగం అతివేగం ఆనందాన్నివ్వొచ్చు కానీ, అదే వేగంతో ప్రమాదానికి దారి తీయవచ్చు అన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టునడితే సంబంధిత వాహన యజమానులు తల్లిదండ్రులపై చట్టరిత్య చర్యలు అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ట్రాఫిక్ సిఐ రామకృష్ణారెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐలు సాయిలు, రాములు, సిబ్బంది పాల్గొన్నారు.

# కొల్చారం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

**మెదక్, నవంబర్ 24 (జనం సాక్షి) :** గ్రామాల్లో సైబర్ క్రైమ్, డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు పోలీస్ సిబ్బందికి సూచించారు. జిల్లాలోని కొల్చారం పోలీస్ స్టేషన్ను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఎస్పీ ఆవరణ పరిశుభ్రతపై సూచనలు చేశారు. అనంతరం స్టేషన్ రికార్డులను పరిశీలిస్తూ అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ, ఎలాంటి పెండెన్సీ లేకుండా చూడాలని, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తును చేపట్టి త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీసీ కెమెరాల పనితీరు గురించి కూడా ఎస్‌హెచ్‌ఓ నుండి వివరాలు తెలుసుకున్నారు. ప్రతిరోజూ సాయంత్రం వాహనాల తనిఖీలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ, ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించే వారిపై కఠిన



చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బందితో మాట్లాడుతూ విధి నిర్వాహణలో అంకితభావంతో పని చేయాలని, ఎవరికైతే ఏ విధులు కేటాయించబడతాయో వాటిని సమయానికి పూర్తి చేయాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖ పరమైన చర్యలు ఉంటాయి అని హెచ్చరించారు. సిబ్బంది యొక్క పిల్లల చదువులను అడిగి తెలుసుకున్నారు. విధుల పరంగా ఎలాంటి సమస్య ఉన్నా తాను అందుబాటులో ఉంటానని తెలిపారు. రానున్న ఎన్నికల సమయంలో పూర్తిస్థాయి సంసిద్ధతతో ఉండాలని, మండలాలు మరియు గ్రామాలను సందర్శిస్తూ విపిఓ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. గ్రామాల్లో జరిగే అసాంఘిక కార్యకలాపాలు, సామాజిక విఘాతం కలిగించే అంశాలపై సమగ్ర సమాచారం రాబట్టేందుకు పటిష్టమైన సమాచార వ్యవస్థను నిర్మించుకోవాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో ప్రజలకు గంజాయి, ఇతర మాదకద్రవ్యాలు, సైబర్ క్రైమ్, చైల్డ్ మ్యారేజ్, వుమెన్ హరాస్మెంట్ వంటి సమస్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను చైతన్యపరచాలని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ జర్జ్, కొల్చారం ఎసై అహ్మద్ మోహినొద్దీన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకం



**మెదక్ జిల్లా బ్యూరో, నవంబర్ 24 (జనం సాక్షి) :** ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారులు,రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకమైనదని, అధికారులు సమన్వయంగా పని చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సర్పంచ్ ఎన్నికల కి సంబందించి, రిటర్నింగ్ అధికారులు,అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకి ఎన్నికల విధులు, బాధ్యత లు, నియమ నిబంధనల పైన శిక్షణ కార్యక్రమంను జిల్లా కలెక్టర్ అదన కలెక్టర్ రెవిన్యూ నగేష్, జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి తో కలిసి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించిన నియమ నిబంధనలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల విధులను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. అధికారులు తమకు ఇచ్చిన హ్యాండ్‌బుక్‌ను క్షుణ్ణంగా చదివి ప్రతీ అంశంపై అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రతి బాధ్యత,రిటర్నింగ్ అధికారిదేనని, బాధ్యతగా విధులు నిర్వహిస్తూ పోలింగ్ కేంద్రాల గుర్తింపు, పోలింగ్ సిబ్బంది నియామకం, వారికి పోలింగ్ కు సంబంధించిన సామాగ్రి సమకూర్చడం మొదలగు ప్రతి అంశాలను క్షుణ్ణం గా పర్యవేక్షించాల్సి ఉంటుందన్నారు. అధికారులు బ్యాలెట్ బాక్స్ ల గురించి, నామినేషన్ ప్రక్రియ గురించి, పోలింగ్ నిర్వహణపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు.


## డ్వాక్రా గ్రూప్ మహిళా సంఘాల సభ్యులకు చీరల పంపిణీ



**న్యాల్‌కల్, నవంబర్ 24 (జనం సాక్షి) :** ప్రజా పాలన, ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మండలంలోని డ్వాక్రా గ్రూపు మహిళా సభ్యులకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సోమవారం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో.. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ఎంపీడీఓ షగుప్త ఇఫత్, తహసిల్దార్ ప్రభు, ఆర్ఐ శ్యామ్ రావు, ఐకేపీ ఏపిఎం ధనరాజ్ గిరి, మహిళా మండల సమాఖ్య అధ్యక్షురాలు స్వరూప పర్యవేక్షణలో చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలోని మహిళా సంఘాల సభ్యులు, తెల్ల రేషన్ కార్డు కలిగిన (ప్రతి ఇంటిలో ఒకరికి) లబ్ధి దారులకు పంపిణీ చేసేందుకు 9984 చీరలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. ఈ మేరకు మండలంలోని 810 మహిళ సంఘాలకు గాను 8682 డ్వాక్రా గ్రూపు మహిళా సభ్యులకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు ఎంపీడీఓ, ఏపిఎంలు తెలిపారు. గ్రామాల వారిగా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లను సిద్ధం చేశారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా.. అధికారులు, అధికార పార్టీ ముఖ్య నాయకులు, డ్వాక్రా మహిళా సంఘాల ప్రతినిధులు, ఐకెపి సిబ్బంది, తదితరులు.. మండలంలో బాల్య వివాహాలను అరికడతామని,14 సంవత్సరంలోపున్న బాల, బాలికలు బడిలో ఉండేలా చొరవ చూపుతామని, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్ రెడ్డి, జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి రెడ్డి, సహకార సంఘం చైర్మన్ సిద్ధి లింగయ్య స్వామి, స్వామిదాస్, శ్రీనివాస్ రెడ్డి, సీసీలు, డ్వాక్రా మహిళ సంఘాల శ్రేణులు, తదితరులు హాజరయ్యారు.

## గంజాయి తరలిస్తున్న వ్యక్తులు అరెస్ట్

- **115 గ్రాముల గంజాయి, స్కూటీ, 2 సెల్‌ఫోన్‌లు స్వాధీన**
- **మునిపల్లి ఎస్సై రాజేష్ నాయక్**



**మునిపల్లి, నవంబర్ 24 (జనం సాక్షి) :** ఎండు గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు మునిపల్లి ఎస్సై రాజేష్ నాయక్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం... సోమవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో బీదర్ వైపు నుండి హైదరాబాద్ వైపు వెళ్తున్న యాక్టీవ్ స్కూటీ నంబర్ టీఎస్ 07 హెచ్‌సి 4630 వాహనంపై ఇద్దరు వ్యక్తులు ఎండు గంజాయిని రవాణా చేస్తున్నానే పక్కా సమాచారంతో మునిపల్లి మండలంలోని జాతీయ రహదారి కంకోల్ టోల్ ప్లాజా వద్ద తనిఖీ నిర్వహించడం జరిగిందన్నారు. వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో వెహికల్ చెకింగ్ చేస్తుండగా అనుమానాస్పదంగా వెళు న్నాం యాక్టీవ స్కూటీ ని పోలీసులు ఆపి తనిఖీ చేయగా అందులో 115 గ్రాముల ఎండు గంజాయి దొరికినట్లు తెలిపారు. వారిని విచారించగా కర్ణాటక బీదర్‌లోని ఇట్టి గాంజా ను బీదర్ లోని ఇరానీ గల్లిలో గుర్తు తెలియని వ్యక్తుల వద్ద తక్కువ ధరల కొనుగోలు చేసి, ఇతరులకు ఎక్కువ ధరలకు అమ్ముతున్నట్లు తెలిపారని ఎస్సై వివరించారు. అమ్మడేమే కాకుండా తాము కూడా గంజాయి సేవిస్తామని ఒప్పుకున్నట్లు తెలిపారు. మరియు మేము కూడా తాగుతాము అని తెలిపినారు. పట్టుబడిన వారిలో ఎ1 హైదరాబాదులోని చింతల్ వాజేబేనగర్ కు చెందిన విద్యార్థి దేవరకొండ, ఎ 2 హైదరాబాదులోని చింతల్ ద్వారకా నగర్ చెందిన పల్లి సాయి పవన్ లను అరెస్టు చేసి వారి వద్ద నుండి 115 గ్రాముల గంజాయి, స్కూటీ, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ నాయక్ తెలిపారు. ఎస్సై వెంట కానిస్టేబుల్ హనీఫ్ , సంతోష్, డ్రైవర్ అహ్మద్ పాషా ఉన్నారు.

## ప్రయాణికులకు బెంచీలు ఏర్పాటు

- **శిరసనగండ్ల, అయోధ్య నగర్ బెంచీలు ఏర్పాటు**
- **బిజెపి నాయకులు ఇర్లపల్లి పెద్దిరాజు**
- **బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు చిలమోని కృష్ణ**

**చారకొండ, నవంబర్ 24 (జనంసాక్షి) :** మండల పరిధిలోని సిరసనగండ్ల గ్రామపంచాయతీ మరియు అయోధ్య నగర్ గుట్ట బస్టాండ్ దగ్గర సోమవారం ప్రయాణికులు కూర్చునేందుకు 20 బెంచీలు వేయించిన సిరసనగండ్ల గ్రామానికి చెందిన బీజేపీ గ్రామ ఉపాధ్యక్షుడు ఈర్లపల్లి పెద్దిరాజు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ...శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం వచ్చే భక్తులకు బస్టాండ్ సమీపంలో కూర్చోవడానికి బెంచీలు లేక నిలుచుని బస్సు కొరకు ఎదురుచూస్తున్న తరుణంలో ప్రయాణికులకు ఇబ్బందిగా కలవకుండా తన వంతు



సహాయంగా బెంచీలను ఏర్పాటు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ చారకొండ మండల అధ్యక్షులు చెలమోని కృష్ణ, మండల ఉపాధ్యక్షులు కామోజీ శ్రీకాంత్, గ్రామ అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, చంద్రారెడ్డి, నరేష్ యాదవ్, శ్రీను యాదవ్, శరత్, మోహన్, అంజి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



**జడ్చర్ల, నవంబర్ 24 (జనంసాక్షి) :** మహిళల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని, మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి అన్నారు. సోమవారం జడ్చర్ల ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు యూనిఫామ్ చీరలు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు 112 మందికి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, ఇందిరా గాంధీ జయంతి పురస్కరించుకొని ప్రభుత్వం డ్వాక్రా సంఘాల మహిళలకు చీరలు పంపిణీ చేస్తుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, మహిళలకు ప్రభుత్వం ఆర్థిక, వ్యాపార రంగాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత, మార్కెట్ చైర్ పర్సన్ జ్యోతి రెడ్డి, నాయకులు వెంకటయ్య, నిత్యానందం, మీనాజుద్దీన్, వెంకటేశం, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# మాదాసి కురువలకు ఎస్సీ కుల పత్రాలు ఇవ్వాలి


**నారాయణపేట, నవంబర్ 24 (జనం సాక్షి) :** జిల్లా కేంద్రంలో మాదాసి కురువ ఎస్సి సంఘం చలో కలెక్టరేట్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సోమవారం అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ విజయ్ కుమార్ పూలమాల వేస్తూ అక్కడి నుంచి ర్యాలీగా చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించి మాదాసి కురువలకు ఎస్సీ కుల ధ్రువపత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ర్యాలీగా కలెక్టరేట్ కి వెళ్లి, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ కు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ మదాసి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించి, స్పష్టమైన సర్కార్ గెజిట్ ఎస్సీకమిషన్ మెమో కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికి మదాసి కురువ మదారి కురువలకు ఎస్సీ కులపత్రాలు జారీ చేయకుండా రెవెన్యూ అధికారులు రాజ్యాంగ విరుద్ధంగా అమానవీయంగా వ్యవహరిస్తున్నారని, మాదాసి కురువ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ విజయ్ కుమార్ అన్నారు. మదాసి కురువ మదారి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం విజ్ఞప్తిచేస్తూ రెవెన్యూ అధికారులు ఇకనైనా ముఖ్యమంత్రికి మదాసి కురువ మదారి కురువలకు ఎస్సీ కులపత్రాలు తక్షణం జారీ చేయాలని కోరుతున్నారు. అలాగే కులపత్రాల జారీని కోనసాగించకపోతే మదాసి కురువ మదారి కురువ సంఘం ఉద్యమం మరింత ఉధృతం చేస్తుందని హెచ్చరించారు. లేనిపక్షంలో ఈ నిర్లక్ష్యం వలన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి మచ్చ తెచ్చే ప్రమాదం రెవెన్యూ అధికారుల పెనే మిగులుతుందని సంఘం స్పష్టం చేసింది మదాసి కురువ మదారి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో కొల్లాపూర్ సభలో రెవెన్యూ అధికారులు కలెక్టర్లు సభా వేదిక పైనే ఉన్న సమయంలో మదాసి కురువలు మదారి కురువలు విద్యలో జీవితంలో అత్యున్నత స్థాయికి ఎదగాలి అని తమ ఆకంక్షను వ్యక్తం చేసిన విషయం అందరికి తెల్సిందే అయితే ముఖ్యమంత్రి ఈ ఆశయానికి విరుద్ధంగా రెవెన్యూ అధికారులు మౌనం ప్రదర్శించడంఆందోళనకర విషయం ఆయన అన్నారు. స్పష్టమైన సర్కార్ గెజిట్ ఎస్సీ కమిషన్ మెమో కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ ప్రభుత్వం అధికారులు ఇలాగే నిర్లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్త ఉద్యమ పోరాటానికి సిద్ధంగా ఉన్నామని వారు తెలిపారు. ఈ




కార్యక్రమంలో ,మదాసి కురువ సంఘాలు జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటన్న కర్యదర్శి గడ్డం తిప్పణ్ణ గౌరవ అధ్యక్షులు బంగి బస్వరాజు నారాయణ పెట నియోజకవర్గం అధ్యక్షులు సింగారం కె హన్మంతు జి అంజప్ప ఉప్పధ్యక్షులు మాలె నర్సింహ గౌరవ అధ్యక్షులు వెంకటప్ప ప్రధాన కార్యదర్శి సిందు అమ్మ కోళ్ళ నర్సిమ్మా మడల అధ్యక్షులు భైయిరం కోంద వెంకటప్ప గ్రామ అధ్యక్షులు పోర్ల లింగప్ప రమేష్ అది రెడ్డి మలెష్ కురువ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ చీరల పంపిణీతో మహిళల ఆత్మగౌరవం ఇనుమడింపు

- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం
- జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు



**బోథ్, నవంబర్ 24(జనంసాక్షి) :** మహిళల ఆత్మగౌరవాన్ని ఇనుమడింపజేసేలా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తుందని,రాష్ట్ర పర్యాటక టూరిజం, ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం బోథ్ మండల కేంద్రంలోని స్థానిక పరిచయ గార్డెన్ లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముందుగా మంత్రి జూపల్లి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఎంపీ నాగేష్ తో జ్యోతి ప్రజ్వలన చేసి చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి తమ ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలని సంకల్పంతో అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందని గుర్తు చేశారు. ఇలాంటి విమర్శలకు ఆస్కారం లేకుండా తప్పిదాలకు లోటుపాట్లకు తావు లేకుండా అర్హులైన ప్రతి మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ అయ్యేలా పారదర్శకంగా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. కుటుంబ అభ్యున్నతిలో మహిళలలే కీలకమని భవిష్యత్ తరాల బాగుకోసం పిల్లలను చక్కగా చదివించాలని హితువు పలికారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వైపు పిల్లలు పెడదారి పట్టకుండా కాపాడుకోవాలని నిపుణులైన ఉపాధ్యాయులు మెరుగుపడిన సదుపాయాలతో కూడిన ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చదివించాలని సూచించారు.200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఉచిత ఆర్టీసీ ప్రయాణం,500 కు గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు,సన్న బియ్యం పంపిణీ ఇప్పటికే అమల్లో ఉన్నాయన్నారు. అలాగే వడ్డీ లేని రుణాలు, పెట్రోల్ బంకుల యజమాన్యం, సోలార్ ప్లాంట్, ఆర్టీసీ బస్సుల యజమాన్యం వంటి అవకాశాలు కల్పిస్తామన్నారు.రాష్ట్రంలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి 22 వేల కోట్లు కేటాయించామని ప్రతి నియోజకవర్గంలో 3500 నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి అన్నారు.అలాగే వివిధ లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు,ఎస్ఎచ్జీ రుణాలు అందజేశారు.

**రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు కృషి చేయండి: ఎమ్మెల్యే అనిల్ జాదవ్**

నియోజకవర్గ కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్ గా ఏర్పాటు చేయాలని అలాగే ఫైర్ స్టేషన్, డిగ్రీ కళాశాల,ఇచ్చోడలో డి.ఎస్.పి కార్యాలయం అలాగే రోడ్లకు సంబంధించిన ఫారెస్ట్ క్లియరెన్స్ కు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ జి. నాగేశ్, డీసీసీబీ చైర్మన్ బోజరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారెడ్డి, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఐటిడిఏ పీఓ యువరాజ్ మర్మాట్, ఆర్డీవో స్రవంతి, డీఆర్డీఓ రవీందర్, ఆయా మండలాల తహాశీల్దార్లు, ఇతర అధికారులు, మహిళా సంఘాలు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- మెడికల్ క్యాంపును గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలి
- గ్రామాల అభివృద్ధికి ఐక్యత అవసరం
- 175 మహిళాలకు ఉచిత శిక్షణ ధృవీకరణ పత్రం, ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ
- రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క



**ములుగు ప్రతినిధి, నవంబర్ 24(జనంసాక్షి) :** మహిళల ఆర్థిక అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, గ్రామాల అభివృద్ధికి ఐక్యత అవసరమని, పాఠశాలల విద్యార్థులకు ఏకరూప దుస్తులను కుట్టడంతో మహిళా సంఘాల సభ్యులకు ఆర్థిక బలం చేకూరుతుందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. సోమవారం ములుగు మండలం లోని జగ్గన్న పేట గ్రామం లో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి లతో కలసి సిఎస్ఆర్ నిధులతో రాంకీ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ వారి ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన సామాజిక నీటి శుద్ధి కేంద్రంను, ఉచిత వైద్య శిబిరంను ప్రారంభం, కోటక్ మహేంద్ర వారి సహకారం తో 175 మందికి ఉచిత శిక్షణ ధృవీకరణ పత్రం, ఉచిత కుట్టుమిషనులు, ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కురేందుల శంకర్, 8 మంది ఇతరులకు 9 యూనిట్లు పాడి గేదెలను (ఒక లక్ష నలుబై వేల రూపాయల సబ్సిడీ తో), ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. అనంతరం జంగాలపల్లి గ్రామం లో 20 కోట్ల నిధులతో జంగాలపల్లి నుండి గాంధీనగర్ రహదారి కి టి 0/0 నుండి 17/0, 19/5-24/030 వరకు రోడ్డు అభివృద్ధి పనులకు రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి లతో కలసి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భాల్లో మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రతి గ్రామం అభివృద్ధి లో దూసుకుపోవాలంటే గ్రామ ప్రజలలో ఐక్యతగా ఉండాలని, గ్రామాలు అభివృద్ధి సాధిస్తేనే దేశం ప్రగతి రథంలో ముందంజలో ఉంటుందని రాష్ట్ర అభివృద్ధిలో ప్రజలందరూ స్వచ్ఛందంగా భాగస్వామ్యం కావాలని కోరారు. జగ్గన్నపేట గ్రామంలోని ప్రజలకు శుద్ధమైన త్రాగునీరు అందించాలని సదుద్దేశంతో రాంకీ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ వారి ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన సామాజిక నీటి శుద్ధి కేంద్రంను ప్రారంభించడం జరిగిందని, మెడికల్ క్యాంప్ ను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ములుగు ప్రాంత అభివృద్ధిపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. 20 కోట్ల రూపాయల నిధులతో జంగాలపల్లి నుండి గాంధీనగర్ వరకు రోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని అన్నారు. జంగాలపల్లి జంక్షన్ ను 30 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేయడం జరుగుతుందని, 150 కోట్ల రూపాయలతో టూరిజం విలేజ్ ను, ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ , నర్సింగ్ కాలేజ్ కూడా ఏర్పాటు చేస్తున్నామని, ఈ ప్రాంతం రాబోయే రోజుల్లో మరింతగా అభివృద్ధి చెందుతుందని దీని ద్వారా వ్యాపార ఉపాధి రంగంగా ఎంతో ఉపయోగపడుతుందని దీనికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడి తుల రవి, ఏపిఎం శ్రీనివాస్, రాంకీ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, కోటక్ మహేంద్ర ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి ,నవంబర్ 24, (జనంసాక్షి) :** జిల్లా కేంద్రంలో చేపట్టిన ఇందిరా మహిళా శక్తి భవన్, ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాల ప్రాంతంలో చేపట్టిన ఇందిరా మహిళా శక్తి భవన్ నిర్మాణ పనులను సందర్శించి నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వం మహిళల అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి భవనం నిర్మాణాన్ని చేపట్టిందని తెలిపారు. అనంతరం కాలేజ్ రోడ్డులో కొనసాగుతున్న ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం వైద్యరంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సాధించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో జిల్లా కేంద్రంలో చేపట్టిన ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు, గుత్తేదారుల సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.

# గ్రామాలాభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి

- కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధికి మహర్దశ
- గుడెప్పాడ్ గ్రామంలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి



**ఆత్మకూరు, నవంబర్ 24 (జనం సాక్షి):** సోమవారం ఆత్మకూరు మండలం గుడెప్పాడ్ గ్రామంలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ప్రతి గ్రామానికి నాణ్యతమైన సిసి రోడ్, సైడ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని అన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలోనే గ్రామాలకు నిజమైన అభివృద్ధి మహర్దశను చేరుకుంటుందని అన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉందని, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని అన్నారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలకులు అభివృద్ధి పేరుతో దోచుకున్నారని,ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని అన్నారు. మహిళల ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా పరకాల డైరీ ని ఏర్పాటు చేయబోతున్నామన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ చీరల పంపిణీ,200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు బీమా, సన్న వడ్లకు రూ 500 బోనస్, మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ, వడ్డీ లేని రుణాలు, శ్రీనిధి రుణాలు, ఇందిరమ్మ ఇల్లు, సీఎంఆర్ఎఫ్ ,కళ్యాణ లక్ష్మి, తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ బీరం సునంద- సుధాకర్ రెడ్డి, మండల అధ్యక్షులు కమలాపురం రమేష్, ఆత్మకూరు మాజీ పిఏసిఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్, ఆత్మకూరు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, జిల్లా నాయకులు మార్కా రజనీకర్ గౌడ్, కక్కెర్ల రాజు గౌడ్, ముద్దం సాంబయ్య, పరికరాల వాసు, అలువాల రవి, బాబు మియా, అర్షం పరుమయ్య తదితరులు పాల్గొన్నారు.

# సెంట్రల్ జోన్ నూతన డీసీపీగా బాధ్యతలు చేపట్టిన దారా కవిత



**వరంగల్ ఈస్ట్, నవంబర్ 24 (జనం సాక్షి) :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ సెంట్రల్ జోన్ నూతన డీసీపీగా దార కవిత కవిత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సెంట్రల్ జోన్ పరిధిలోని అధికారులు సిబ్బంది నూతన డీసీపీగా మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్చాలను అందజేసి అభినందనలు తెలియజేసారు. డీసీపీ కవిత హైదరాబాద్ సైబర్ విభాగం పని చేస్తూ బదిలీపై సెంట్రల్ జోన్ డీసీపీగా నియమించబడ్డారు

## సీసీ కెమెరాలతోనే నేరాల నియంత్రణ

- ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్



**ఆత్మకూర్, నవంబర్ 24 (జనంసాక్షి):** ఆత్మకూరు మండలంలోని కామారం గ్రామ భద్రతను మరింత బలపరచేందుకు ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్ ఆధ్వర్యంలో మూల మధుకర్ గౌడ్, రుద్ర కన్సల్టెంట్స్ సహకారంతో గ్రామంలో మొత్తం 16 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.తన స్వగ్రామాన్ని మరింత సురక్షితంగా మార్చాలనే సంకల్పంతో, గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ఈ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు మూల మధుకర్ గౌడ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎసిపి సతీష్ బాబు, సీఐ సంతోష్ ,ఎస్సై సతీష్ పాల్గొని గ్రామ భద్రత కోసం ముందడుగు వేసిన మధుకర్‌ను గ్రామ ప్రజలతో కలిసి అభినందించారు. గ్రామ అభివృద్ధి,భద్రత కోసం చేసిన ఈ కృషి అందరి ప్రశంసలు అందుకున్నారు.

## నేడు పాలకుర్తికి తీన్మార్ మల్లన్న రాక

**పాలకుర్తి, నవంబర్ 24 (జనంసాక్షి) :** తెలంగాణ రాజ్యధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మంగళవారం పాలకుర్తి మండల కేంద్రంలోని నిర్వహించే జెండావిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. పాలకుర్తిలోని శివం గార్డెన్లో సాయంత్రం 6 గంటలకు జరిగే ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరవుతారని, మండలంలోని వివిధ గ్రామాల నుంచి మల్లన్న అభిమానులు, సానుభూతి పరులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

# లేబర్ కోడ్ల రద్దుకు సంఘటిత పోరాటాలే శరణ్యం

- సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక



**బెల్లంపల్లి, నవంబర్ 24 (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న లేబర్ కోడ్ల రద్దుకు పోరాటాలే శరణ్యమని సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం బెల్లంపల్లి పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కార్మికుల పొట్టకొట్టే లేబర్ కోడ్లను ఎప్పటికి అనుమతించ బోమని వాటి రద్దుకు ఎలాంటి పోరాటాలకైనా సిద్ధమే అని ప్రకటించారు. నాలుగు లేబర్ కోడ్ల రద్దుకు కార్మిక వర్గం సమరశీల సంఘటిత పోరాటాలు చేయాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక చర్యను ఖండిచాలని వారు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ ఠాకూర్ మణి రామ్ సింగ్, నాయకులు ఎండీ చాంద్ పాషా, ఐ కృష్ణ, అంబాల మహేందర్, గొల్ల అంజన్న తదితరులు పాల్గొన్నారు.

# దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్ ఉంచకుండా సత్వర పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి సోమవారం జరిగే ప్రజావాణిలో ప్రజలు రక రకాల సమస్యలపై దరఖాస్తులు ఇస్తున్నారని స్వీకరించిన దరఖాస్తులు పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులకు ఎండార్స్ చేస్తున్నామని తెలిపారు. తదుపరి ప్రజావాణి వరకు జీరో పెండింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ప్రతి సోమవారం ప్రజావాణి అనంతరం సమీక్ష సమావేశం నిర్వహించి, దరఖాస్తుల పరిష్కార స్థితిపై సమీక్షిస్తానని తెలిపారు. అధికారులు ప్రజా సమస్యల పరిష్కారంలో బాధ్యతగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణికి 61 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రవి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# అంతర్రాష్ట్ర సరిహద్దు తనిఖీ కేంద్రం ప్రారంభం

**కాళేశ్వరం, నవంబర్ 25 (జనం సాక్షి) :** భూపాలపల్లి జిల్లాలోని మహదేవ్‌పూర్ మండలం కాళేశ్వరం అంతర్ రాష్ట్ర సరిహద్దు వంతెన వద్ద ఖరీఫ్ ధాన్యం సేకరణను దృష్టిలో ఉంచుకొని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం సరిహద్దు తనిఖీ కేంద్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మేనేజర్ రాములు , సివిల్ సప్లైస్ డిపార్ట్మెంట్ ఆర్ఐలు సురేందర్ రెడ్డి, రఘు, తహశీల్దార్ రామారావు, స్థానిక ఎస్ ఐ తమాషా రెడ్డి, రెవెన్యూ, వ్యవసాయ, పోలీస్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ ప్రారంభించిన ఎమ్మెల్యే నాగరాజు



**హనుమకొండ ప్రతినిధి నవంబర్ 24 (జనంసాక్షి) :**హసన్ పర్తి మండల కేంద్రంలోని టిటిఎస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ ను రిబ్బన్ కట్ వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ప్రారంభించారు.అనంతరం ఎక్సైజ్ స్టేషన్ సీఐ దుర్గాభవానిని కుర్చీలో కూర్చోబెట్టి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. తదనంతరం ఈ స్టేషన్ పరిధిలో వచ్చే ప్రాంతాలను అధికారాలలను అడిగి తెలుసుకుని డ్రగ్స్, గంజాయి, గుడుంబా వంటివి లేకుండా నిర్మూలించాలని ఎక్సైజ్ అధికారులకు సూచన చేశారు అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ హసన్‌పర్తి టౌన్‌లో ఎక్సైజ్ స్టేషన్ ఏర్పాటుకు చేసేందుకు సహకరించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. ప్రజల రక్షణ, శాంతి భద్రతల కోసం ఎక్సైజ్ శాఖ కీలకంగా పనిచేస్తోంది. అక్రమ మద్యం రవాణా, నకిలీ మద్యం తయారీ, గూడ్స్ స్మగ్లింగ్ వంటి చట్టవిరుద్ధ చర్యలను అరికట్టేందుకు ఈ నూతన ఎక్సైజ్ స్టేషన్ మరింత బలంగా సేవలందిస్తుందన్నారు. ప్రజల సహకారం, అధికారుల కృషి ఉంటే మండలాన్ని పూర్తిగా అక్రమాల రహితంగా మార్చడం సాధ్యమవుతుంది. ప్రభుత్వ పథకాలను, చట్టాలను ప్రజలకు చేరవేయడంలో ఎక్సైజ్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రజాభిమానాన్ని చూరగొనాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిలి వెంకట్రాం నరసింహారెడ్డి, ఆత్మకూర్ ఏఎంసి వైస్ చైర్మన్ తంగెళ్ళపల్లి తిరుపతి, ఐనవోలు ఆలయ కమిటీ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, హసన్పర్తి, ఐనవోలు మండలాల పార్టీ అధ్యక్షులు పోరెడ్డి మహేందర్ రెడ్డి, మహేష్ గౌడ్, పాక్స్ చైర్మన్ చల్లా గోపాల్ రెడ్డి, 66వ డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, మండల మహిళ అధ్యక్షురాలు జోరిక పూలక్క, బత్తుల స్వాతి, సీనియర్ నాయకులు కార్యకర్తలు మరియు ఎక్సైజ్ వరంగల్ డివిజన్ డిప్యూటీ కమిషనర్ అంజన్ రావు, ఎక్సైజ్ డిపిఓ వరంగల్ అర్బన్ చంద్రశేఖర్, స్థానిక ఎక్సైజ్ సిఐ దుర్గా భవానీ, ఎస్ఐ వెంకన్న, ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మహిళా అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్

**బెల్లంపల్లి, నవంబర్ 24 (జనంసాక్షి) :** మహిళా అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. సోమవారం బెల్లంపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటిశ్వరులు చేయడమే లక్ష్యంగా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారని అన్నారు. ఆర్థిక సాధికారతలో, అభివృద్ధిలో మహిళలు ముందు వరుసలో ఉండాలని ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళలు కుటుంబానికి పునాదిలాంటి వారని, వారు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా బలంగా ఉండాలన్నారు. మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందని అన్నారు. అన్ని రంగాల్లో మహిళలు భాగస్వాములై ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని అన్నారు. అనంతరం స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా 30 సంఘాలకు 5 కోట్ల రుణాల చెక్కును పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, ఎంపీడీఓ మహేందర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్, ఏపీవో రజియా సుల్తాన, ఏపీఎం విజయలక్ష్మి, స్వయం సహాయక సంఘాల మహిళలు, తాజామాజీ ప్రజాప్రతినిధులు, మహిళలు, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్



**నిర్మల్ బ్యూరో, నవంబర్24 (జనంసాక్షి) :** ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును పరిశీలించి తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కార్మిక శాఖకు సంబంధించిన, కార్మికుల ప్రమాద బీమా పెంపు సమాచార గోడ ప్రతులను కలెక్టర్, అధికారులు ఆవిష్కరించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ ఆర్డీవో రత్నకళ్యాణి, జెడ్పి సీఈవో గోవింద్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, కల్లూరి మల్లేశం డిమాండ్



**భువనగిరి, నవంబర్ 24 (జనం సాక్షి) :** కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి ,కల్లూరి మల్లేశంలు డిమాండ్ చేశారు. భువనగిరి స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యానికి పూర్వం నుండి కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో కార్పొరేట్ యాజమాన్యాలకు మేలు చేసి నాలుగు లేబర్ కోడ్ లను నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకు వచ్చిందని వాటి అమలు కోసం నవంబర్ 21 న నోటిఫికేషన్ విడుదల చేసిందని వెంటనే నోటిఫికేషన్ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నవంబర్ 26 న లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా దేశవ్యాపితంగా జరిగే నిరసన కార్యక్రమంలో కార్మికులు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికుల పని గంటలను 8 నుండి 12 గంటలకు పెంచుతూ యూనియన్లు ఏర్పాటు చేసుకునే హక్కును ,సమ్మె హక్కును ప్రశ్నార్థకం చేస్తూ యాజమాన్యాలకు అనుకూలంగా అనేక అంశాలను లేబర్ కోడ్ లలో పొందుపరిచి లేబర్ కోడ్ లను తీసుకువచ్చారని విమర్శించారు. 300 లోపు కార్మికులు పనిచేసే పరిశ్రమలను యాజమాన్యాలు ఏవిధమైన అనుమతులు లేకుండా నష్టాలు వస్తున్నాయి అనే పేరుతో మూసివేసే అధికారం యాజమాన్యాలకు కట్టబెట్టారని, పరిశ్రమలలో పర్యవేక్షణ చేసే ఫ్యాక్టరీస్ ఇన్స్పెక్టర్ ను తొలగించి వారి స్థానంలో ఫెసిలిటేటర్ ను తీసుకువచ్చారని మరో వైపు పరిశ్రమలలో సంవత్సరాల తరబడి పనిచేసే వారినీ పర్మినెంట్ చేసే విధానం ఎత్తివేశారని వారి స్థానంలో ఫిక్స్ డ్ టర్మ్ ఎంప్లాయ్ నీ తీసుకువచ్చి కార్మికులకు పని భద్ర లేకుండా చేశారని విమర్శించారు.

నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన నుండి నేటికి కార్పొరేట్ అధిపతులకు 16 లక్ష కోట్ల రూపాయలు మాఫీ చేశారని,కార్మికుల కనీస వేతనాల గురించి ఏనాడు పట్టించుకున్న దాఖలాలు లేవని గుర్తుచేశారు. దేశంలో అనేక ప్రభుత్వ రంగ సంస్థలు లక్షలాది మందికి ఉద్యోగ ,ఉపాధి కల్పించి దేశ సంపదను సృష్టించిన ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా తన మిత్రులైన అంబానీ అదానీలకి నరేంద్ర మోడీ ప్రభుత్వం కట్టబెడుతుందని విమర్శించారు. ఇన్సూరెన్స్, టెలికం ,బ్యాంకు రంగాలలో సైతం విస్తృత ప్రవేట్ పెట్టుబడులకు అవకాశం ఇచ్చి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తున్నాడని విమర్శించారు . ప్రభుత్వ రంగ సంస్థలను ఒక వైపు ప్రైవేటుపరం చేస్తూ కార్మికుల మేలుకోసమే లేబర్ కోడ్ లని నమ్మబలుకుతున్నాడని విమర్శించారు. కార్మిక హక్కులను కాపాడడం కోసం లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో కార్మికులు ,ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దాసరి పాండు, కోశాధికారి యండి పాషా, జిల్లా ఉపాధ్యక్షులు దోనూరి నర్సిరెడ్డి, మాయ కృష్ణ,సుబ్బారు సత్యనారాయణ, నకిరేకంటి రాము, జిల్లా సహాయ కార్యదర్శులు గొరిగె సోములు, తుర్కపల్లి సురేందర్,సిలువేరు రమాకుమారి, పైళ్ళ గణపతి రెడ్డి, పొట్ట యాదమ్మ, చెక్క రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాల్సిందే..



**తలకొండపల్లి, నవంబర్ 24 (జనంసాక్షి) :** గత అసెంబ్లీ ఎన్నికల ముందు కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ను అమలు చేయాల్సిందేనని తలకొండపల్లి మండల ఐకాస అధ్యక్షులు గుజ్జారి రాఘవేందర్ అన్నారు.సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో బీసీ ఐకాస ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్ ను అమలు చేయాలని రాస్తారోకో చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్,ను ఇస్తామని చివరికి ఉన్న రిజర్వేషన్ ను తగ్గించిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి,కే దక్కిందని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం జీవో 46ను తీసుకువచ్చి బీసీ,లకు అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారని ద్యుయబట్టారు.తలకొండపల్లి మండలంలో 2019,లో బీసీ లకు 6 సర్పంచ్ స్థానాలు కేటాయింస్తే,ఈ ప్రభుత్వం10 ఇస్తామని 4 సర్పంచ్ స్థానాలు బీసీ లకు కేటాయించడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.లింగరావుపల్లి గ్రామంలో బీసీ లకు ఒక వార్డు రిజర్వేషన్ రాలేదని,ఆ ఊరిలో బీసీలు లేరా అని ప్రశ్నించారు.పెద్ద గ్రామపంచాయతీలో 2 వార్డు బీసీ లకు ఇచ్చారని సగం జనాభా ఉన్న బీసీ,లకు మొండి చేయి చూపించరని ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రస్తుతం ప్రకటించిన బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం పునరాలోచన చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా కార్యదర్శి జోలం వెంకటయ్య, లింగంగౌడ్,బాల కుమార్ గౌడ్,రమేశ్,దేవేందర్ యాదవ్,ఆంజనేయులు, పాండు, మల్లేష్, అంజి,తదితరులు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు స్థలాన్ని కేటాయించండి

- హెచ్ఎండిఏ కమిషనర్ కు అరికపూడి వినతి



**శేరిలింగంపల్లి, నవంబర్ 24 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విద్యాభివృద్ధి పథకాలలో భాగంగా శేరిలింగంపల్లి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు అయ్యిందని, త్వరలోనే అది కార్యరూపం దాలుస్తుందని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన హెచ్ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ను కలిసి ఇంటిగ్రేటెడ్ పాఠశాల కోసం నియోజకవర్గ పరిధిలో స్థలాన్ని కేటాయించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అనంతరం మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గానికి 200 కోట్ల రూపాయల ప్రభుత్వ నిధులతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు కావడం జరిగిందని, పాఠశాల నిర్మాణం కొరకు హెచ్ఎండిఏ పరిధిలో స్థలం మంజూరు చేయాల్సిందిగా కమిషనర్ ను కోరడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో అంతర్జాతీయ ప్రమాణాలతో పేద, మద్య తరగతి విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటులో భాగంగా శేరిలింగంపల్లి నియోజకవర్గానికి అవకాశం లభించిందని, ఎందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కి నియోజకవర్గంలో తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేయడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగానే తాను హెచ్ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ ని కలిసి స్థలం కేటాయింపు విషయమై చర్చించగా ఆయన సానుకూలంగా స్పందించడం జరిగిందన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గానికి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు కావడం ఎంతో గర్వంగా ఉందని, ఈ పాఠశాల ద్వారా పేద, మధ్యతరగతి విద్యార్థులు సైతం నాణ్యమైన విద్యను అందుకోవడం ద్వారా భవిష్యత్తులో ఉత్తమమైన పౌరులుగా, గొప్ప వ్యక్తులుగా ఎదగడానికి ఆస్కారం లభించినట్టేనన్నారు.

# పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

- పెద్దకంజెర్ల గ్రామంలో ప్రభుత్వ భూములను కబ్జాలనుండి కాపాడాలి
- కబ్జా భూములపై సమగ్ర విచారణ జరపాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట నిరసన ధర్నా
- జిల్లా కలెక్టర్‌కు వినతి

**సంగారెడ్డి టౌన్, నవంబర్ 24 (జనం సాక్షి) :** అర్హులైన పేదలందరికి ఇళ్ల స్థలాలు వెంటనే ఇవ్వాలని, పెద్దకంజెర్ల గ్రామంలో ప్రభుత్వ భూములను కబ్జాలనుండి కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వం ను డిమాండ్ చేశారు. పటాన్చెరు ప్రాంతం లో కబ్జాలకు గురవుతున్న భూములపైన సమగ్ర దర్యాప్తు జరిపించాలని అన్నారు. సోమవారం పెద్ద కంజర్ల ఇళ్ల స్థలాల సాధన కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్ కి వినతి .ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు మాట్లాడుతూ సర్వేనెంబర్ 120,121,125 లలో గత రెండు సంవత్సరాల క్రితం అప్పటి ప్రభుత్వం గ్రామంలో భూసేకరణ చేసిందని అన్నారు. ఎకరాకు 15 లక్షల 70వేలునష్టపరిహారం ఇచ్చిందని గుర్తు చేశారు. కానీ అనేక మంది రైతులకు ఇంకా నష్టపరిహారం అందలేదని అన్నారు. గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టినప్పుడు జిల్లా కలెక్టర్ గారు గ్రామస్తులు అందరికీ ఇండ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చి, నేడు మోసం చేస్తున్నారని అన్నారు. రెండు సంవత్సరాలు గడిచిన ఏ ఒక్కరికి ఇంటి స్థలం రాలేదని అన్నారు. సర్వేనెంబర్ 120, 121 ,125లలో 50 ఎకరాలు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో కబ్జాలకు గురవుతున్న మండల రెవెన్యూ యంత్రాంగం ఎందుకు పట్టించుకోవడం లేదని అన్నారు. ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించుకొని యదేచ్ఛగా రియల్ ఎస్టేట్ వ్యాపారం కొనసాగిస్తున్నారు అని అన్నారు. గ్రామస్తులు ఇంటి స్థలం కోసం ఒక గజం స్థలం ఆక్రమిస్తే పోలీసుల చేత చర్యలు చేపడుతున్నారని, రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు 40 నుంచి 50 ఎకరాల భూముల ఆక్రమిస్తున్నప్పుడు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. నేరేడు చెరువు సత్యనారాయణ రాజు నరసింహ రాజుల చేతుల్లో పూర్తిగా కబ్జాలకు గురైందని అన్నారు. అరబిందో తత్వాలు కంకర క్రషర్ ఏర్పాటు చేసుకొని విధులు నిర్వహించుకుంటూ 5 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని, రెవెన్యూ వారితో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని అన్నారు. ప్రస్తుతము పెద్దకం జిల్లా భూములు ఎంతో విలువైన అని గుర్తు చేశారు. పెద్ద కంజర్ల భూముల పైన జిల్లా రెవెన్యూ యంత్రాంగం తగిన సమగ్ర దర్యాప్తు చేపట్టి, కబ్జాల గురవుతున్న భూమిని కాపాడి ,పేదలకు ఇళ్ల స్థలాల కోసం ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాణిక్యం, పటాన్చెరు కార్యదర్శి నాగేశ్వరావ్ నాయకులు సాయిలు, మాజీ ఎంపీటీసీ జంగయ్య, నాగభూషణము, ముత్యాలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## రాష్ట్రవ్యాప్తంగా 25వ తేదీ నుంచి వడ్డీరహిత రుణాల పంపిణీ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 24 (జనం సాక్షి) :** రాష్ట్రవ్యాప్తంగా వడ్డీ లేని రుణాల పంపిణీని ఈ నెల 25వ తేదీ నుంచి ఒకేసారి ప్రారంభించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జిల్లా కలెక్టర్లతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో వెల్లడించారు. మంత్రి సీతక్క, ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రిన్సిపల్ సెక్రటరీ (ఆర్థిక) సందీప్ కుమార్ సుల్తానియా, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు మంత్రులు, ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. గత ప్రభుత్వం వడ్డీరహిత రుణాల పథకాన్ని నిర్లక్ష్యం చేసినప్పటికీ ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే దీనిని పెద్దఎత్తున పునరుద్ధరించిందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇప్పటికే రెండు మూడు విడతల్లో రుణాలు పంపిణీ చేయగా 25వ తేదీన మరో భారీ విడతగా రుణాలను అందజేయనున్నట్టు వివరించారు. ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని అన్ని జిల్లాల్లో అద్భుతంగా అమలు చేసినందుకు జిల్లా కలెక్టర్లను ఆయన ప్రశంసించారు. మహిళలు నాణ్యత, డిజైన్ పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, డిఆర్డిఓ సాంబశివరావు, హౌజింగ్ పీడీ రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.




## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

**మహేశ్వరం, నవంబర్ 24 (జనం సాక్షి) :** అనారోగ్యంతో బాధపడుతున్న నీరు పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరంలాంటిదని ఐఎన్ టీయూసీ మహేశ్వరం మండల అధ్యక్షుడు గన్నబోయిన శివ యాదవ్ అన్నారు.సోమవారం మహేశ్వరం మండలంలోని మోహబ్బత్ నగర్ గ్రామానికి చెందిన స్వర్ణగంటి యాదమ్మకు 40 వేల రూపాయలు,గోడుకొండ్ల జ్యోతికి 20 వేల రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను,మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గన్నబోయిన శివ యాదవ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పాటుపడుతుందన్నారు.స్థానిక సంస్థల ఎన్నికలల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మొహబ్బత్ నగర్ గ్రామ పంచాయతీ సెక్రెటరీ మైథిలి, ఇందిరమ్మ కమిటీ అధ్యక్షుడు చక్రియా,యమున,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం, నవంబర్ 24 (జనం సాక్షి) :** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డితో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. రఘునాథపాలెం మండలానికి చెందిన వెంకటేశ్వర్లు తమకు 2009 లో సర్వే నెంబర్ 218 లో 75 చదరపు గజాల ప్లాట్ కేటాయించడం జరిగిందని, క్షేత్రస్థాయిలో తనకు కేటాయించిన జాగాను చూపించడం లేదని, తనకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కు రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం వెంకటగిరి, గుదిమల్ల గ్రామ ప్రజలు ఇటీవల ఏదులాపురం మున్సిపాలిటీలో తమ గ్రామాలను విలీనం చేశారని, తమ గ్రామాలలో అత్యధికంగా ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి ఉంటారని, ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేయడం వల్ల స్థానిక ప్రజలపై దుష్పరిణామాలు ఎదురవుతున్నాయని, దానిని రద్దు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఖమ్మం మున్సిపల్ కమీషనర్ కు రాస్తూ పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఎర్రుపాలెం మండలం ఎర్రుపాలెం రెవెన్యూ గ్రామానికి చెందిన బాలయ్య గ్రామంలో కేజీబీవీ ఎదురుగా గ్రామకంఠ భూమి అన్యాక్రాంతమవుతుందని దానిని కాపాడాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ ఎర్రుపాలెంకు రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని అన్నారు. తల్లాడ మండలం తెలగవరం గ్రామానికి చెందిన బోక్యా తులివ్వ తనకు గ్రామంలో ఉన్న 23 గుంటల భూమి డంపింగ్ యార్డ్ క్రింద పోయిన దానికి నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, కల్లూరు సబ్ డివిజన్ కలెక్టర్ కు రాస్తూ పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, డీఆర్డీఓ సన్యాసయ్య, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ యం. అపూర్వ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

# పోస్ట్ ఆఫీస్ పొదుపు పథకాలతో ఆధునిక సేవలు..

- ఉత్తరాలు పంపే ప్రదేశం ఇప్పుడు ఆర్థిక భద్రత కేంద్రాలుగా..
- 7 నుంచి 40 బ్రాంచ్ లకు విస్తరించిన పోస్ట్ ఆఫీస్‌లు
- చిన్నపిల్లలకు, వృద్ధులకు చేరువైన తపాల సేవలు

**మణుగూరు, నవంబర్ 24 (జనం సాక్షి) :** ఒకప్పుడు ఎర్ర డబ్బా అంటే మనకు గుర్తు వచ్చేది మన ఊరు చివరలో ఒక మూలలో పోస్ట్ బాక్స్ మనకు గుర్తొచ్చేది. మనకు ఎవరైనా ఇంగ్లాండ్ లెటర్, పోస్ట్ కార్డ్ గాని బంధువులు స్నేహితుల నుంచి ఆ రోజుల్లో వస్తే ఎంతో సంతోషపడేవారు. అందులో ఏం రాశారు అని ఆత్రుతతో చూసేవారు. కాలం మారుతున్న కొద్దీ ఆ ఎర్ర డబ్బాలు కనిపించడం తగ్గిపోయింది ఉత్తరాలు రాయడం కూడా తగ్గడంతో పోస్ట్ బాక్స్ ను పూర్తిగా మర్చిపోయాము. ఇప్పుడు ఇవి కూడా ఈ పోస్ట్ ఆఫీస్ డాగ్ సేవలు లాంటి డిజిటల్ సౌకర్యాలను తీసుకొచ్చాయి. రోజుకు ఎన్నో ఉత్తర ప్రత్యుత్తరాలు వస్తుంటాయి మణుగూరు మండలంలో 40 బ్రాంచ్ ఆఫీసుల ద్వారా ఎంతోమంది సేవలు పొందుతున్నారు. దేశంలో అత్యంత విశ్వసనీయమైన శాఖగా పేరుగాంచిన భారతీయ తపాలా వ్యవస్థ (ఇండియన్ పోస్ట్ )చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ ప్రతి వర్గానికీ అనేక సేవలను అందిస్తూ ప్రజలకు మరింత చేరువవుతోంది. ఆధునిక పరిజ్ఞానంతో కలిసి ఈ సేవలు మరింత వేగవంతం, సులభతరం అయ్యాయి. సంప్రదాయ తపాలా వ్యవస్థ, ఇప్పుడు డిజిటల్ సాంకేతికతతో కలిసి ప్రతి వర్గానికీ చేరువవుతూ, ప్రభుత్వ సేవలు అందించే ముఖ్య వేదికగా మారింది. చిన్న పిల్లల భవిష్యత్ భద్రత, వ్యాపారుల వ్యాపార విస్తరణ, వృద్ధుల ఆర్థిక నమ్మకం ప్రతి అవసరానికి తపాలా శాఖ వద్ద ప్రత్యేక పరిష్కారాలు ఉన్నాయి. ఏ ఏ వర్గాల వారికి ఎలాంటి ప్రయోజనం లభిస్తుందో చాలామందికి తెలియక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**చిన్న పిల్లలకు :**

తపాలా శాఖ ద్వారా సుకన్య సమృద్ధి యోజన, ఆర్ డి వంటి పొదుపు పథకాలు అందుబాటులో ఉన్నాయి. అమ్మాయిల భవిష్యత్తు భద్రతకు ప్రత్యేకంగా రూపొందించిన సుకన్య స్కీం అత్యధిక వడ్డీ రేటుతో కుటుంబాలకు పెద్ద మేలు చేస్తోంది. పిల్లల చదువులకు భవిష్యత్తు అవసరాలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. కొన్ని పోస్టాఫీసుల్లో పిల్లల ఆధార్ నమోదు కూడా అందుబాటులో ఉంది.

ప్రైవేట్ ఉద్యోగులు,చిన్న వ్యాపారులకు: స్వంత వ్యాపారం చేసేవారికి తపాలా శాఖ సరుకు రవాణా సేవలను అందిస్తోంది. స్పీడ్ పోస్ట్ సరుకు రవాణా బల్క్ మెయిల్స్ వంటి సేవల ద్వారా దేశంలోని ఎక్కడికైనా తక్కువ ఖర్చుతో సరుకులు పంపొచ్చు. అదేవిధంగా పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (పిఎల్ఐ) ప్రైవేట్ ఉద్యోగులు, వ్యాపారులు కూడా పొందగలిగే తక్కువ ప్రీమియంతో ఉన్న లైఫ్ ఇన్సూరెన్స్ పథకం. ఐ పి పి బి (ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్) ద్వారా క్యూ ఆర్ యు పి ఐ చెల్లింపులు, డోర్‌స్టెప్ బ్యాంకింగ్ వంటి ఆధునిక ఆర్థిక సేవలు అందుబాటులో కి తీసుకొచ్చింది.

**వృద్ధులకు మెరుగైన సేవలు :**

వృద్ధులకు అత్యంత ఉపయోగకరంగా ఉండే సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీం (ఎస్సీ ఎస్ఎస్) అలాగే మంత్లీ ఇన్కమ్ స్కీమ్ (ఎమ్ ఐ ఎస్) వంటి పథకాల ద్వారా వృద్ధులకు ప్రతినెలా స్థిరమైన ఆదాయం లభిస్తోంది. డోర్‌స్టెప్ బ్యాంకింగ్ సేవలతో ఇంటి వద్దకే డబ్బు తీసుకునే, బిల్లులు చెల్లించే సౌకర్యం కల్పిస్తున్నాయి. ఇది వృద్ధులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రభుత్వ పథకాలు డిబిటి మొత్తాలు కూడా పోస్ట్ ఆఫీస్ ద్వారా సులభంగా పొందవచ్చు. వృద్ధులకు మెడిసిన్స్ కూడా ఇంటి వద్దకే వచ్చే విధంగా సేవలు అందిస్తోంది.

గ్రామీణ ప్రజలకు : పట్టణాల్లో కాదు గ్రామీణ ప్రాంతాల్లో కూడా బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్ పనిచేస్తుండటంతో అనేక సేవలు ప్రజల ఇంటి వద్దకి చేరువవుతున్నాయి.






బ్రాంచ్ పోస్టాఫీసుల ద్వారా మనీ ఆర్డర్, ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ వేతనాలు, పింఛన్లు, పార్సెల్లు వంటి సేవలు గ్రామీణ ప్రజల దరిచేరుతున్నాయి. ప్రభుత్వ పథకాల డిబిటి మొత్తాల చెల్లింపులో పోస్టాఫీసులు కీలకంగా మారాయి.

**డిజిటల్ సేవలు :**

డాక్ సేవా యాప్, ఆన్‌లైన్ ట్రాకింగ్, ఈ – పోస్టాఫీసు వంటి ప్లాట్‌ఫారమ్‌లు పోస్టల్ సేవలను మొబైల్ ఫోన్‌లోకి తెచ్చాయి. స్పీడ్ పోస్ట్ బుకింగ్ నుంచి బిల్ పేమెంట్ వరకు అనేక సేవలు ఇప్పుడు డిజిటల్‌గా అందుబాటులో ఉన్నాయి. భారతీయ తపాలా శాఖ ప్రజల అవసరాలకు అనుగుణంగా సేవలను ఆధునికీకరిస్తూ, అన్ని వర్గాలకూ అందుబాటులో ఉంచుతూ ముందుకు సాగుతోంది.






# ఎంఎస్ఎంఈ రంగాల కోసం.. సరికొత్త యాప్

**న్యూఢిల్లీ:**భారత ప్రభుత్వ సూక్ష్మ, చిన్న,మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం.. పనిచేసే స్వయంప్రతిపత్తి గల సంస్థ అయిన నేషనల్ ఇండస్ట్రీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ వాడుక, పరిధిని పెంచడానికి దేశీయంగా రూపొందించిన డిజిటల్ ప్లాట్‌ఫామ్ ఇన్‌డాప్ రూపకల్పనను నేడు ప్రకటించింది.అంతర్జాతీయంగా పోటీతత్వ భారతీయ బ్రాండ్‌లను సృష్టించడం, భారతీయ కళాకారులు మరియు చేతివృత్తులవారికి ప్రపంచ గుర్తింపును అందించడం , వికసిత్ భారత్ దార్శనికతకు దోహదపడేలా చేయడం లక్ష్యంగా దేశవ్యాప్తంగా ఎంఎస్ఎంఈ మార్కెట్‌ప్లేస్ నిర్మించబడింది. ఎనిమిది మంత్రిత్వ శాఖల మద్దతుతో, భారతదేశం అంతటా రంగంలోని వ్యవస్థాపకుల కోసం ప్రత్యేకంగా సృష్టించబడింది. ఈ ప్లాట్‌ఫామ్ అందించే సేవలు విస్తృత శ్రేణిలో ఉన్నాయి, ప్రభుత్వ పథకాల గురించి సమాచారాన్ని అందించడం, మూలధనాన్ని యాక్సెస్ చేయడం నుంచి వ్యాపార దృశ్యమానతను పెంచడం.. శిక్షణ, సామర్థ్య నిర్మాణానికి సహాయం చేయడం వరకు, ఒక బటన్ క్లిక్ చేయడం ద్వారా లేదా మీ ఫోన్‌లో ట్యాప్ చేయడం ద్వారా డిజిటల్ యాక్సెస్‌ను గణనీయంగా పెంచుతుంది..

### రెస్టారెంట్ బిల్లుపై డిస్కౌంట్..

# పేటీఎం బాస్‌పై జోకులు

**న్యూఢిల్లీ:**సాధారణంగా మధ్యతరగతివారికి డిస్కౌంట్లు అంటే మోజు ఎక్కువ. ఎక్కడ ఏది కొనాలన్నా మొదట డిస్కౌంట్ ఎంత వస్తుందా అని ఆలోచిస్తారు. కానీ సంపన్నులు కూడా వీటికి అతీతులు కాదని కొందరు నిరూపిస్తున్నారు .పేటీఎం వ్యవస్థాపకుడు విజయ్ శేఖర్ శర్మ తాజాగా ఓ రెస్టారెంట్ బిల్లుపై భారీ తగ్గింపు పొందిన విషయాన్ని సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఇది కాస్త వైరల్‌గా మారి ఆన్‌లైన్‌లో చర్చకు దారితీసింది. బిలియనీర్లు కూడా డిస్కౌంట్‌ల కోసం చూస్తారనే అంశంపై నెటిజన్లు చమత్కారాలు చేయడం మొదలుపెట్టారు.ఢిల్లీ విమానాశ్రయంలోని రాడిసన్ బ్లూ ప్లాజాలో ఉన్న ది గ్రేట్ కబాబ్ ఫ్యాక్టరీలో స్నేహితులతో కలిసి పుట్టినరోజు విందు జరుపుకొన్న విజయ్ శేఖర్ శర్మ.. డిన్నర్ బిల్లు రూ. 40,828 వచ్చినట్లు తెలిపారు. అయితే ఈజీడైనర్‌లోని ఆఫర్లు, కూపన్లు ఉపయోగించి బిల్లును రూ. 24,733కి తగ్గించగలిగారు. మొత్తం రూ. 16,095 ఆదా కావడం ఆయనను ఆశ్చర్యపరచింది.

# వ్యవసాయ ఆదాయం.. పన్ను భారం లెక్కింపు

**న్యూఢిల్లీ:**గత రెండు వారాలుగా వ్యవసాయ భూముల గురించి, వ్యవసాయ ఆదాయం గురించి తెలుసుకున్నాం. మూడో వారం ముచ్చటగా వ్యవసాయ ఆదాయం వల్ల పన్ను భారం ఎలా లెక్కించాలో ఉదాహరణలతో తెలుసుకుందాం.ఈ కాలమ్‌లో చెప్పిన ఉదాహరణలలో ప్రస్తావించిన వ్యవసాయ ఆదాయం, చట్టప్రకారం నిర్దేశించిన రూల్స్‌ను బట్టి లెక్కించినదిగా అనుకోండి.ఒక వ్యక్తి సంవత్సర ఆదాయం పూర్తిగా వ్యవసాయం నుంచే వచ్చి, ఇతరత్రా ఆదాయమేమీ లేదనుకుందాం. అలాంటప్పుడు ఆ వ్యక్తికి ఎలాంటి పన్నుభారం ఏర్పడదు. నూటికి నూరుపాళ్లు మినహాయింపే. దీని ప్రకారం చాలా మంది చిన్నకారు/సన్నకారు రైతులకు ఇన్‌కంట్యాక్స్ పడదు. సవ్యసాచి అనే వ్యక్తి వయస్సు 60 సంవత్సరాల లోపు ఉందనుకుందాం. అతను రెసిడెంటు అయి ఉండి, వ్యాపారం కలిగి ఉన్న వ్యక్తి అనుకుందాం. సాధారణంగా ట్యాక్సబుల్ ఇన్‌కం రూ. 14,00,000. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఈ వ్యక్తి కొత్త పద్ధతిని ఫాలో అయితే, శ్లాబులు/రేట్ల ప్రకారం పన్ను భారం రూ. 90,000 ఉంటుంది. విద్యా సుంకం అదనం. ఇదే సవ్యసాచికి రూ. 9,00,000 వ్యవసాయం మీద ఆదాయంగా వస్తోంది. ఇది కాకుండా పైన చెప్పిన రూ. 14,00,000 ఆదాయం కూడా ఉంది. ఇప్పుడు పన్ను ఎలా **లెక్కించాలంటే..:**వ్యవసాయ ఆదాయం, వ్యవసాయేతర ఆదాయం కలిపితే మొత్తం ఆదాయం రూ. 23,00,000. దీనిపై పన్ను= రూ. 2,90,000 వ్యవసాయ ఆదాయం, బేసిక్ లిమిట్ మాత్రమే కలిపితే మొత్తం ఆదాయం రూ.13,00,000. దీనికి సంబంధించి రిబేటు = రూ. 75,000 ఇప్పుడు నుంచిని తీసివేస్తే, అంటే రూ. 2,90,000 నుంచి రిబేటు రూ. 75,000 తీసివేస్తే కట్టాల్సిన పన్ను భారం రూ. 2,15,000గా ఉంటుంది. దీనికి విద్యా సుంకం అదనం.




**ఇప్పుడు విశ్లేషణలోకి వెళ్దాం..:**మొత్తం వ్యవసాయేతరం మీద ఆదాయం వచ్చిందనుకోండి, రూ. 2,90,000 పన్ను కట్టాలి. రూ. 2,90,000 ఎక్కువగా భావించి, ఇందులో కొంత ఆదాయం, అంటే రూ. 9,00,000 వ్యవసాయం అని అన్నాం అనుకోండి. రూల్సు ప్రకారం ఆధారాలన్నీ ఉన్నాయనుకుంటే, రూ. 75,000 రిబేటు వస్తుంది. ఈ మేరకు పన్ను భారం తగ్గుతుంది.అందరూ కేవలం రూ. 14,00,000 మీద పన్ను చెల్లిస్తే సరిపోతుంది, వ్యవసాయ ఆదాయం మీద మినహాయింపు వస్తుందని అనుకుంటారు. ఈ ఊహ అబద్ధం. నిజం కాదు. ఇక్కడో వల, మెలిక ఉన్నాయి. ఈ రెండింటి మీద ఆదాయాన్ని కలిపి స్థూల పన్ను భారాన్ని లెక్కిస్తారు. బేసిక్ లిమిట్‌కి వ్యవసాయ ఆదాయం కలిపి పన్ను లెక్కిస్తారు **దీనికి విద్యా సుంకం అదనం:**రూ. 9,00,000 వ్యవసాయ ఆదాయం కలపడంతో శ్లాబు మారుతుంది. పెద్ద శ్లాబులోకి వెళ్తారు.బేసిక్ లిమిట్‌కి వ్యవసాయ ఆదాయం కలిపితే అది తక్కువ / లేదా చిన్న శ్లాబులో ఉంటుంది.పై శ్లాబుకి వెళ్లడం వల్ల పన్ను భారం పెరుగుతుంది.రూ. 9,00,000 మీద అదనంగా రూ. 1,25,000 కట్టాల్సి వస్తోంది.


వాస్తవానికి పన్ను భారమే ఉండదనుకుంటే, అది ఏకంగా రూ. 1,25,000కు పెరిగింది.మరో కేసు. 45 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి. జీతం రూ. 8,00,000, వ్యవసాయం మీద ఆదాయం రూ. 4,00,000. పాత పద్ధతిని ఎంచుకుని, పన్ను లెక్కిస్తే రూ. 1,72,500 అవుతుంది. అందులో నుంచి రూ. 42,500 రిబేటు తీసివేయగా రూ. 1,30,000 చెల్లించాలి. విద్యా సుంకం అదనం.కొత్త పద్ధతైనా, పాత పద్ధతైనా, ఇలా కలపడాన్ని పార్షియల్ ఇంటిగ్రేషన్ అంటారు. దీని వల్ల పన్ను భారం పెరుగుతుంది.అయితే, వ్యవసాయ ఆదాయం కలపడం వల్ల, వ్యవసాయేతర ఆదాయం పెద్ద శ్లాబులోకి వెళ్లింది. ఆ మేరకు పన్ను భారం పెరిగింది. కానీ, రిబేటు ఇవ్వడం వల్ల పన్ను భారం తగ్గుతుంది.పన్ను భారాల పంపిణీ న్యాయబద్ధంగా ఉండేలా, పన్ను విధింపులో సమానత్వాన్ని పాటించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లుగా దీన్ని భావించాలి.ఏదైతేనేం, వ్యవసాయ ఆదాయాన్ని ఒక ట్యాక్స్ ప్లానింగ్ మార్గంగా భావించి, పన్ను ఎగవేత వైపు వెళ్లేవారికి ఇదొక హెచ్చరిక.

# లాభాలకు బ్రేక్..

**• నష్టాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు**


సోమవారం ఉదయం లాభాల్లో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 445.06 పాయింట్లు లేదా 0.52 శాతం నష్టంతో 84,786.86 వద్ద, నిఫ్టీ 108.65 పాయింట్లు లేదా 0.42 శాతం నష్టంతో.. 25,959.50 వద్ద నిలిచాయి. ప్రాజెక్ట్స్, జెట్ ఫ్రైట్ లాజిస్టిక్స్, శ్యామ్ సెంచరీ ఫెర్రస్ లిమిటెడ్, విఎల్ఎస్ ఫైనాన్స్, ఇండస్ట్రియల్ బేరింగ్స్ లిమిటెడ్ కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరగా.. మంగళం డ్రగ్స్ ఆర్గానిక్స్, మాగెల్లానిక్ క్లౌడ్, ఆంటెలోపస్ సెలాన్ ఎనర్జీ లిమిటెడ్, సుమిత్ వుడ్స్, యూరో ప్యానెల్ ప్రొడక్ట్స్ వంటివి నష్టాల జాబితాలో చేరాయి.






# బిలినీయర్స్ అంతా ఒక్కచోట!

**న్యూఢిల్లీ:**అసాధ్యం అనుకున్న చాలా విషయాలను ఏఐ సాధ్యం చేస్తోంది. టెక్ బిలియనీర్లు అందరూ ఒక్క చోటకు చేరిన ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఏఐ చేసిన ఈ అద్భుతంపై..
నెట్టింట్లో మీమ్స్, జోకులు వెల్లువెత్తుతున్నాయి.
1 ట్రిలియన్ స్క్వాడ్ పేరుతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫొటోలో.. ఎలాన్ మస్క్, మార్క్ జుకర్‌బర్గ్, సుందర్ పిచాయ్, జెన్సెన్ హువాంగ్, సామ్ ఆల్ట్‌మాన్, టిమ్ కుక్, జెఫ్ బెజోస్‌లు అందరూ ఒకేచోట ఉన్నారు. ఈ ఫోటోలు మస్క్ కొత్త గ్రోక్ అప్‌డేట్ ప్రకటనను తెలియజేయడానికే అని కొందరు చెబుతున్నారు. ఒక ఫొటోలో..



ఎలాన్ మస్క్ సహా చాలామంది దిగ్గజ వ్యాపారవేత్తలు కార్ పార్కింగ్ వద్ద సమావేశమైనట్లు కనిపిస్తున్నారు. మరో చిత్రంలో అందరూ కలిసి ఒక రూములో ఉన్నట్లు చూడవచ్చు. నిజజీవితంలో వీరంతా కలుసుకోవడం చాలా అరుదు అయినప్పటికీ.. ఏఐ మాత్రం వీరిని కలిపింది. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి.



# ముంబైలో నగరంలో ‘పాతాళ్ లోక్‘

### మహానగరంలో ట్రాఫిక్ బంధనం నుంచి బయటపడేలా అదిరిపోయే ప్లాన్!

**ముంబై:**జనాభా అవసరాలకు అనుగుణంగా సొంత వాహనాలు పెరిగే కొద్దీ.. నగరాల్లో ట్రాఫిక్ రద్దీ అంత కంతకూ పెరిగిపోతోంది. అయితే.. ముంబై వీధుల్లో ఆ గందరగోళం ఇక పాతాళంలోకి కరిగిపోనుంది.భూమి క్రింద మరో కొత్త లోకం తెరుచుకోబోతోంది. అవును.. ముంబై ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ వినూత్న ప్రణాళికను ప్రకటించారు. “పాతాళ్ లోక్” పేరుతో భూగర్భ టన్నెల్ నెట్‌వర్క్‌ను నిర్మించి నగర రోడ్లపై ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించనున్నట్లు సోమవారం ఆయన తెలిపారు. ఈ టన్నెల్‌లు పైభాగంలోని రహదారులకు సమాంతరంగా ఉంటూ.. మెట్రో మార్గాలతో కలుపుతూ.. ముంబైకి కొత్త రవాణా రూపకల్పనను అందించబోతున్నట్లు తెలిపారాయన. ముంబైలోని దీర్ఘకాలిక ట్రాఫిక్ సమస్యను తగ్గించడం, ప్రయాణ సమయాన్ని తగ్గించడం, కనెక్టివిటీ మెరుగుపరచడం.. పాతాళ్ లోక్ ముఖ్య ఉద్దేశం. భూమి క్రింద రోడ్లకు సమాంతరంగా పెద్ద టన్నెల్ వ్యవస్థ నిర్మిస్తారు. ఇది భూమి క్రింద సమాంతర రహదారి వ్యవస్థగా పనిచేస్తుంది. అంటే పైభాగంలోని ప్రధాన రహదారులకు “షాడో నెట్‌వర్క్”లా ఉంటుందన్నమాట.డీకన్జెషన్‌తో పైభాగంలోని రోడ్లపై వాహనాల ఒత్తిడి తగ్గి.. ట్రాఫిక్ సాఫీగా కదులుతుంది. తద్వారా ప్రయాణికులకు ‘గంటల తరబడి’ అనే నరకయాతన తప్పనుంది. అలాగే.. రవాణా సౌకర్యం మెరుగుపడటంతో వ్యాపారాలు, లాజిస్టిక్స్ వేగవంతం కానుంది. అదే సమయంలో వాహనాలు ఎక్కువసేపు నిలిచిపోకుండా కదలడం వల్ల ఇంధన వినియోగం తగ్గడంతో పాటు కాలుష్యమూ తగ్గుతుంది. ముంబై నగరం కోసం ఫడ్నవీస్ సర్కార్ అమలు చేయబోతున్న ప్రణాళికలో.. బోరివలి-గోరేగావ్ మధ్య సమాంతర రహదారి, వర్లీ-శివడి కనెక్టర్ (తదుపరి సంవత్సరం పూర్తి), బాంద్రా-టన్నెల్ ( దీని ద్వారా ఎయిర్‌పోర్ట్ యాక్సెస్ మెరుగుపరుస్తుంది). దక్షిణ ముంబై నుంచి భయందర్ వరకు విస్తరించే కోస్టల్ రోడ్ కూడా ఈ ప్రణాళికలో భాగం. అలాగే.. ఈ టన్నెల్ ప్రాజెక్ట్‌కి తోడ్పాటుగా మెట్రో విస్తరణ కూడా జరగనుంది.

# సీఎం మార్పు అధిష్ఠానం చేతుల్లో ఉంది

### వారు ఆదేశిస్తే ఐదేళ్లపాటు సీఎంగా ఉంటా: సిద్ధరామయ్య

**బెంగుళూరు(జనంసాక్షి):**కర్ణాటకలో సీఎం మార్పుపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ తరుణంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కొత్త చర్చకు తెరతీసేలా వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయిస్తే.. ఐదేళు సీఎంగా కొనసాగుతానని అన్నారు. సీఎం మార్పుపై తుది నిర్ణయం పార్టీ కేంద్ర నాయకత్వంపై ఆధారపడి ఉందని వెల్లడించారు. దానిని తాను, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అంగీకరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఐదేళ్లు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని గతంలో వ్యాఖ్యానించిన సిద్ధరామయ్య.. ఇప్పుడు అందుకు భిన్నమైన స్వరం వినిపించడం గమనార్హం. 2023లో జరిగిన కర్ణాటక విధానసభ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కాంగ్రెస్ గద్దెనెక్కిన నాటి నుంచీ రెండున్నరేళ్ల తర్వాత అధికార పంపిణీ ఉంటుందని ప్రచారంలో ఉంది. నవంబర్ 20తో ఆ రెండున్నరేళ్ల గడువు ముగిసింది. దాంతో కర్ణాటక రాజకీయాలు వేడెక్కాయి. అందుకు తగ్గట్టే సిద్ధూ డీకేతో పాటు వారి శిబిరాలకు చెందిన నేతలంతా ఢిల్లీకి రాకపోకలు సాగించడంతో ఆ ప్రచారం తీవ్రమైంది. ఇదిలా ఉంటే.. మొన్నటి వరకు ముఖ్యమంత్రి పీఠం కోసం సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌లకే పరిమితమైన రాజకీయం..ఇప్పుడు మరో దారి పట్టింది. బెంగళూరులోని మల్లికార్జున ఖర్గే నివాసానికి ముఖ్యమంత్రి పదవికి ప్రధాన పోటీదారులంతా తరలివెళ్లడం గమనార్హం. ఇక, డీకే శివకుమార్ పట్ల అధిష్ఠానం కూడా అంత సానుకూలంగా లేదని తెలుస్తోంది. ఆయన తన నాయకత్వ లక్షణాలతో పార్టీని నడిపించినా ఆయనకు మద్దతుగా ఉండే నేతల సంఖ్య పరిమితమేనని భావిస్తోంది. తనకు కాదంటే అహింద వర్గానికి చెందినవారికి అవకాశం ఇవ్వాలని మొదటి నుంచి సిద్ధూ ప్రయత్నిస్తున్నారు. ఈ సందిగ్ధత పరిస్థితులను చక్కబెట్టేందుకు రాహుల్‌గాంధీ జోక్యం చేసుకుంటారని తెలుస్తోంది.

# యూకే వీడిన లక్ష్మీ మిట్టల్

### : కారణం ఇదే..



**లండన్:**మూడు దశాబ్దాలు బ్రిటన్‌లో ఉంటూ.. అత్యంత ధనవంతులైన బిలియనీర్ల జాబితాలో ఒకరుగా నిలిచిన ఉక్కు వ్యాపారి లక్ష్మీ ఎన్ మిట్టల్ ఆ దేశానికి వీడ్కోలు పలికారు.30ఏళ్లు యూకేలో ఉన్న ఈయన ఇప్పుడు ఆ దేశాన్ని ఎందుకు వీడారు?, దీనికి కారణం ఏమిటనే వివరాలను ఇక్కడ తెలుసుకుందాం.2025 ‘సండే టైమ్స్ రిచ్ లిస్ట్’ ప్రకారం ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ వర్క్స్ ఫౌండర్ 15.4 బిలియన్ పౌండ్ల ఆస్తిని కలిగి ఉన్నారని అంచనా. దీంతో లక్ష్మీ మిట్టల్ యూకేలో ఎనిమిదవ అత్యంత ధనవంతుడిగా నిలిచారు. అయితే ఇప్పుడు ఈయన దేశాన్ని వీడటానికి ప్రధాన కారణం.. అక్కడి ప్రభుత్వం తీసుకున్న వారసత్వ పన్ను రద్దు నిర్ణయాలే అని తెలుస్తోంది.ప్రస్తుతం లక్ష్మీ మిట్టల్ స్విట్జర్లాండ్‌లో నివసిస్తున్నారు. తరువాత తాను భవిష్యత్తును దుబాయ్‌లో గడిపే అవకాశం ఉంది. ఎందుకంటే ఆయనకు ఇప్పటికే దుబాయ్‌లో ఒక భవనం ఉంది. అంతే కాకుండా ఈయనకు ఐరోపా, అమెరికాలలో కూడా ఆస్తులు ఉన్నట్లు సమాచారం. లండన్‌లోని కెన్సింగ్టన్ ప్యాలెస్ గార్డెన్స్ ప్రాంతంలో ఒక విలాసవంతమైన భవనం కూడా ఉంది.లక్ష్మీ ఎన్ మిట్టల్ 1950 జూన్ 15న రాజస్థాన్‌లో పుట్టిన లక్ష్మీ నారాయణ్ మిట్టల్.. స్టీల్ ఇండస్ట్రీలో తిరుగులేని వ్యక్తిగా ఎదిగారు. స్టీల్ ఉత్పత్తిలో ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉంది. సుమారు 24 బిలియన్ యూరోల విలువైన ఈ కంపెనీలు లక్ష్మీ ,మిట్టల్ కుటుంబం వాటా 40 శాతం వరకు ఉంది. 2021లో లక్ష్మీ మిట్టల్ సీఈఓగ బాధ్యతలు వదులుకున్న తరువాత.. ఆయన కుమారుడు ఆదిత్య మిట్టల్ సీఈఓగా బాధ్యతలు స్వీకరించారు. భారతదేశంలో పుట్టిన లక్ష్మీ మిట్టల్ 1995లో తన కుటుంబంతో పాటు లండన్‌లో స్థిరపడ్డారు. 30 ఏళ్లుగా అక్కడే ఉన్న వీరు.. అక్కడి ప్రభుత్వం తీసుకున్న వారసత్వ పన్ను రద్దు కారణంగా.. స్విట్జర్లాండ్‌కు మకాం మార్చారు. ఈయన నెట్‌వర్త్ 22 బిలియన్ డాలర్లు.

### అమెరికా హెచ్చరికలు..


# వెనిజులాకు పలు దేశాల షాక్!

**కారకాస్:** వెనిజులాలో భద్రతా పరిస్థితులు మరింతగా దిగజారడానికి తోడు, ఆ దేశ గగనతలంలో అమెరికా సైనిక కార్యకలాపాలు పెరగడంతో, ప్రపంచంలోని పలు ప్రధాన విమానయాన సంస్థలు తమ విమాన సర్వీసులను వెనిజులాకు నిరవధికంగా రద్దు చేశాయి.యునైటెడ్ స్టేట్స్‌కు చెందిన ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌ఏఏ) ఇటీవల పైలట్‌లకు కీలక హెచ్చరిక జారీ చేసింది. దేశంలో విమానాలు టేకాఫ్, ల్యాండింగ్ సమయంలో, అలాగే అన్ని ఎత్తులలో విమానాలకు బెదిరింపులు ఎదురయ్యే అవకాశాలున్నాయని దానిలో పేర్కొంది.



# ఇంత విషాదం చోటు చేసుకున్నా కంటిన్యూ చేస్తారా?

**అబుదాబి:**దుబాయ్‌లో శుక్రవారం నాటి ఎయిర్ షోలో తేజస్ యుద్ధ విమానం ప్రమాదానికి గురైన భారత వైమానిక దళం(ఐఏఎఫ్) వింగ్ కమాండర్ నమాంశ్ సియాల్(37) దుర్మరణం చెందాడు.యుద్ధ విమానం అదుపు తప్పి క్రాష్ కావడంతో పైలట్ మృత్యువాత పడ్డారు ఇంతటి విషాదం చోటు చేసుకున్న సదరు ఎయిర్ షో కొనసాగించడంపై యూఎస్ ఎయిర్ ఫోర్స్ పైలట్ మేజర్ టేలర్ ఫెమీ హీస్టర్ అగ్గిమీద గుగ్గిలం అయ్యారు.ఇంతటి దారుణం చేసుకున్నా షోను ఎలా కొనసాగిస్తారంటూ ప్రశ్నించాడు. ఇదేనా సాటి పైలట్ ఇచ్చే గౌరవం అంటూ షో నిర్వాహకులపై మండిపడ్డారు. అదే సమయంలో తాను ఈ షోలో పాల్గొననంటూ వైదొలిగారు.ఈ మేరకు ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో తన ఆవేదనను వ్యక్తం చేశారు హీస్టర్. ‘ మా తుది ప్రదర్శనను ఇవ్వడానికి మా టీమ్ సిద్ధంగా లేదు. ఈ షో నుంచి మేము



వైదులుగుతున్నాం. అందుకు కారణం.. తేజస్ యుద్ధ విమానం కూలిపోయి భారత పైలట్ దుర్మరణం చెందితే షోను కొనసాగించాలనుకోవడం మంచి పరిణామం కాదు. ఇదేనా మనం తోటి పైలట్‌కు, వారి కటుంబానికి ఇచ్చే గౌరవం?’ అంటూ ఆందోళన వ్యక్తం చేశారు.ప్రమాదం జరిగినప్పటికీ ఎగిరే ప్రదర్శనలు కొనసాగుతాయని సమాచారం అందిన తర్వాత ఏం జరిగిందనేది హీస్టర్ వివరించాడు. ప్రమాదం జరిగిన గంట, రెండు గంటల మధ్యలో అక్కడకి వెళ్లాను,. అది ఖాళీగా ఉంది. షో ఆపివేయబడుతుందని అనుకున్నాను. అలా జరగలేదు. మళ్లీ యథావిధిగా షో నిర్వహించారు. అందుకే మా టీమ్ షో నుంచి వైదొలగాలని నిర్ణయించుకుంది’ యూఎస్ ఎయిర్ ఫోర్స్ వింగ్ కమాండర్ తెలిపారు.ఆరోజు జరిగిన ప్రమాదం తేజస్ యుద్ధ విమానం కంట్రోల్ తప్పి నేలపై పడటంతో మంటలు చుట్టుముట్టాయి. ఆ ఘటనలో తేజస్ పైలట్ మాంశ్ సియాల్ ప్రాణాలు కోల్పోయాడు.

# బంగ్లాదేశ్ మాజీ ప్రధానికి తీవ్ర అస్వస్థత

బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) చైర్‌పర్సన్, మాజీ ప్రధాన మంత్రి బేగం ఖలీదా జియా తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు.గుండె, ఊపిరితిత్తులలో ఇన్ఫెక్షన్లతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రాబోయే 12 గంటలు చాలా కీలకమని వైద్యులు ప్రకటించారు.జియా కోసం ఏర్పాటు చేసిన వైద్య బోర్డు సభ్యుడు ప్రొఫెసర్ డాక్టర్ ఎఫ్ఎం సిద్ధిఖీ ఆమె ఆరోగ్యపరిస్థితిపై నిన్న రాత్రి మీడియాకు వివరించారు. “గత కొన్ని నెలలుగా, తరచుగా అనేక సమస్యలతో బాధపడుతున్న కారణంగా ఆమె( ఎవర్‌కేర్ హాస్పిటల్) చికిత్స పొందుతున్నారని, ఛాతీలో కూడా ఇన్ఫెక్షన్ ఉందని తెలిపారు. ఇప్పటికే ఆమెకు పర్మినెంట్ పేస్‌మేకర్, స్టెంట్స్ వేయడం, గుండె సంబంధిత సమస్యలతో మిట్రల్ స్టెనోసిస్ అనే పరిస్థితితో కూడా బాధపడుతున్నారన్నారు. యాంటీబయాటిక్స్‌తో చికిత్స అందిస్తున్నామని , మరోవైపు



అమెరికాకు చెందిన వైద్య నిపుణులు వర్చువల్‌గా సాయం అందిస్తున్నారని తెలిపారు ఛాతీ ఇన్ఫెక్షన్ కారణంగా, గుండె, ఊపిరితిత్తులు ఒకేసారి ప్రభావితమయ్యాయి. దీనివల్ల తీవ్రమైన శ్వాసకోశ ఇబ్బంది ఏర్పడిందన్నారు. బేగం జియాను ఇంటెన్సివ్ కేర్‌లో ఉంచి పర్యవేక్షిస్తున్నామని , రాబోయే 24 గంటల్లో వచ్చే రిపోర్ట్స్ కీలకమని ప్రొఫెసర్ సిద్ధిఖీ తెలిపారు.బేగం జియా అస్వస్థత వార్తలతో బీఎన్‌పీ నేతలు, శ్రేణుల్లో ఆందోళన నెలకొంది. ముఖ్య నాయకులు ఆమె ఆరోగ్యపరిస్థితిని సమీక్షిస్తున్నారు. త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నారు. సమస్యలతో బాధపడుతున్న విషయం తెలిసిందే.

# మీరు మాకు చెప్పాల్సింది

### ప్రధాని మోదీతో దక్షిణాఫ్రికా అధ్యక్షుడు

**జోహెన్నెస్‌బర్గ్:** జీ 20 సదస్సు దక్షిణాఫ్రికాలోని జోహెన్నెస్‌బర్గ్ వేదికగా జరిగింది. నవంబర్ 22, 23 తేదీల్లో ఈ సదస్సు నిర్వహించారు. ఐకమత్యం, సమానత్వం, సుస్థిరత తదితర అంశాల థీమ్ ఆధారంగా ఈ సదస్సును నిర్వహిస్తూ వస్తున్నారు.అయితే ఆఫ్రికా ఖండంలో జరిగిన జీ 20 సదస్సు ఇదే మొదటిది. దీని గురించి ఆఫ్రికా ఖండంలోని నేతలకు పెద్దగా అనుభవం లేదు.ఇదే విషయాన్ని దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా.. భారత ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తీసుకొచ్చారు. జీ 20 సదస్సును నిర్వహించడం అనేది తమకు అసలు అనుభవం లేదన్నారు. ఇది అత్యంత కష్టంతో కూడుకున్నదిగా నిర్వహించాక తెలిసిందన్నారు. ‘ జీ 20 సదస్సు నిర్వహణ కష్టమని మాకు చెప్పాల్సింది. మీరు చెప్పి ఉంటే దానికి దూరంగా ఉండేవాళ్లం.’ అని నవ్వుతూ అన్నారు రామఫోసా.ఇక జీ 20 సదస్సు కోసం భారత్ ఇచ్చిన సహకారం మరువలేనిదని ప్రధాని మోదీతో మాటామంతీ సందర్భంగా సిరిల్ రామఫోసా పేర్కొన్నారు. జోహన్నెస్‌బర్గ్‌లో ఆదివారం జీ20 దేశాల అధినేతల సదస్సులో ప్రధాని మోదీ పాల్గొన్నారు. పలు అంశాలపై జరిగిన చర్చా కార్యక్రమాల్లో మోదీ మాట్లాడుతూ.. ‘ టెక్నాలజీ అప్లికేషన్లు ఏ ఒక్క దేశానికో ఉపయోగపడేలా కాకుండా ప్రపంచమంతా వినియోగించుకొనేలా రూపొందించాలి. సామాన్య ప్రజల జీవితాలను మార్చే టెక్నాలజీని ప్రోత్సహించాలి.ఇండియాలో ‘అందరికోసం సాంకేతికత’అనే విధానం అమలు చేస్తున్నాం. స్పేస్ అప్లికేషన్లు, ఏఐ, డిజిటల్ చెల్లింపుల్లో తమ దేశం ముందంజలో ఉంది.. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఇండియాలో ఏఐ ఇంపాక్ట్ సదస్సు నిర్వహించబోతున్నామం. జీ20 దేశాలను ఆహ్వానిస్తున్నాం’ అని స్పష్టం చేశారు.

# బీజేపీ కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు నశించాలి

- కార్మిక చట్టాలు యదావిధిగా కొనసాగించాలి ఏఐటీయూసీ డిమాండ్



**యైటింక్లయిన్ కాలనీ నవంబర్ 24 (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా, స్వాతంత్రం రాకముందు నుండి పోరాడి తెచ్చుకున్న 29కార్మిక చట్టాలను కుదించి నాలుగు కోడ్‌లుగా మార్చడానికి నిరసనగా సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆర్జీ-2 ఏరియా పరిధిలోని అన్ని మైన్స్, డిపార్ట్మెంట్లలో యాజమాన్యానికి వినతి పత్రాలు అందజేయడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు కోడ్లలో ప్రస్తుతం అమలులో ఉన్న పరిశ్రమల విధానాల చట్టం, ఫ్యాక్టరీ చట్టం, వేతన చట్టం, గ్రాట్యుటీ చట్టం, మైన్స్ చట్టం వంటి చట్టాల ద్వారా కార్మికులకు ఉన్న పలు ప్రధాన హక్కులు కొత్త కోడ్ల వల్ల బలహీనపడనున్నాయని తెలిపారు. దీనివల్ల సింగరేణి ఉద్యోగుల సంక్షేమంపై నేరుగా ప్రభావం పడుతుందన్నారు. దీనివలన మైన్స్ యాక్ట్‌లో ఉన్న రక్షణలుకూడా నిర్వీర్యం అవుతాయి. అందువలన నూతన కార్మిక కోడ్లు రద్దు చేసి సింగరేణి ఉద్యోగులు మాత్రమే కాక దేశంలో ఉన్న అన్ని వర్గాల ఉద్యోగులకు వారి ప్రయోజనాలను రక్షించేందుకు గత 29 కార్మిక చట్టాల అమలుకు తగిన చర్యలు తీసుకోవాలి లేని పక్షంలో కార్మిక వర్గ ప్రయోజనాలు సంరక్షణ కోసం కార్మిక సంఘ ప్రతిఘటనలను యాజమాన్యాలు, ప్రభుత్వాలు ఎదుర్కోక తప్ప ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఎల్ ప్రకాష్, కందుకూరి రాజరత్నం బ్రాంచ్ ఉపాధ్యక్షులు అన్నారావు, సహాయ కార్యదర్శిలు శ్యాం సన్ మరియు గంధం సాంబశివరావు, పిట్ కార్యదర్శిలు మోటపలుకుల మహేందర్, సెగ్గం శంకర్, బొంత రాజు, రాజసాగర్, కుమారస్వామి పాల్గొన్నారు.

# 42 శాతం బీసీ రిజర్వేషన్లతో స్థానిక ఎన్నికలు జరపాలి

**రాష్ట్ర బిసి జెఏసి చైర్మన్ ఆర్.కృష్ణయ్య**



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి నవంబర్ 24 (జనంసాక్షి) :** రాష్ట్ర బీసీ జేఏసీ చైర్మన్ ఆర్.కృష్ణయ్య అధ్యక్షతన సోమవారం హైదరాబాద్ లోని సురవరం ప్రతాపరెడ్డి అడిటోరియం హాల్లో రాష్ట్ర బీసీ కుల సంఘాల జేఏసి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అర్ కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 46 జీవోతో జరుపుతున్న పంచాయతీ ఎన్నికలను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. పార్టీ పరంగా రిజర్వేషన్లతో కాదు, రాజ్యాంగ బద్ధంగా, చట్టబద్ధంగా 42 శాతం బీసీ రిజర్వేషన్లతో స్థానిక ఎన్నికలు జరపాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చట్టబద్ధంగా రిజర్వేషన్ల సాధనకై భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నామన్నారు. ఇచ్చిన మాట తప్పడం సరైంది కాదని, 46 జీవోను రద్దు చేసి ఎన్నికలను ఆపి కోర్టుల్లో న్యాయపోరాటం, కేంద్రంలో రాజకీయ పోరాటం చేయాలన్నారు. అనంతరం మాజీ బిసి రాష్ట్ర బిసి కమిషన్ చేర్మెన్ మాట్లాడుతూ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ను అమలు చేసి తీరాలన్నారు. అసెంబ్లీ సాక్షిగా అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తానన్న సిఎం మాట నిలుపుకొని ప్రధానిని, రాష్ట్రపతిని కలిపించి, బిల్లుల ఆమోదంకై ఒత్తిడి పెంచాలని, అవసరమైతే ఢిల్లీని దిగ్బంధించాలన్నారు. మాట తప్పి బీసీలను మోసగించడం దుర్మార్గమైన చర్య అన్నారు. రాష్ట్ర బీసీ జేఏసి కన్వీనర్ కొండ దేవయ్య మాట్లాడుతూ బీసీ జనాభా దామాషా ప్రకారం మంత్రి వర్గంలో, నామినేటెడ్ పోస్టుల్లో, విద్య, ఉపాధి, ఉద్యోగాల్లో బడ్జెట్లో వాటా, కోటా కేటాయించించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ సాధికారిత సంఘం అధ్యక్షులు పొలాస నరేందర్ మాట్లాడుతూ బలహీన వర్గాల రిజర్వేషన్ల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం బలహీనమైన జీవోల జారీతో, రిజర్వేషన్లు అమలు జరగడం లేదన్నారు. పార్టీ గుర్తులు, బీఫామ్స్ లేని పంచాయతీ ఎన్నికలకు పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర బీసీ సాధికారిత సంఘం నాయకులు ఆర్.వి.మహేందర్ కుమార్, గంగుల అంజలి యాదవ్, రాష్ట్ర బీసీ సాధికారిత సంఘం మహిళ అధ్యక్షులు, పొలాస వాసు, వివిధ బీసీ సంఘాల జేఏసీ నేతలు పాల్గొన్నారు.

# సర్కారు ఆసుపత్రులకు రూ.4 కోట్లతో అత్యాధునిక పరికరాలు

- జమ్మికుంట, హుజూరాబాద్, హుస్నాబాద్ ఆసుపత్రులకు రూ.కోటి చొప్పున విలువైన వైద్య పరికరాల అందజేత
- జిల్లా కలెక్టర్‌తో కలిసి ఆయా ఆసుపత్రులను సందర్శించిన కేంద్ర మంత్రి బండి సంజయ్



**కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 24 (జనంసాక్షి):** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద రోగులను టెస్టుల పేరుతో ప్రైవేట్ ఆస్పత్రులకు పంపొద్దని, వారిపై ఆర్థిక భారం మోపొద్దని, రూపాయి ఖర్చు లేకుండా పూర్తి చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి జమ్మికుంట, హుజూరాబాద్, హుస్నాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రులను ఆయన సందర్శించారు. ఈ మూడు ఆసుపత్రులకు ఒక్కొక్కటికి రూ.కోటి విలువ చొప్పున కలిపి మొత్తం రూ.3 కోట్లతో అత్యాధునిక వైద్య పరికరాలను అందజేశారు. ఈసీజీ మెషీన్, అల్ట్రాసౌండ్ మెషీన్, మల్టీపారా మానిటర్, లార్జ్ ఆటోక్లేవ్, దయాథర్మీ మెషీన్, అనస్థీషియా వర్క్‌స్టేషన్, ఈఎన్టీ హెడ్ లైట్, ఫీటల్ మానిటర్ తదితర 15 రకాల పరికరాలను బండి సంజయ్, కలెక్టర్ పమేలా సత్పతి చేతుల మీదుగా ప్రారంభించారు. ఇటీవలే వేములవాడ ఏరియా ఆసుపత్రికి రూ.1.5 కోట్లతో 16 అత్యాధునిక పరికరాలను అందించిన ఆయన, మొత్తం నాలుగు ఆసుపత్రులకు ఎన్ఎం డీసీ సీఎస్ఆర్ నిధులతో రూ.4 కోట్ల విలువైన వైద్య సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. గతంలో కరీంనగర్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తన పుట్టినరోజు కానుకగా రూ.3 కోట్ల విలువైన అంబులెన్సులు, ఎక్స్‌రే మెషీన్ సహా పలు పరికరాలు అందించిన విషయం తెలిసిందే. కొన్ని పరికరాల నిర్వహణ ఖర్చులను కూడా తన సొంత నిధులతో భరిస్తున్నట్లు బండి సంజయ్ పేర్కొ న్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు ఆయన తెలిపారు. పేదలు ఆసుపత్రికి వస్తే ఉచితంగా, నాణ్యంగా చికిత్స అందాలన్నదే తన లక్ష్యమని, అందుకోసం ఎప్పటికప్పుడు సీఎస్ఆర్ నిధులు సేకరించి పరికరాలు అందిస్తానని బండి సంజయ్ స్పష్టం చేశారు.

# మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

- రాష్ట్ర ఐటి, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖా మంత్రి వర్యులు డి.శ్రీధర్ బాబు
- 18 సంవత్సరాల నిండిన ప్రతి మహిళకు నాణ్యమైన చీర పంపిణీ
- ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేసిన మంత్రి శ్రీధర్ బాబు



**పెద్దపల్లి, నవంబర్ 24(జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం కల్పిస్తుందని రాష్ట్ర ఐ.టి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు తెలిపారు. సోమవారం పెద్దపల్లి పట్టణంలోని స్వరూప గార్డెన్స్ లో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, ఎమ్మెల్యేలు చింతకుంట విజయ రమణారావు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లిమంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ మహిళలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. మహిళలకు ఉచితంగా బస్సు రవాణా కల్పిస్తే ప్రతిపక్షాలు తట్టుకోలేక పోతున్నాయని, దీని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని వీరికి జూబ్లీహిల్స్ మహిళలు కర్రు కాల్చి వాత పెట్టారని మంత్రి తెలిపారు. గత 10 సంవత్సరాల పాలనలో ఎప్పుడైనా వడ్డి లేని రుణాలు అందించాలని ఆలోచన పాలకులకు రాలేదని, మన ప్రభుత్వం 5 సంవత్సరాల కాలంలో లక్ష కోట్ల రూపాయలు బ్యాంకు లింకేజ్ ద్వారా వడ్డీ లేకుండా మహిళా సంఘాలకు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. పెద్దపల్లి జిల్లాలో మొదటి ఏడాది వడ్డీ లేని రుణాలు కింద 9 కోట్ల రూపాయలు విడుదల చేసామని, ప్రస్తుత సంవత్సరం మరో 10 కోట్ల రూపాయలు విడుదల చేయబోతున్నామని అన్నారు. ప్రజల సంక్షేమానికి పనిచేసే ప్రభుత్వానికి ప్రజలు తమ ఆశీర్వాదం అందించాలని అన్నారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇందిరమ్మ చీరల పంపిణీ మొదటి విడత గ్రామీణ ప్రాంతాలలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు పంపిణీ చేస్తున్నామని అన్నారు. స్వయం సహాయక మహిళా సంఘాల సిసిలు, విఓ లు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం వేగవంతంగా పూర్తి చేసి చీర అందుకున్న ప్రతి మహిళ ఫోటో యాప్ లో నమోదు చేయాలని అన్నారు. పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా మొదటి విడత కింద లక్షా 20 వేల ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు మాట్లాడుతూ, గత ప్రభుత్వం బతుకమ్మ చీరల పేరిట నాసిరకం చీరలు పంపిణీ చేసి మహిళలను అగౌరవ పరిచారని అన్నారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి మంచి డిజైన్ తో నాణ్యమైన చీరలను మహిళలకు అందిస్తున్నామని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నాణ్యమైన చీరను రేవంతన్న ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. వడ్డీ లేని రుణాలు గత ప్రభుత్వం విస్మరిస్తే మన ప్రజా ప్రభుత్వం పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలో మహిళలకు వడ్డి లేని రుణాలు పంపిణీ చేసి 4 కోట్ల 73 లక్షల రూపాయల వడ్డీ డబ్బులు మహిళా బ్యాంక్ ఖాతాలలో జమ చేశామని, ప్రస్తుత సంవత్సరానికి మరో 5 కోట్ల 23 లక్షల పైగా వడ్డీ డబ్బులను కూడా మహిళా సంఘాల ఖాతాలలో జమ చేస్తామని అన్నారు. పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి బాగు చేయడం వల్ల ఓపి 3 రేట్లు పెరిగిందని, నెలకు 250 పైగా ప్రసవాలు జరుగుతున్నాయని, గర్భిణీ స్త్రీలకు అవసరమైన టిఫా స్కాన్ ఉచితంగా చేస్తున్నామని అన్నారు. ఆర్థోపెడిక్, కంటి శస్త్ర చికిత్సల విజయవంతంగా జరుగుతున్నాయని అన్నారు. రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ ప్రతి మహిళ మరో 10 మందికి ఉపాధి అందించే స్థాయికి ఎదిగే దిశగా సహకారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. రైతులు, యువత, కార్మికులు, మహిళల సంక్షేమమే అభ్యున్నతిగా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్, ఆర్.డి.ఓ.గంగయ్య, గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని, తహసిల్దార్, ఎంపిడిఓ, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, మహిళలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# అవినీతిరహిత సమాజం కోసం యువత రాజకీయాల్లోకి రావాలి

- రాష్ట్రీయ లోక్ దళ్ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్



**జగిత్యాల బ్యూరో నవంబర్ 24( జనం సాక్షి) :** అవినీతి రహిత సమాజం కోసం యువత రాజకీయాల్లోకి రావాలని రాష్ట్రీయ లోక్ దళ్ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ పిలుపునిచ్చారు. రాష్ట్రీయ లోక్ దళ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక చైతన్య రథయాత్రలో భాగంగా సోమవారం జగిత్యాల లో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పాలించిన బి ఆర్ ఎస్ ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ రెండు కూడా తెలంగాణకు తీవ్ర ద్రోహం చేశాయని విమర్శించారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడితే రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని భావించిన లక్షలాదిమంది యువత తెలంగాణ ఉద్యమంలో పనిచేశారన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత యువత ఆశలు అడియాసలు అయ్యాయని విమర్శించారు. భౌగోళిక తెలంగాణ ఏర్పడిందే తప్ప సామాజిక తెలంగాణ ఏర్పడలేదన్నారు. విద్య, వైద్యం, ఉపాధి వంటి కీలక వ్యవస్థలు పూర్తిగా దెబ్బతిన్నాయని, ఇప్పటికీ కనీసం రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉందని, 28 లక్షల మంది యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా కృషి చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ వర్గాల ఐక్యతతోనే బహుజనులకు రాజకీయ అధికారం వస్తుందని ఆ దిశగా రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ కృషి చేస్తుందన్నారు. అవినీతి రహిత సమాజ నిర్మాణం కోసం యువత పెద్ద ఎత్తున రాజకీయాల్లోకి రావాలని దిలీప్ కుమార్ పిలుపునిచ్చారు. యువతను రాజకీయాల్లోకి ఆహ్వానించడంతోపాటు వారికి ఉపాధి కల్పించే విషయంలో తమ పార్టీ తెలంగాణలోని అన్ని జిల్లాలలో జాబ్ మేలాలను నిర్వహించి పెద్ద ఎత్తున యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పార్టీ ఆధ్వర్యంలో యువతకు ఎక్కువ సీట్లు కేటాయించి అన్ని విధాల ప్రోత్సహిస్తామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని, చివరికి రిటైర్డ్ ఉద్యోగులకు చెందవలసిన లాభాలను కూడా ప్రభుత్వ దారి మళ్లించడం అన్యాయమన్నారు. బీసీలకు 42 శాతం చట్టబద్ధ రిజర్వేషన్ అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని తాము డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చకపోవడంతో ప్రజలు అధికార కాంగ్రెస్ పార్టీపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్నారు. రైతులకు ఇచ్చిన హామీలు విస్మరించడంతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలను చైతన్యం చేసి వారిని రాజకీయ అధికారానికి దగ్గర చేయడం కోసం తమ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో సామాజిక చైతన్య యాత్రలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్ ఎల్ డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రిషబ్ జైన్, హసన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

**ప్రజావాణి దరఖాస్తులను స్వీకరించిన అదనపు కలెక్టర్ డి.వేణు**



**పెద్దపల్లి, నవంబర్ 24(జనంసాక్షి) :** అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి.వేణు సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా అదన పు కలెక్టర్ డి.వేణు సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మహిళల సర్వతోముఖాభివృద్ధి మా ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**జగిత్యాల బ్యూరో నవంబర్ 24 ( జనం సాక్షి) :** మహిళల సర్వతోముఖాభివృద్ధి మా ప్రజా ప్రభుత్వం లక్ష్యం అని వారిని ఉన్నత స్థానంలో నిలుపుతామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టి, వయోవృద్ధుల, వికలాంగుల, ట్రాన్స్ జెండర్ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. కోరుట్ల మండల కేంద్రంలోని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ "ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ" కార్యక్రమంలో కోరుట్ల శాసనసభ్యులు కె. సంజయ్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ లతో కలిసి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంక్షేమ శాఖ మంత్రి మాట్లాడుతూ మహిళా సంఘాలు నిర్ణయించిన గ్రామ, మండల సమాఖ్య బాధ్యులు చీరల పంపిణీ బాధ్యతను తీసుకొని ప్రతి మహిళకూ చీరలు అందేలా చూడాలని అన్నారు. మహిళలు ఐక్యంగా ఉండాలనే సందేశంతో చీరలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలనే ఉద్దేశంతో వడ్డీ లేని రుణాలకు సంబంధించిన వడ్డీని బ్యాంకులకు ప్రభుత్వం చెల్లించిందని తెలిపారు. రైస్ మిల్లులు, సోలార్ ప్లాంట్లు, క్యాంటీన్లు, పెట్రోల్ బంకుల ఏర్పాటు, బస్సుల కొనుగోలు వంటి వ్యాపారంలో మహిళా సంఘాలకు ప్రభుత్వం తోడ్పాటునిస్తూ వారిని ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చూస్తోందని అన్నారు. ఆడబిడ్డల ఆశీర్వాదం అన్ని దేవుళ్ళ కంటే ఉన్నతమైందని తెలిపారు. ప్రజాప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో మహిళల సంక్షేమం మరియు అభివృద్ధి కోసం అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.

కోరుట్ల శాసనసభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చీరల పంపిణీ కార్యక్రమం ద్వారా అర్హులైన మహిళలందరికి చీరలు పంపిణీ చేయాలని కోరారు. అదేవిధంగా మహిళలు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోని ప్రతి మహిళా ఉన్నత స్థాయికి రావాలని ఆకాంక్షించారు. తదనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జీవాకర్ రెడ్డి, డి ఆర్డీవో రఘువరన్, ఎమ్మార్వో కృష్ణ చైతన్య, ఎంపిడివో రామకృష్ణ, స్థానిక ప్రజాప్రతి నిధులు, మండల, గ్రామ సమాఖ్య, తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక స్థిరత్వమే ప్రభుత్వ లక్ష్యం..!

**రాష్ట్ర ఐటి, పరిశ్రమలు శాఖ మంత్రి శ్రీధర్ బాబు**



**మంథని, నవంబర్ 24 (జనంసాక్షి):** మహిళలు ఆర్థిక స్థిరత్వం సాధించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తుందని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం మంథని మండలం ఎక్లాస్ పూర్ గ్రామంలో రైతు వేదిక వద్ద ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ..850 కుట్టు మిషన్లతో మంథని ప్రాంతంలో డిఆర్డిఏ ఆధ్వర్యంలో 21 ఉచిత కొట్టు శిక్షణ కేంద్రాలు ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు. మహిళలకు ఆదాయం మార్గాలు పెరగాలి, వారి కుటుంబాలు ఆర్థికంగా పటిష్టం కావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని ప్రారంభించిందని అన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలచే కుట్టు మిషన్ కేంద్రాలు, మొబైల్ క్యాంటీన్, ఆర్టిసి అద్దె బస్సుల ఏర్పాటు, సోలార్ విద్యుత్ ప్లాంట్, పెట్రోల్ బంక్ ఏర్పాటు వంటి వివిధ వ్యాపార యూనిట్ల స్థాపనకు కృషి చేస్తున్నామని అన్నారు. కుట్టు మిషన్ కేంద్రం ద్వారా మహిళలకు ఉపాధి లభిస్తుందని, ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ మహిళా సంఘాలకు ప్రభుత్వం అప్పగించిందని మంత్రి తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా అనేక మంది మహిళలు లబ్ధి పొందుతున్నారని, ప్రయాణాలు చేస్తూ వాణిజ్య వ్యాపార రంగాలలో ఎదిగేందుకు ఈ పథకాన్ని వినియోగించుకుంటు న్నారని మంత్రి తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు పక్కా ప్రణాళికలతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

**ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి : మంత్రి శ్రీధర్ బాబు**

ప్రజలకు ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. పెద్దపల్లి జిల్లా మంథని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు 12 లక్షలతో స్కానింగ్ మిషన్, ఒక లక్షల 80 వేల రూపాయలతో ఏర్పాటుచేసిన ఆర్.ఓ వాటర్ ప్లాంట్, లక్ష రూపాయలతో ఏర్పాటుచేసిన ఔట్ పేషెంట్ రూమ్, 5 లక్షల రూపాయలతో నిర్మించిన పేషెంట్ వెయిటింగ్ హాల్, లక్ష రూపాయలతో కొనుగోలు చేసిన పిల్లల వార్మర్స్, 12 లక్షల రూపాయలతో కొత్త ట్రాన్స్ఫార్మర్లు, ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్, సీసీ కెమెరాలు పనులను మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంథని ఆర్డీఓ సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, తహసీల్దార్ కుమార స్వామి, డిసిహెచ్ఎస్ డాక్టర్ శ్రీధర్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజశేఖర్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి మహిళకు ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ చేస్తాం

- కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే తప్పదు
- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**ఉమ్మడి మేడిపల్లి, నవంబర్24 (జనంసాక్షి):** అర్హులైన ప్రతి మహిళకు ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. మేడిపల్లిమండల కేంద్రంలోని పీఎన్ఆర్ గార్డెన్స్, భీమారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మహిళా ఉన్నతి, తెలంగాణ ప్రగతి కింద ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరై మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడాతు కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందని వివరించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండో రోజు నుంచే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు వారి పేరిట ఇస్తున్నామని వివరించారు. అర్హులైన ప్రతి మహిళకు ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు.

200 యూనిట్ ల ఉచిత విద్యుత్, రూ. 500 లకే గ్యాస్ సిలిండర్, నూతన రేషన్ కార్డులు ఇస్తున్నామని సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. ఇప్పటి వరకు ఉచిత బస్సు ద్వారా సుమారు 270 కోట్ల ఉచిత ప్రయాణాలు పూర్తి చేశామని వివరించారు.

**రైతుల అభ్యున్నతికి పెద్ద పిట**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని అందులో భాగంగా ఇప్పటి వరకు సుమారు 1 లక్ష 2 వేల కోట్లు రైతులకు కేటాయించాం అన్నారు..దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ఏక కాలంలో రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయడం జరిగిందని తెలిపారు..సన్నం వడ్లకు 500 బోనస్ ఇస్తామని అన్నారు. గత 60 సంవత్సరాలలో సుమారు 20 మంది ముఖ్యమంత్రులు చేయలేని అప్పు కెసిఆర్ 10 ఏళ్ళల్లో 8 లక్షల కోట్లు అప్పు చేసి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచారని విమర్శించారు..అయినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో అభివృద్ధి ప్రజా సంక్షేమం ఎక్కడ ఆపడం లేదన్నారు..కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే తప్పదన్నారు. మేం 1 లక్ష కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు కట్టినం అని గొప్పగా గత ప్రభుత్వంలో చెప్పుకున్నారని కానీ అది గత వర్షంలో కూలిపోయిందని అన్నారు..ఒక్క చుక్క కాళేశ్వరం నీళ్లు వాడకుండా రెండు పంటలు పండించామని తెలిపారు.. సిరి సిల్ల నేతన్నలకు 320 కోట్లు కేటీఆర్ బకాయి పెడితే ప్రజా ప్రభుత్వంలో అవి వారికి చెల్లించడం జరిగిందన్నారు.

- **ఇందిరా మహిళా శక్తి ద్వారా మహిళల అభ్యున్నతికి కృషి**

మేడిపల్లి మండలం పరిధిలో ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.. మేడిపల్లి మండలంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం కోసం 30 మంది లబ్ధిదారులకు స్వశక్తి సంఘం, బ్యాంకు లింకేజ్ ద్వారా 38 లక్షలు, భీమారం మండలంలో 30 మంది లబ్ధిదారులకు 54 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు..36 లక్షలతో మేడిపల్లి మండల సమాఖ్యకు ఆర్టీసీ బస్సు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. మండల పరిధిలోని 468 మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజ్ ద్వారా 40 కోట్ల 45 లక్షల రుణాలు మంజూరు చేసి జిల్లాలో రెండవ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు..శ్రీనిధి ద్వారా 397 మహిళా స్వశక్తి సంఘాలకు 3 కోట్లు 41 లక్షల రుణాలు మంజూరు చేశామని తెలిపారు. సంఘాల్లోని మహిళలకు రుణ బీమా, ప్రమాద బీమా అమలు చేస్తుందని వెల్లడించారు. అంగన్వాడీ, ఆశా కార్యకర్తలతోపాటు ఇప్పుడు ఎస్ హెచ్ జీ సభ్యులకు యూనిఫాం చీరలు పంపిణీ చేస్తున్నామని విప్ పేర్కొన్నారు.

# పార్లమెంటులో బీసీ ప్రైవేట్ మెంబర్ బిల్లు పడ్తాం



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 24 (జనంసాక్షి) :** కామారెడ్డి డిక్లరేషన్ ద్వారా బీసీలకిచ్చిన హామీలను నెరవేర్చే విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మండిపడ్డారు. బీసీలకు స్థానిక సంస్థ ఎన్నికల్లో, విద్యా,ఉద్యోగ,ఉపాధి రంగాలలోనే కాకుండా కాంట్రాక్టుల్లో 42% రిజర్వేషన్స్ కల్పిస్తామంటూ కాంగ్రెస్ పార్టీ ఆర్భాటంగా ప్రకటించి,తీరా అధికారం చేపట్టాక అమలు చేయకుండా మోసగిస్తున్నదన్నారు. బీఆర్ఎస్ అధి నాయకత్వం ఆదేశాల మేరకు రిజర్వేషన్స్ సాధనకు, రాజ్యాధికారంలో న్యాయమైన వాటా కోసం పార్లమెంటులో ప్రైవేట్ మెంబర్ బిల్లు ప్రవేశపెట్టనున్నట్లు ఎంపీ రవిచంద్ర తెలంగాణ భవన్ లో సోమవారం విలేకరుల సమావేశంలో చెప్పారు.ఎంపీ వద్దిరాజు శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ ముదిరాజ్, మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి,మాజీ మంత్రులు జోగు రామన్న,వీ.శ్రీనివాస్ గౌడ్ తదితర ప్రముఖులతో కలిసి విలేకరులతో మాట్లాడారు.కులగణన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్రపూరితంగా వ్యవహరించి బీసీల జనాభాను సుమారు 50లక్షల వరకు తక్కువ చేసి చూపారని ఆవేదన వ్యక్తంచేశారు.బిల్లు, ఆర్డినెన్స్,జంతర్ మంతర్ వద్ద ధర్నా,జీవోలంటూ రేవంత్ రెడ్డి నటిస్తూ బీసీలను దగా చేస్తుంటే,వారి నాయకుడు రాహూల్ గాంధీ బీహార్ ఎన్నికల సందర్భంగా తెలంగాణలో బీసీలకు 42% రిజర్వేషన్స్ అమలు చేస్తున్నామంటూ చెప్పడం తీవ్ర అభ్యంతరకరమని ఎంపీ రవిచంద్ర చెప్పారు.కాంగ్రెస్ నాయకత్వంలోని ఇండియా కూటమి,కేంద్రంలోని బీజేపీ సర్కార్ తల్చుకుంటే బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించడమనేది ఏ మాత్రం సమస్య కాదని ఎంపీ వద్దిరాజు స్పష్టం చేశారు.రిజర్వేషన్స్ పెంపుదలకు పార్లమెంటులో ప్రైవేట్ మెంబర్ బిల్లు ప్రవేశపెట్టడం ద్వారా అన్ని రాజకీయ పార్టీలపై మరింత వత్తిడి పెంచుతామని పేర్కొన్నారు.ఈ సమావేశంలో ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్,మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్,కరీంనగర్ జేడ్పీ మాజీ ఛైర్ పర్సన్ తుల ఉమ,బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కోతి కిశోర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ మున్సిపల్ ఎన్నికల హైవోల్టేజ్

- కాంగ్రెస్‌కు వజ్రేశ్ యాదవ్ బూస్ట్... బీఆర్ఎస్‌లో మల్లా రెడ్డి-మర్రి దూకుడు
- బీజేపీ ఈటల రాజేందర్ హవా... మూడు పార్టీలూ బూత్ స్థాయి వ్యూహాలు



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 24 (జనంసాక్షి) :** రాబోయే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో రాజకీయ వేడి గరిష్ఠ స్థాయికి చేరింది. అల్వాల్, కాప్రా, బోడుప్పల్, మేడ్చల్, దుండిగల్, జవహర్‌నగర్ మున్సిపాలిటీల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు బూత్ స్థాయి నుంచి వార్డు స్థాయి వరకు పూర్తి దూకుడుతో రంగంలోకి దిగాయి. కాంగ్రెస్‌కు జిల్లా అధ్యక్షుడిగా వజ్రేశ్ యాదవ్ నియమితుడైన తర్వాత పార్టీ కార్యకలాపాలు వేగం పుంజుకున్నాయి. అల్వాల్, కాప్రా, బోడుప్పల్ ప్రాంతాల్లో బూత్ కమిటీల పునర్వ్యవస్థీకరణ, వార్డు నాయకుల సమన్వయం, స్థానిక సమస్యలపై చర్చలు జోరుగా సాగుతున్నాయి. అధికారంలో ఉన్న పార్టీగా మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ ఈసారి గట్టి పట్టు సాధించాలని ప్రయత్నిస్తోంది. బీఆర్ఎస్ మాత్రం తన బలమైన గద్దలను కాపాడుకునేందుకు పెద్ద ఎత్తున కదలికలు మొదలుపెట్టింది. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లా రెడ్డి నేరుగా రంగంలోకి దిగడంతో మేడ్చల్, దుండిగల్, గుండ్లపోచంపల్లి ప్రాంతాల్లో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నిండింది. అదే సమయంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కాప్రా, అల్వాల్, మల్కాజిగిరి పరిధిలో ప్రజా భేటీలు, అభివృద్ధి సమీక్షలతో బీఆర్ఎస్‌కు మళ్లీ బలం తెచ్చేందుకు శ్రమిస్తున్నారు.

ఇక బీజేపీ వైపు చూస్తే మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ వ్యక్తిగతంగా హై వోల్టేజ్ ప్రచారం నడిపిస్తున్నారు. కాప్రా, ఘట్‌కేసర్, బోడుప్పల్, అల్వాల్‌లో పర్యటిస్తూ కేంద్ర పథకాల ప్రయోజనాలు, స్థానిక సమస్యలపై పార్టీ వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. యువతలో బీజేపీకి పెరుగుతున్న మద్దతు, బూత్ స్థాయి సంస్థాగత బలోపేతం పార్టీకి బలమైన అడ్వాంటేజ్‌గా మారాయి. రోడ్లు, తాగునీరు, మురుగునీటి పారుదల, చెత్త సమస్య, స్ట్రీట్ లైట్లు, పట్టణ మౌలిక సదుపాయాలు ఈ ఎన్నికల్లో ప్రధాన అజెండాగా మారాయి. మూడు పార్టీలూ ఈ సమస్యలను తమవైపు తిప్పుకునేందుకు రకరకాల వ్యూహాలు అమలు చేస్తున్నాయి. మొత్తం మీద మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఈసారి రాష్ట్ర స్థాయిలోనే అందరి చూపు ఆకర్షించే హాట్ జోన్‌గా మారింది.

# బిసిలను నిట్టనిలువుగా ముంచిన కాంగ్రెస్

- జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి
- రిజర్వేషన్లలో గందరగోళంతో మరింత అన్యాయం



**ఇబ్రహీంపట్నం, నవంబర్ 24(జనం సాక్షి) :** గత శాసనసభ ఎన్నికలలో నమ్మిన పాపానికి బిసిలను కాంగ్రెస్ పార్టీ నిట్టనిలువుగా ముంచిందని జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి మండిపడ్డారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని, ఏటా 20 వేల కోట్ల రూపాయల నిధులు బిసి సబ్ ప్లాన్ కింద ఇస్తామని, ప్రభుత్వ కాంట్రాక్టులలో 25 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని కామారెడ్డి డిక్లరేషన్ లో హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఒక్కటి కూడా అమలు చేయలేదని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం స్థానిక సంస్థల బిసి రిజర్వేషన్లు 33 శాతానికి పెంచుతూ అసెంబ్లీలో తీర్మానం చేసి, ఆర్డినెన్స్ జారీ చేస్తే కాంగ్రెస్ పార్టీ కోర్టుకు వెళ్లి దానిని రద్దు చేయించిందని ఆయన గుర్తు చేశారు. ఆనాడు చెల్లని ఆర్డినెన్స్ ఈరోజు 42 శాతానికి పెంచితే ఎలా చెల్లుతుందని ఆయన ప్రశ్నించారు. చట్టప్రకారం బిసి రిజర్వేషన్ల పెంపు కేంద్రం ఆమోదంతో రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్లో సవరణలు జరిగితేనే సాధ్యమవుతుందని చెప్పారు. అన్నీ తెలిసే కావాలని తప్పుడు హామీలు ఇచ్చి బిసిలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని ఆయన ఆరోపించారు. ఇప్పుడు పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇస్తామని చెబుతూ సిగ్గు విడిచి మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

42 శాతం రిజర్వేషన్ల మాట దేవుడెరుగు కనీసం 23 శాతం కూడా ఇవ్వలేదని అన్నారు. మంచాల మండలంలో 23 సర్పంచ్ స్థానాలకు గాను కేవలం రెండు స్థానాలు , యాచారం మండలంలో 24 స్థానాలకు గాను కేవలం నాలుగు స్థానాలు మాత్రమే బిసిలకు కేటాయించారని ఆయన వివరించారు. డెడికేటెడ్ కమీషన్ రిపోర్టును ప్రజలముందు పెట్టకుండా ఇష్టానుసారంగా రిజర్వేషన్లు ప్రకటించి బిసి, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు న్యాయబద్ధంగా దక్కాల్సిన స్థానాలను దక్కకుండా చేశారని ఆయన విమర్శించారు. నియోజకవర్గంలో రిజర్వేషన్లలో గందరగోళం జరుగుతున్నా, బిసిలకు అన్యాయం జరుగుతున్నా స్థానిక ఎమ్మెల్యే నోరు మెదపకపోవడం దేనికి సంకేతమని ఆయన ప్రశ్నించారు. అసమగ్ర రిజర్వేషన్ల విధానంపై ప్రభుత్వం వెంటనే విచారణ జరిపి కనీసం చట్టం ప్రకారం ఆయా వర్గాలకు న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య, మాజీ ఎంపిపి కృపేష్, మాజీ జెడ్పీటీసీ రమేష్ గౌడ్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

# కుత్బుల్లాపూర్ ప్రెస్‌క్లబ్ నూతన కమిటి ప్రమాణ స్వీకారం


- సమాజ సంక్షేమమే మీడియా ధ్యేయం కావాలి
- రిపోర్టర్ల సంక్షేమమే యూనియన్ లక్ష్యం : విరాహత్ అలీ



**కుత్బుల్లాపూర్ నవంబర్ 24 (జనం సాక్షి) :** సమాజ సంక్షేమమే జర్నలిస్టుల ధ్యేయమని టీయూడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ అన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ ప్రెస్ క్లబ్ టియుడబ్ల్యూజే (ఐజేయు) నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం షాపూర్ నగర్‌లోని శుభం బాంకెట్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విరాహత్ ఆలీ ముఖ్య అతిధిగా హరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన గోలిపెల్లి దయాకర్ రెడ్డి ని అలాగే వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సాయిబాబా,రెడ్డెబోయిన మల్లేశ్ లను ,కార్యవర్గ సభ్యులను సన్మానించి అభినందించారు. అనంతరం విరాహత్ అలీ మాట్లాడుతూ రిపోర్టర్ల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ పనిచేస్తుందని అన్నారు. అన్ని కష్ట నష్టాల్లో యూనియన్ ప్రతి ఒక్క రిపోర్టర్ కు అండగా నిలుస్తుందని అన్నారు. అదే సమయంలో ప్రతి విలేఖరి కూడా సమాజం పట్ల భాధ్యతగా పనిచేయాలని సూచించారు. అతి త్వరలోనే జరల్నిస్టులు శుభవార్త వింటారని తెలిపారు.జర్నలిస్టుల కోసం నిబద్దతతో పనిచేస్తున్న యూనియన్ కేవలం టీయూడబ్ల్యూజే-ఐజేయూ అని పునరుద్ఘాటిచారు. విలేఖర్ల పేర్లతో కొంత మంది బెదిరింపులకు పాల్పడుతూ రిపోర్టర్ల వృత్తికి మచ్చ తెస్తున్నారని వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. త్వరలోనే రిపోర్టర్లకు జర్నలిస్ట్ హెల్త్ కార్డు ద్వారా అన్ని ప్రైవేటు మరియు కార్పోరేట్ హస్పిటల్స్ లో కూడా ఉచితంగా వైద్యం అందబోతుందని తెలిపారు.అనంతరం కుత్బుల్లాపూర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గోలిపెల్ల దయాకర్ రెడ్డి మాట్లాడుతూ గతంలో 75 మంది సభ్యులుగా ఉన్న ఐజేయూ యూనియల్ ఈ రోజు 110 మంది సభ్యులతో అతి పెద్ద యూనియన్ గా పటిష్టంగా మారిందన్నారు. కుత్బుల్లాపూర్ ప్రెస్ క్లబ్ నిర్మాణం మధ్యలోనే ఆగిందని దానిని అందరి సహాయ,సహాకారాలతో పూర్తి చేసి అతి త్వరలోనే పూర్తి చేస్తామని అన్నారు. ప్రెస్ క్లబ్ నిర్మాణమే కమిటీ ప్రధాన మొదటి ప్రాధాన్య అంశమని అన్నారు. అఅలాగే అతిధిలుగా హజరైన రాష్ట్ర కోశాధికారి మోతే వెంకట్రాం రెడ్డి,జిల్లా కార్యధర్శి వెంకట్రాం రెడ్డి, నేషనల్ కౌన్సిల్ సభ్యులు నాగేంద్ర చారి గార్లను కమిటీ సభ్యులు శాలువా కప్పి ఘనంగా సన్మానించి మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ ప్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు జీ సితారామా రావు, దేవెందర్ గుప్తా, కల్కిమూర్తి, వి సురేశ్ గౌడ్, శ్రీధర్ కార్యనిర్వాహక కార్యదర్శులు రణధీర్, శేషారెడ్డి, సంయుక్త కార్యదర్శులు జీ శ్రీనివాస్, ప్రవీణ్, ఎండీ అన్వీర్, ఎల్లంపల్లి నర్సింహ్ములు, కోశాధికారి శివశర్మ, సంతోష్ యాదవ్, లక్ష్మణ్, లియాఖత్ ఆలీ, గ్రంధాలు, సంతోష్ ,నవీన్ రాజు, నాగబాబు, శ్రీనివాస్ సలహాదారులు గంటూర్ శేఖర్, నాగేంద్ర చారి ,కే వెంకట్,ముక్కర్ల లాలయ్య,గౌస్ మొయినుద్దిన్, సిరిగిరి శ్రీనివాస్, కుంట అనీల్, కుత్బుల్లాపూర్ ప్రెస్ క్లబ్ సభ్యులందరూ పాల్గొన్నారు.

## మహిళల ఆత్మగౌరవానికే ప్రతికగా ఇందిరమ్మ చీరలు

**ఇందిరా మహిళ శక్తి చీరలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



**తలకొండపల్లి నవంబర్ 24(జనంసాక్షి):** తెలంగాణ ఆడపడుచుల ఆత్మ గౌరవాన్ని ఇనుమడింపజేసేలా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ చీరల పంపిణీకి శ్రీకారం చుట్టిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు.సోమవారం తలకొండపల్లి సమీపంలోని దేవకి గార్డెన్,లో మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలను అధికారులు,ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అందజేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తుంది అని తెలిపారు.తలకొండపల్లి మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతాను అని చెప్పారు.త్వరలోనే వెల్జాల గ్రామానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు చేస్తున్నామని,11 సంవత్సరాలు దేశ ప్రధానిగా పేదలకు ఇందిరమ్మ ఇండ్లు,భూములు పంచడంతోపాటు అనేక సంస్కరణలు చేపట్టిన ఉక్కు మహిళ,మాజీ ప్రధాని భారతరత్న ఇందిరా గాంధీ పేరుపైన తెలంగాణలోని 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు ఇందిరా మహిళా శక్తి చీరలను అందజేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అమనగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ యటా గీత నరసింహా,పిసిసి సభ్యులు శ్రీనివాస్ గౌడ్,పిఎసిఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి,ఏపీఎం రామస్వామి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకూరు ప్రభాకర్ రెడ్డి,కిసాన్ సెల్ కార్యదర్శి మోహన్ రెడ్డి,సీనియర్ నాయకులు కాసు శ్రీనివాస్ రెడ్డి,ఏఎంసి డైరెక్టర్లు అంజయ్య గుప్తా, శ్యాంసుందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, అజీమ్, డేవిడ్ కాకి కృష్ణ, ఆవంచ నరసింహారెడ్డి, యాదగిరి, రాజేందర్ నాయక్, మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు, సంఘాల మహిళలు, నాయకులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

*విద్యా నైపుణ్యంలో అగ్రగామిగా, ఆసియాలో అతిపెద్ద విద్యా సంస్థలలో ఒకటిగా గుర్తింపు పొందిన నారాయణ గ్రూప్.. మరో సాహసోపేతమైన చొరవ చూపింది. 'ది వన్ స్కూల్' పేరుతో స్కూల్‌ను ప్రారంభించింది. అభ్యాసాన్ని పునర్నిర్వచించడంలో నారాయణ గ్రూప్ చేపట్టిన అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులలో ఒకటిగా 'ది వన్ స్కూల్' నిలువనుంది.*

# మానేరు వాగు చెక్ డ్యామ్ ఘటనపై సమగ్ర విచారణ

- ఘటనా స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్
- హైదరాబాద్ ఫోరెన్సిక్ నిపుణుల బృందంతో ఆధారాల సేకరణ
- సహజంగా జరిగిందా లేక విధ్వంసమా అనే కోణంలో దర్యాప్తు ముమ్మరం



**కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 24 (జనంసాక్షి):** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్, జమ్మికుంట పట్టణ పరిధిలోని తనుగుల గ్రామ శివారులో మానేరు వాగుపై నిర్మించిన చెక్ డ్యామ్ దెబ్బతిన్న ఘటనపై జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ సీరియస్ గా స్పందించింది. సోమవారం రోజు కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం సంయుక్తంగా ఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. నవంబర్ 21వ తేదీ రాత్రి సమయంలో ఈ చెక్ డ్యామ్ దెబ్బతిన్న విషయం తెలిసిందే. అయితే ఈ ఘటన నీటి ప్రవాహానికి సహజంగా జరిగిందా? లేక ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా విధ్వంసానికి పాల్పడ్డారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో, జమ్మికుంట పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**శాస్త్రీయ విచారణ, క్లూస్ టీం పరిశీలన**

ఘటనా స్థల పరిశీలనలో భాగంగా అధికారులతో పాటు హైదరాబాద్ నుండి వచ్చిన ఫోరెన్సిక్ ల్యాబ్ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకట్ రాజ్ నేతృత్వంలోని బృందం, కరీంనగర్ క్లూస్ టీం సభ్యులు, ఫింగర్ ప్రింట్ ఇన్స్పెక్టర్లు రాజు, స్వర్ణజ్యోతి అక్కడ క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... ఈ ఘటనకు గల అసలు కారణాలను వెలికితీయడానికి పూర్తి స్థాయి విచారణ జరుపుతున్నామని, సాంకేతిక నిపుణుల సహకారంతో అక్కడి నుండి నమూనాలు సేకరించామని వీటిపై ప్రయోగశాలలో అవసరమైన పరీక్షలు నిర్వహించి, సమగ్ర నివేదిక వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. నివేదిక ఆధారంగా ఎవరైనా బాధ్యులని తేలితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో హుజురాబాద్ ఏసీపీ మాధవి, పెద్దపల్లి ఏసీపీ కృష్ణ, ఇన్స్పెక్టర్లు రామకృష్ణ గౌడ్, లక్ష్మీనారాయణ లతో పాటు ఎస్సైలు శేఖర్ రెడ్డి, ఆవుల తిరుపతి, నీటి పారుదల శాఖ అధికారులు , ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# డిసిఓ ఉత్తర్వులు బేఖాతర్..?

- అందుబాటులో పెట్టని అటెండెన్స్ రిజిస్టర్..!
- సీఈఓ కు చెక్ పవర్ ఇవ్వని చైర్మన్
- ఈ కార్యాలయంలో ఎవరికివారే.. యమునా తీరే!



**వనపర్తి ప్రతినిధి నవంబర్ 24 (జనంసాక్షి) :** వనపర్తి జిల్లా కేంద్రంలోని నాగవరం సింగిల్ విండో కార్యాలయంలో జిల్లా కోపరేటివ్ అధికారి రాణి ఉత్తర్వులు బేఖాతర్ చేశారు. ఈ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది తీరు ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా మారింది. ఇక్కడ సీఈఓ గా పనిచేస్తున్న కే.రవీందర్ నిబంధనలను అతిక్రమించి జీతభత్యాలు తీసుకున్నారని సింగిల్ విండో చైర్మన్ మధుసూదన్ రెడ్డి ఫిర్యాదు చేయడంతో గతంలో ఆయనను అధికారులు సస్పెండ్ చేశారు. నిబంధనల ప్రకారమే జీతభత్యాలు తీసుకున్నానని ఆయన హైకోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు రవీందర్ కు పెండింగ్ లో ఉన్న, ప్రస్తుతం పని చేస్తున్న రోజుల్లో వేతనం ఇస్తూ ఉద్యోగంలో చేర్చుకోవాలని ఉత్తర్వులు ఇచ్చింది. ఇటీవల సీఈఓ లను జిల్లా అధికారులు బదిలీ చేశారు. కానీ ఆయన రిలీవ్ కాకుండా హైకోర్టుకు వెళ్లి స్టేటస్కో ఆర్డర్ తెచ్చుకున్నారు. దీంతో ఆయన ఇక్కడే పనిచేస్తున్నారు. ఉద్దేశపూర్వకంగా చైర్మన్ మధుసూదన్ రెడ్డి కార్యాలయ అటెండెన్స్ రిజిస్టర్ అందుబాటులో లేకుండా దాచిపెట్టారు. దీంతో సీఈఓ రవీందర్ జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. నాకు చెక్ పవర్ ఇవ్వడం లేదని, అటెండెన్స్ రిజిస్టర్ అందుబాటులో లేకుండా చేశారని డిసిఓ రాణి కి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో డిసీఓ కార్యాలయం నుండి సింగిల్ విండో కార్యాలయంలో అటెండెన్స్ రిజిస్టర్, రవీందర్ బదిలీపై విచారణ అధికారిని నియమించారు. విచారణలో జరిగిన వివరాలను డిసిఓ కార్యాలయంలో అధికారి అందజేశారు. ఈ నెల 18న డిసిఓ రాణి సింగిల్ విండో కార్యాలయానికి ఉత్తర్వులు పంపారు. అందులో సీఈఓ రవీందర్ హైకోర్టును ఆశ్రయించి బదిలీపై స్టేటస్కో ఆర్డర్స్ తెచ్చుకున్నారని, కావున తదుపరి హైకోర్టు ఆర్డర్స్ వచ్చేవరకు సీఈవోగా రవీందర్ ను నాగవరం సింగిల్ విండో కార్యాలయంలో ఉద్యోగిగా పరిగణించాలని, కార్యాలయంలో హాజరు పట్టికను సీఈవో రవీందర్ కు అందుబాటులో ఉంచాలని సింగిల్ విండో చైర్మన్ మధుసూదన్ రెడ్డికి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ప్రతిని సీఈవో రవీందర్, చైర్మన్ కు అందజేశారు. కానీ ఉత్తర్వులు వచ్చి వారం రోజులు అవుతున్న సింగిల్ విండో కార్యాలయంలో అటెండెన్స్ రిజిస్టర్ అందుబాటులో లేదు. దీంతోపాటు సీఈఓ రవీందర్ కు చెక్ పవర్ ఇవ్వలేదు. అయితే జిల్లా కోపరేటివ్ అధికారి ఉత్తర్వులు ఇచ్చిన సింగిల్ విండో చైర్మన్ ఆ ఉత్తర్వులను బేఖాతరు చేసి పట్టించుకోకపోవడంతో పలు విమర్శలు వస్తున్నాయి. ఓ జిల్లా స్థాయి అధికారి సీఈఓ ను విధుల్లోకి తీసుకొని చెక్ పవర్ ఇవ్వాలని, అటెండెన్స్ రిజిస్టర్ అందుబాటులో ఉంచాలని ఆదేశించిన ఆమె ఆదేశాలను పట్టించుకోకపోవడంతో ఈ కార్యాలయంలో ప్రభుత్వ నిబంధనలు, జిల్లా అధికారుల ఉత్తర్వులు, సూచనలు అమలు కావడం లేదని విమర్శలు వస్తున్నాయి.

**అటెండెన్స్ రిజిస్టర్ అందుబాటులో ఉంచమన్నాం**
**డిసిఓ రాణి**

ఈ విషయంపై జిల్లా కోపరేటివ్ అధికారి రాణిని వివరణ కోరగా సీఈవోగా రవీందర్ ను విధుల్లోకి తీసుకొని చెక్ పవర్ ఇవ్వాలని, ఆయనకు అందుబాటులో అటెండెన్స్ రిజిస్టర్ పెట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నామని చెప్పారు. ఉత్తర్వులు ఇవ్వడమే మా పని అని, మేము పోయి ఆ పని చేయలేము కదా అని ఆమె నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు.

**చెక్ పవర్ ఇవ్వలే.. రిజిస్టర్ కనపడలే**
**సీఈవో కే.రవీందర్**

ఇదే విషయంపై సీఈఓ రవీందర్ ను వివరణ కోరగా ఈనెల 18న డిసిఓ కార్యాలయంలో ఉత్తర్వుల కాపీని అందుకున్నానని, అందులో సీఈఓగా నన్ను విధుల్లో తీసుకొని చెక్ పవర్ ఇవ్వాలని, అటెండెన్స్ రిజిస్టర్ అందుబాటులో ఉంచాలని ఆ ఉత్తర్వులో పేర్కొన్నట్లు ఆయన చెప్పారు

**ఈ కార్యాలయంలో ఎవరికి వారే.. యమునా తీరే**

నాగవరం సింగిల్ విండో కార్యాలయంలో అధికారులు, క్రింది స్థాయి సిబ్బంది ఎవరికి వారే యమునా తీరే అన్నచందంగా వ్యవహరిస్తున్నారు. సోమవారం మీడియా ప్రతినిధులు సింగిల్ విండో కార్యాలయానికి వెళ్లి అటెండెన్స్ రిజిస్టర్, సీఈఓ కు చెక్ పవర్ విషయంపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు ఆసక్తికరమైన విషయాలు బయటకు వచ్చాయి. సీఈఓ గా పనిచేస్తున్న రవీందర్ అటెండెన్స్ రిజిస్టర్ లో సంతకాలు పెట్టకూడదనే దురుద్దేశంతో చైర్మన్ మధుసూదన్ రెడ్డి రిజిస్టర్ ను దాచి పెట్టినట్లు తెలుస్తుంది. సిబ్బందిని రిజిస్టర్ గురించి అడిగితే రెండు రోజులకు ఒకసారి సంతకాలు పెడుతున్నామని, చైర్మన్ ఛాంబర్లో రిజిస్టర్ ఉందని, చాంబర్ తాళం వేసి ఉంటుందని చెప్పారు.

ఈ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది వరి కొనుగోలు కేంద్రాల వద్దకు వెళుతున్నామని చెప్పి తమ సొంత పనులు చేసుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు ఎక్కడికి వెళ్తున్నారో కార్యాలయంలో సమాచారం ఉండడం లేదని తెలుస్తుంది. చైర్మన్ తనకు ఇష్టం వచ్చినప్పుడు కార్యాలయానికి వస్తుంటాడని, అధికారులు వరి కొనుగోలు పేరు చెప్పి రియల్ ఎస్టేట్ బిజినెస్, ఇతర పనులు చేసుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై జిల్లా స్థాయి అధికారులు విచారణ చేపట్టి చైర్మన్, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు

**ఫోన్‌కు స్పందించని చైర్మన్**

నాగవరం సింగిల్ విండో చైర్మన్ మధుసూదన్ రెడ్డిని జిల్లా కో-ఆపరేటివ్ అధికారి పంపిన ఉత్తర్వుల గురించి తెలుసుకునేందుకు ఫోన్ చేయగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు. ఆయనను నేరుగా కలిసేందుకు సింగిల్ విండో కార్యాలయానికి వెళ్లిన కార్యాలయంలో అందుబాటులో లేరు



## ప్రశాంత్ నగర్ కాలనీలో సెంట్రల్ మిడియన్ పనులపై కమిషనర్ సమీక్ష

**రాజేంద్రనగర్, నవంబర్24(జనంసాక్షి) :** బండ్లగూడ జాగీర్ నగర పాలక సంస్థ పరిధిలోని 17వ డివిజన్ ప్రశాంత్ నగర్ కాలనీలో జరుగుతున్న సెంట్రల్ మిడియన్ డెవలప్మెంట్ పనులను మున్సిపల్ కమిషనర్ బి. శరత్ చంద్ర శనివారం అధికారులతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. కమీషనర్ నిర్మాణ నాణ్యత, మిడియన్ వెడల్పు, డ్రైనేజ్ సదుపాయాలు, ట్రాఫిక్‌కు అడ్డంకులు లేకుండా పనుల నిర్వహణ వంటి అంశాలను వివరంగా పరిశీలించి సంబంధిత శాఖా అధికారులకు పలు సూచనలు అందజేశారు. పనులు నిర్దేశిత గడువులో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా డిప్యూటీ ఈఈ జి. యాదయ్య, ఎఈఈ వి. రాజ్‌కుమార్, టిపిఎస్ జి. రాకేష్ కమిషనర్‌కు పనుల పురోగతిని వివరించారు. స్థానిక కాలనీ నివాసులు కూడా పాల్గొని తమ సూచనలు, సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
25 నవంబర్ 2025

# సీసీఐ రూల్స్‌తో పత్తి రైతులకు పరేషాన్

- పత్తి రైతుల సమస్యలను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దృష్టికి తీసుకెళ్లిన రైతు కమిషన్
- రాజ్ భవన్‌లో గవర్నర్‌తో రైతు కమిషన్ బృందం భేటీ



హైదరాబాద్ (జనంసాక్షి) : రాజ్ భవన్ లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తో రైతు కమిషన్ బృందం భేటీ అయ్యింది. ఈ సమావేశంలో రాష్ట్రంలో పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు గవర్నర్ దృష్టికి కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు కేవీఎన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, రాములు నాయక్, భవానీ రెడ్డి, భూమి సునీల్ తీసుకెళ్లారు. రాష్ట్రంలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ ) పత్తి కొనుగోలు కేంద్రాలను ఆలస్యంగా తెరిచిందని, అంతేకాదు పత్తి రైతులు పత్తి అమ్ముకోవాలన్నా కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన కపాస్ కిసాన్ యాప్ లో నమోదు చేసుకోవాలని నిబంధన పెట్టడంతో అమాయక రైతులు ఇబ్బందులు పడ్తున్నారు. దానికి తోడు ఎకరాకు 7 క్వింటాళ్ల పత్తి మాత్రమే ననే కండిషన్ కూడా రైతుకు తలనొప్పిగా మారిందని గవర్నర్ కు కమిషన్ వివరించింది. ఈసారి రాష్ట్రంలో 48 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. అధిక వర్షాలు, మొంథా తుఫాన్ వల్ల పత్తి రైతులు తీవ్ర నష్టపోయారు. తుఫాన్ ను ఎదుర్కొని సాగుచేసిన పత్తి రైతుకు సీసీఐ నిబంధనలు పరేషాన్ చేస్తున్నాయని కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి గవర్నర్కు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతుల నుండి కమిషన్ కార్యాలయానికి ఫిర్యాదులు వస్తున్నాయని.. రైతుల విన్నపాన్ని కమిషన్ బృందం.. తమరి దృష్టికి తీసుకొస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా కేంద్రం విడుదల చేసిన విత్తన చట్టం ముసాయిదా -2025 పై అభ్యంతరాలు వున్నాయన్నారు. ఇప్పటికే రాష్ట్ర రైతాంగం, రైతు సంఘాల నేతలు.. కేంద్ర విత్తన చట్ట ముసాయిదా-2025 పై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నట్లు గవర్నర్ దృష్టికి కమిషన్ తీసుకెళ్లింది. పత్తి రైతుల విషయంలో కమిషన్ ఇచ్చిన వినతిపత్రానికి గవర్నర్ సానుకూలంగా స్పందించారు. సీసీఐ విషయంలో కేంద్రంతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. ఇక విత్తన చట్టం ముసాయిదా విషయంలో వివరాలతో మరోసారి కలవాలని గవర్నర్ కోరినట్లు రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తెలిపారు.

# గౌరవెల్లి సహా తెలంగాణ ప్రాజెక్టులకు త్వరగా అనుమతులు ఇవ్వండి

- కేంద్ర అటవీ, పర్యావరణ శాఖల కార్యదర్శిని కలిసిన మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణలో గౌరవెల్లి సహా.. ఇతర ఇరిగేషన్ ప్రాజెక్టులకు త్వరగా పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని.. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖల కార్యదర్శి తన్మయికుమార్‌ను రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. సెక్రెటరీ కోఆర్డినేషన్ డా.గౌరవ్ ఉప్పల్‌తో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్.. ఢిల్లీలో తన్మయికుమార్‌ను కలిశారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న నీటిపారుదల ప్రాజెక్టులు, వాటికి సంబంధించిన అనుమతులపై చర్చించారు. సుప్రీంకోర్టు ధర్మాసనం మే 2025లో ఇచ్చిన 'వనశక్తి' తీర్పును ఇటీవల వెనక్కి తీసుకుందని.. దీనిపై న్యాయసలహా తీసుకొని.. అనుమతుల మంజూరు చేస్తామని తన్మయికుమార్ చెప్పినట్టు మంత్రి వివరించారు. ప్రాజెక్టులకు త్వరగా అనుమతులు మంజూరు చేస్తే.. ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు అందించే అవకాశాలు పెరుగుతాయని కార్యదర్శికి వివరించినట్లు మంత్రి తెలిపారు. కేంద్రమంత్రి భూపేందర్ యాదవ్ విదేశాల్లో ఉన్న కారణంగా.. తన్మయికుమార్‌ను కలిసి.. ప్రాజెక్టుల అనుమతుల గురించి చర్చించినట్టు చెప్పారు.

# స్వయం సహాయక మహిళా సంఘాలకు శుభవార్త

- రూ. 304 కోట్ల వడ్డీ లేని రుణాలు విడుదల చేసిన తెలంగాణ ప్రభుత్వం
- ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి సీతక్క



హైదరాబాద్ (జనంసాక్షి) : స్వయం సహాయక మహిళా సంఘాలకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్తను అందించింది. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ మహిళా స్వయం సహాయక సంఘాల ఖాతాల్లో రూ. 304 కోట్ల వడ్డీ లేని రుణాలు ప్రభుత్వము జమ చేసింది. మొత్తం 3,57,098 సంఘాలకు ఈ నిధులు చేరాయి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, పంచాయతీ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క.. సెర్ప్ సీఈఓ దివ్యాదేవరాజన్, జిల్లా డిఆర్డిఏ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ములుగు జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి సీతక్క ఏటూరునాగారం నుంచి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. మహిళలను ఆర్థికంగా నిలబెట్టడం పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఈ సందర్భంగా మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ప్రతి ఏడాది రూ. 25 వేల కోట్లకు తగ్గకుండా మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తూ, వాటికి వడ్డీ భారం లేకుండా ప్రభుత్వం తరఫునే వడ్డీలను చెల్లించడం కొనసాగుతోందని తెలిపారు. తాజాగా రూ.304 కోట్ల వడ్డీలను చెల్లించినట్టు పేర్కొన్నారు. దీంతో ఇప్పటివరకు గ్రామీణ సంఘాలకు రూ. 1,118 కోట్ల వడ్డీ రహిత రుణాలు చేరాయన్నారు. ఇవి కాకుండా పట్టణ మహిళా సంఘాలకు సుమారు రూ. 300 కోట్ల వడ్డీ లేని రుణాలను చెల్లించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా పక్షపాత ప్రభుత్వమని, ఆడబిడ్డల ఆర్థిక భద్రత కోసం వేల కోట్ల రూపాయల నిధులను సమకూరుస్తూ, వారి అభివృద్ధికి దారితీసే పథకాలను అమలు చేస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు. మహిళలపై వడ్డీల భారం లేకుండా ప్రభుత్వమే వాటిని భరిస్తోందని, మహిళల సాధికారతను శాశ్వతంగా నిలబెట్టే విధానాలతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. గత ప్రభుత్వం మహిళా సంఘాలకు చెల్లించాల్సిన రూ. 3,500 కోట్ల వడ్డీలను ఎగవేసిందని, స్వయం సహాయక మహిళలు కష్టపడి పొదుపుగా పెట్టుకున్న అభయహస్తం నిధులను కూడా కాజేసిందని గుర్తు చేశారు. మహిళల కష్టాన్ని దోచుకున్న బీఆర్ఎస్ పెద్దలకు మహిళా సంక్షేమంపై మాట్లాడే నైతిక హక్కే లేదని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం మహిళా సంఘాలకు నిధులను పారదర్శకంగా, సకాలంలో అందిస్తూ వారి ఆర్థిక శక్తిని మరింతగా పెంచే దిశగా కృతనిశ్చయంతో పనిచేస్తుందని తెలిపారు.

# డాక్టర్ కుటుంబానికి 'డిజిటల్ అరెస్టు' ఉచ్చు

- రక్షించిన తెలంగాణ సైబర్ బ్యూరో
- సీబీఐ అధికారులమని బెదిరించి, మూడు రోజులు మోసానికి పాల్పడిన సైబర్ మోసగాళ్లు




హైదరాబాద్ (జనంసాక్షి) : సీబీఐ అధికారులమని చెప్పుకొంటూ సైబర్ మోసగాళ్లు బెదిరింపులకు పాల్పడిన 'డిజిటల్ అరెస్టు' ఉచ్చు నుంచి భద్రాచలం ప్రాంతానికి చెందిన 80 ఏళ్ల వైద్యుడి కుటుంబాన్ని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు రక్షించారు. కొత్తగూడెం జిల్లాలోని డిస్ట్రిక్ట్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ అధికారులు అత్యంత వేగంగా స్పందించి, మూడు రోజులు కొనసాగిన ఈ తీవ్రమైన మోసాన్ని అడ్డుకున్నారు.

భద్రాచలంలో నీలా నర్సింగ్ హోమ్‌ను నిర్వహిస్తున్న 80 ఏళ్ల డాక్టర్ బుద్ధరాజు సుబ్బరాజు ఆయన కోడలు, మనవరాలు ఈ సైబర్ మోసానికి బాధితులయ్యారు. నవంబర్ 20, గురువారం రోజున డాక్టర్ సుబ్బరాజుకు సీబీఐ అధికారులమని చెప్పుకొనే వ్యక్తుల నుంచి వాట్సాప్ వీడియో కాల్ వచ్చింది. ఆయన ఆధార్ కార్డుతో ముంబైలో ఓ బ్యాంకు ఖాతా ఉందని, అది ఏకంగా 100కు పైగా క్రిమినల్ కేసులలో ఉపయోగించబడిందని అబద్ధాలు చెప్పి కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేశారు. అంతేకాక, వారిని "సీబీఐ పర్యవేక్షణలో ఉంచినట్లు" హెచ్చరించి, ఎవరితోనూ మాట్లాడకూడదని, ప్రతి గంటకూ వీడియో కాల్ ద్వారా అందుబాటులో ఉండాలని ఒత్తిడి చేశారు. ఈ క్రమంలో, వారి బ్యాంకు ఖాతాల వివరాలు, ఎఫ్‌డీలు, ఇంట్లో ఉన్న నగదు వివరాలను మోసగాళ్లు తీసుకున్నారు. ఎఫ్‌డీలను వెంటనే రద్దు చేసి, ఆ డబ్బును వారికి పంపడానికి సిద్ధం కావాలని మూడు రోజులుగా నిరంతరం ఒత్తిడి చేశారు. ఈ కారణంగా ఆ కుటుంబం మూడు రోజులుగా తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై, ఇంట్లోనే ఉండిపోయింది.

## సహాయకుడి అప్రమత్తతతో కాపాడిన పోలీసులు

కుటుంబం ఫోన్ ఎత్తకపోవడం, డాక్టర్ సుబ్బరాజు ఆసుపత్రికి రాకపోవడాన్ని గమనించిన ఆయన సహాయకుడు అనుమానం వ్యక్తం చేశాడు. పదేపదే ప్రశ్నించగా అసలు విషయం బయటపడింది. వెంటనే ఆ సహాయకుడు నవంబర్ 23 రాత్రి కొత్తగూడెం సైబర్ క్రైమ్ డీఎస్పీ అశోక్ బాబుకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. సమాచారం అందిన వెంటనే డీఎస్పీ అశోక్ బాబు, ఇన్స్పెక్టర్ జితేందర్‌లు ఆ రాత్రే డాక్టర్ సుబ్బరాజు ఇంటికి చేరుకున్నారు. వెంటనే మోసగాళ్లతో ఆ కుటుంబానికి ఉన్న సమస్యను అడ్డుకున్నారు. అధికారుల వేగవంతమైన చర్యల వల్ల ఆ కుటుంబానికి జరగాల్సిన పెద్ద మొత్తంలో ఆర్థిక నష్టం తప్పింది. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ సమయోచితంగా స్పందించి వృద్ధుడి కుటుంబాన్ని రక్షించిన డీఎస్పీ అశోక్ బాబు, ఇన్స్పెక్టర్ జితేందర్‌లను అభినందించారు. ప్రస్తుతం, సైబర్ క్రైమ్ పోలీసులు సాంకేతిక దర్యాప్తును ప్రారంభించారు. మోసగాళ్ల ఐపి చిరునామాలు, కాల్ రూటింగ్ వివరాలు, పరికరాల గుర్తింపు సంఖ్యలను విశ్లేషిస్తున్నారు. సర్వీస్ ప్రొవైడర్లు, జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ ప్లాట్‌ఫామ్‌తో సమన్వయం చేసుకుంటూ మోసగాళ్ల నెట్‌వర్క్‌ను ధ్వంసం చేయడానికి చర్యలు కొనసాగుతున్నాయి.


ఈ సందర్భంగా తెలంగాణ పోలీసులు ప్రజలకు ముఖ్యంగా వృద్ధులకు ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. పోలీసులు, సీబీఐ లేదా ఏ ప్రభుత్వ సంస్థ కూడా ఎప్పుడూ 'డిజిటల్ అరెస్టులు' లేదా వాట్సాప్ విచారణలు చేయదని, చట్టంలో ఏ అధికారికి కూడా డబ్బును ఎక్కడికైనా ట్రాన్స్‌ఫర్ చేయమని చెప్పే అధికారం లేదని స్పష్టం చేశారు. సైబర్ మోసం జరిగిందని అనుమానం వస్తే వెంటనే 1930కు కాల్ చేయాలని లేదా **www.cyber-crime.gov.in**లో ఫిర్యాదు చేయాలని కోరారు.

# ఇజ్రాయెల్ దాడిలో హెజ్‌బొల్లా కీలక నేత హతం

బీరుట్ (జనంసాక్షి) : లెబనాన్ రాజధాని బీరుట్‌పై ఆదివారం ఇజ్రాయెల్ జరిపిన క్షిపణి దాడిలో హెజ్‌బొల్లా చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా వ్యవహరిస్తున్న హయథమ్ అలీ తబ్‌తబ్కె సహా ఐదుగురు చనిపోగా 24 మంది గాయపడ్డారు. జూన్‌లో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరాక బీరుట్‌పై ఇజ్రాయెల్ దాడి జరపడం ఇదే మొదటిసారి. బీరుట్ శివారులోని హారెట్ హెచ్‌చీక్ ప్రాంతంలో ఓ అపార్టుమెంట్‌పై కచ్చిత లక్ష్యంతో దాడి జరిపినట్లు ఇజ్రాయెల్ ఆర్మీ ప్రకటించింది. హెజ్‌బొల్లా సీనియర్ మిలిటెంట్ హయథమ్ అలీ తబ్‌తబ్కె హతమయ్యాడని తెలిపింది. ఇప్పటికే రెండు పర్యాయాలు ఈయనపై ఇజ్రాయెల్ హత్యాయత్నం చేసినట్లు సమాచారం. తాజాగా జరిగిన క్షిపణి దాడిలో హయథమ్ గాయపడ్డారా లేదా చనిపోయారా అనేది హెజ్‌బొల్లా ధ్రువీకరించలేదు. దాడి కారణంగా అపార్టుమెంట్ భవనం పూర్తిగా దెబ్బతిందని, పలు కార్లతోపాటు చుట్టుపక్కల భవనాలు కూడా ధ్వంసమయ్యాయని తెలుస్తోంది. రెండు క్షిపణులు ఆ భవనంపై పడినట్లు స్థానికులు తెలిపారు. హెజ్‌బొల్లాలోని శక్తివంతమైన రద్వాన్ యూనిట్‌కు హయథమ్ సారథ్యం వహిస్తున్నారు. అమెరికా ప్రభుత్వం 2016లో ఈయన్ను ఉగ్రవాదిగా ప్రకటించింది. ఈయన తలపై 5 లక్షల డాలర్ల రివార్డు ఉంది. ఇదిలా ఉండగా.. హయథమ్ అలీ టార్గెట్ కారణంగా దహియేలో భయాందోళన నెలకొంది. అక్కడ దాడులకు కొన్ని క్షణాల ముందు యుద్ధ విమానాల గర్జన విన్నట్లు నివాసితులు తెలిపారు. వాహనాలు మరియు భవనాలు ధ్వంసమై కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడిలో 24 మందికిపైగా పౌరులు మృతి చెందినట్టు లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. అయితే, హెజ్‌బొల్లా కమాండర్‌కు నివాసంగా ఉన్న బీరుట్ దక్షిణ శివారు ప్రాంతాలలో ఇజ్రాయెల్ దాడి చేయడం ఇదే మొదటిది.

# పెషావర్‌లో ఆత్మాహుతి దాడి..

## ముగ్గురు మృతి



పెషావర్ (జనంసాక్షి) : పాకిస్తాన్‌లోని పెషావర్ ఉద్రిక్తతలతో అట్టుడుకుతోంది. ఈరోజు (సోమవారం) ఉదయం ఇక్కడి ఫ్రాంటియర్ కార్ప్స్ (ఎఫ్‌సీ)పారామిలిటరీ దళ ప్రధాన కార్యాలయంపై ముష్కరులు, ఆత్మాహుతి బాంబర్లు దాడి చేయడంతో ఆ ప్రాంతం అల్లకల్లోలంగా మారింది. రాయిటర్స్ నివేదికల ప్రకారం ఈ భీకర దాడిలో ముగ్గురు మృతి చెందినట్లు పోలీసు అధికారులు ధృవీకరించారు. ఈ సమన్వయ దాడి అనంతరం భద్రతా దళాలు అప్రమత్తమై, పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నించాయి. దాడుల వెనుక ఇద్దరు ఆత్మాహుతి బాంబర్లు ఉన్నారని రాయటర్స్ పేర్కొంది. దాడి వ్యూహంలో భాగంగా తొలుత ఆత్మాహుతి బాంబర్ ప్రధాన కార్యాలయం ముఖద్వారంపై దాడి చేసి, తనను తాను పేల్చుకోగా, ఆ వెంటనే మరొక బాంబర్ దళాల దృష్టిని మళ్లించి, ఆ అవకాశాన్ని ఉపయోగించుకుని ఆవరణలోకి ప్రవేశించినట్లు ఒక సీనియర్ అధికారి తెలిపారు. ఈ దాడి సమయంలో రెండు భారీ పేలుళ్లు సంభవించాయని, వెంటనే భారీగా కాల్పుల శబ్దాలు వినిపించాయని స్థానికులు సోషల్ మీడియాలో వెల్లడిరచారు. దాడి జరిగిన వెంటనే చట్ట అమలు సిబ్బంది, సైన్యం, పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని, ఆ ప్రాంతాన్నంతా చుట్టుముట్టారు. ప్రధాన కార్యాలయం లోపల ఇంకా కొందరు ఉగ్రవాదులు ఉండవచ్చని , పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నామని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. కాగా భద్రతా దళాలు ఘటన జరిగిన వెంటనే ఎఫ్‌సీ ప్రధాన కార్యాలయం వెలుపలి రహదారిని మూసివేసి, ఆ ప్రాంతంలో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశాయి. పెషావర్‌లోని పారామిలిటరీ ప్రధాన స్థావరంపై జరిగిన ఈ ఆత్మాహుతి దాడి, దేశ భద్రతకు పెను సవాలుగా పరిణమించింది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో నిర్బంధ ఆపరేషన్ కొనసాగుతోంది. ఈ ఉగ్రవాదులను నిలువరించేందుకు భద్రతా బలగాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి.

# దర్శకుడు ప్రమోద్ కుమార్ హఠాన్మరణం



హైదరాబాద్, నవంబర్24 (జనంసాక్షి) : తెలుగు సినిమా రంగంలో మరో విషాద సంఘటన చోటు చేసుకుంది. సీనియర్ దర్శకుడు ప్రమోద్ కుమార్ హఠాన్మరణం చెందారు. మాస్ మహరాజా రవితేజ కెరీర్ ప్రారంభ దినాల్లో ఆయన హీరోగా తెరకెక్కిన సినిమా 'మనసిచ్చాను'. సిహెచ్ సుధాకర్ నిర్మించిన ఈ సినిమాతో ప్రమోద్ కుమార్ దర్శకుడిగా పరిచయం అయ్యారు. తొలుత దర్శకత్వ శాఖలో పనిచేసిన రవితేజ ఆ తర్వాత పలు చిత్రాలలో చిన్న చిన్న పాత్రలు చేశారు. 1999లో ఆయన సోలో హీరోగా 'నీ కోసం' మూవీ వచ్చింది. ఆ తర్వాత కూడా కొన్ని సినిమాల్లో కీలక పాత్రలు పోషించిన రవితేజ... సోలో హీరోగా వచ్చిన రెండో సినిమా 'మనసిచ్చాను'. ఇందులో మణిచందన హీరోయిన్ గా నటించింది. ఈ సినిమాకు ముందు ప్రమోద్ కుమార్... 'చిటికెల పందిరి'లో ఆ చిత్ర కథానాయకుల్లో ఒకరైన ఆనంద చక్రపాణి పరిచయంతో నటించారు. ఆపైన దర్శకత్వం వైపే మొగ్గు చూపారు. రవితేజ హీరోగా 'మనసిచ్చాను' చిత్రాన్ని రూపొందించిన తర్వాత ఆయనకు మరే అవకాశం రాలేదు. అయినా సినిమా రంగంలోనే కొనసాగుతూ ఉన్నారు.

# డాక్టర్‌కు వీసా నిరాకరణతో ఆత్మహత్య

హైదరాబాద్, నవంబర్24 (జనంసాక్షి) : వీసా రాకపోవడంతో ఓ వైద్యురాలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. హైదరాబాద్ పద్మారావు నగర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. కొద్ది రోజుల క్రితం డాక్టర్ రోహిణికి వీసా నిరాకరించినట్లు తెలుస్తోంది. దీంతో ఆమె మనస్థాపం చెంది నిద్రమాత్రలు మింగినట్లు సమాచారం. ఈ క్రమంలోనే రోహిణి గదిలో సూసైడ్ నోట్ లభ్యమైంది. వైద్యురాలు మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. చిలకలగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రోహిణి మృతదేహానికి వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. గుంటూరులో ఆమె అంత్యక్రియలను కుటుంబ సభ్యులు పూర్తి చేశారు.

# మా అమ్మ క్షేమంగానే ఉన్నారు

- ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నాం: సిఎం రమేష్



హైదరాబాద్, నవంబర్24 (జనంసాక్షి) :తన తల్లి చింతకుంట రత్నమ్మ ఆరోగ్య పరిస్థితిపై దుష్ప్రచారం జరుగుతోందని.. ఈ వార్తలను ఎవరూ నమ్మవద్దని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ తెలిపారు. హైటెక్ సిటీ యశోద ఆస్పత్రిలో ఆమె చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు ఎంపీ రమేశ్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. కొన్ని వార్త పత్రికల్లో, వాట్సాప్ గ్రూపుల్లో తన తల్లి స్వర్గస్తులు అయ్యారని అసత్య ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వార్తలు పూర్తిగా అవాస్తవం, నిరాధారమని వాపోయారు. దయచేసి ఎవరూ అలాంటి తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని, ప్రచారం చేయవద్దని విన్నవించారు. తన తల్లి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నప్పటికీ, ఆమెకు నిరంతరం వైద్యులు చికిత్స అందిస్తున్నారని చెప్పుకొచ్చారు. తమ కుటుంబం తరపున అందరూ చేస్తున్న ప్రార్థనలకు హృదయపూర్వక ధన్యవాదాలు అని అనకాపల్లి ఎంపీ రమేష్ పేర్కొన్నారు.


# డబుల్ ఇళ్ల పేరుతో వసూళ్లు

- మధ్యవర్తిపై ప్రజల ఆరోపణలు

సంగారెడ్డి, నవంబరు 24 (జనంసాక్షి) : సంగారెడ్డి జిల్లాలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇప్పిస్తానని పేదలను నమ్మించి ఓ వ్యక్తి మోసం చేశాడు. అమీన్ పూర్ మండలం కిష్టారెడ్డిపేటకు చెందిన బీహెచ్‌ఈఎల్ ఉద్యోగి ప్రసన్న కుమార్ పై బాధితులు ఆరోపణలు చేస్తున్నారు. జోష్ బ్రదర్ అనే మధ్యవర్తి ద్వారా పరిచయమైన ప్రసన్న కుమార్.. ఒక్కొక్కరి దగ్గర నుంచి రూ. 3 లక్షల నుంచి నాలుగైదు లక్షలు వసూలు చేశాడని పేర్కొంటున్నారు. మొత్తం 69 మంది దగ్గర నుంచి రూ. రెండు కోట్ల 50 లక్షల రూపాయల వరకు మోసం చేశాడని ఆరోపణలు చేస్తున్నారు. అయితే, జోష్ అనే వ్యక్తి ద్వారా డబ్బులను ప్రసన్న కుమార్ దండుకున్నాడు.. 2021 నుంచి నేడు, రేపు ఇప్పిస్తామంటూ ప్రసన్న కుమార్ మాయమాటలు చెప్తున్నాడని బాధితులు పేర్కొంటున్నారు. అయితే, కిష్టారెడ్డిపేటలోని ప్రసన్న కుమార్ ఇంటికి వెళ్తే వాచ్ మెన్, కుక్కలతో దాడి చేయించాడని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అమీన్ పూర్ పోలీస్ స్టేషన్ లో బీహెచ్‌ఈఎల్ ఉద్యోగి ప్రసన్నకుమార్ పై ఫిర్యాదు చేశారు. జోష్ ను నిలదీయగా ప్రసన్న కుమార్ కే మొత్తం డబ్బులు ఇచ్చానని చెప్తున్నాడు. దీంతో తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. మాకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వకపోయినా సరే, మా డబ్బులు మాకు ఇప్పించాలని వేడుకుంటున్నారు.

# బడాబాబుల ఆక్రమణలపై సామాన్యుల పోరాటం

- సమస్యల పరిష్కారానికి హైడ్రా ప్రజావాణిలో 64 ఫిర్యాదులు



హైదరాబాద్, నవంబర్ 24 (జనంసాక్షి) : బడాబాబుల ఆక్రమణలతో ఇబ్బందులు పడుతున్న సామాన్యులు హైడ్రా ప్రజావాణిని ఆశ్రయించారు. రహదారులు, పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కబ్జా చేసుకుంటూ పోతుంటే గతంలో మాదిరి గమ్మున ఉండట్లేదు. దశాబ్దాల సమస్యలకు వెనువెంటనే హైడ్రా పరిష్కారం చూపడంతో.. ధైర్యాన్ని కూడగట్టుకొని వచ్చి ప్రజావానిలో ఫిర్యాదు చేస్తున్నారు. లే ఔట్లను చూపించి ఆక్రమణలు జరుగుతున్న తీరును వివరిస్తున్నారు. కాలనీలోంచి సాఫీగా సాగిపోయే వరద కాలువను.. బడా బిల్డర్స్ అడ్డుకుంటున్న వైనాన్ని హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఇదే పరిస్థితి రహదారుల విషయంలోనూ జరుగుతోంది. లే ఔట్‌లోకి జరిగి మరీ రహదారులను కాజేసేస్తున్నారు. మూసాపేట ఆంజనేయనగర్‌లో కబ్జాలకు గురైన 2 వేల గజాల పార్కును హైడ్రా కాపాడిందని.. దీనిని పార్కుగా అభివృద్ధి చేసే బాధ్యతను కూడా హైడ్రా తీసుకోవాలని అక్కడి నివాసితులు కోరారు. ఈ మేరకు హైడ్రా ప్రజావాణిలో దరఖాస్తు అందజేశారు. ఇలా సోమవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 64 ఫిర్యాదులందాయి. ఉద యం 11 గంటల నుంచి రాత్రి 7.30 వరకూ ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించి సమస్య పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులకు అప్పగించారు. ఫిర్యాదు దారుల ముందే గూగుల్ మ్యాప్స్, రెవెన్యూ, సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్స్ ఆధారంగా అక్కడ పరిస్థితులు గతంలో ఎలా ఉండేవి.. ఇప్పుడు ఎలా మారాయి వివరించి పరిష్కార మార్గాలు సూచించడంతో ఫిర్యాదుదారులు ఊరట చెందారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370